ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మార్చి 07, 2010

Entered

వందేళ్ళ
అంతర్జాతీయ మహిళా దినోత్సవం
ప్రత్యేక సంచిక

మార్చి 8 శతవార్షికోత్సవం సోషలిస్టు మూలాలు
- బృందాకరత్

మార్పులు సాధించినా బాధలు తీరలా
- ఎస్. పుణ్యవతి

మహిళా! మేలుకో!!
- కె. స్వరూపరాణి

దేశాధినేత్రులు

రాజకీయ రంగంలోనూ మహిళలు అత్యున్నత పాత్ర పోషిస్తున్నారు. దేశంలోని అన్ని రంగాలనూ సమన్వయపరుస్తూ, శాంతిభద్రతలను కాపాడుతూ, రాగద్వేషాలకతీతంగా అందరినీ తృప్తిపరుస్తూ, విదేశాలతో సత్సంబంధాలను ఏర్పరచుకుంటూ అభివృద్ధి దిశగా నడవడమంటే సులువు కాదు. ఒక విధంగా చెప్పాలంటే కత్తిమీద సాము వంటిది. అంతటి అత్యున్నతమైన పదవి రాష్ట్రపతి పదవి. దాన్ని కూడా నేడు మహిళలు సునాయాసంగా నిర్వహిస్తున్నారు. ఆచితూచి అడుగేసి దేశాభివృద్ధికి పాటుపడుతున్నారు. నేడు మన రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఒక మహిళ కావడం మనకెంతో గర్వకారణం. ఇలా రాష్ట్రపతి పదవిని అలంకరించి దేశాన్ని విజయపథంలో నడిపించిన, నడిపిస్తున్న నారీమణులు ప్రపంచవ్యాప్తంగా చాలా మందే ఉన్నారు. వారు క్రిస్టియానా ఇ. ఫెర్నాండెజ్ కిర్చెనర్ - అర్జెంటీనా, రాణి రెండవ మార్గరెట్ - డెన్మార్కు, మేరీ మెక్‌లీస్ - ఐర్లాండు, టార్జా హాలోనెన్ - ఫిన్‌లాండ్, దాలియా సెబాస్టియన్ -లిథియేనియా, డోరిస్ లుథార్డ్ - స్విట్జర్లాండు, మిచెల్లీ బెచ్‌లెట్ జెరియా - చిలీ, గ్లోరియా మకాపగల్ - ఫిలిప్పైన్స్, రాణి బీట్రిక్స్ - నెదర్లాండ్స్.... వీరంతా భావితరాలకు స్ఫూర్తిప్రధాతలే.

ENTERED

మనలో మాట

నిద్ర లేవాలి పురుష ప్రపంచం!



ఆ మధ్య పత్రికలో ఓ వార్త చాలా తమాషాగా అనిపించింది.

ఆ ఊళ్లో మహిళలు మాత్రమే ఉంటారట! వండుకునేది వాళ్లే, తినేదీ వాళ్లే! పని చేసేది వాళ్లే, ఫలితం పొందేదీ వాళ్లే! మగమహరాజుల ఆర్డర్లాంటి ఆదేశాలూ, అభ్యర్థనల్లాంటి ఉత్తర్వులూ అక్కడ వినిపించవు. పక్కా ఆడవాళ్ల రాజ్యం అన్నమాట. 12 ఏళ్లు నిండిన ప్రతి మగాడూ ఆ ఊరికి పరాయి కిందే లెక్క! ఈ వార్తను చాలామంది మహిళలు చదివి ఉండరు. ఎందుకంటే- ఇంటి మగరాయుళ్లు ముందు జాగ్రత్తగా దానిని సెన్సారు చేసి ఉంటారు. అలాంటి రాజ్యం ఇక్కడా ఏర్పడితే- తాము పప్పులుడికించుకోలేరు కాబట్టి- జాగ్రత్త పాటించి ఉంటారు.

అయినా, ఎంత జాగ్రత్త వహించినా మగ దర్జాలకు మాత్రం గడ్డుకాలం తప్పేటట్టు లేదు. ఎవడి సేవ వాడే చేసుకోవాల్సిన ఒంటరి ఎడారి బతుకు దాపురించబోతోంది. ఆడపిల్లల సంఖ్య రానురాను దారుణంగా పడిపోవడమే దీనికి కారణం. దేశంలో తొలి జనాభా లెక్కలు తీసిన 1901లో స్త్రీ, పురుషుల నిష్పత్తి 972 : 1000 ఉంది. 2001 నాటికి 933 : 1000కి పడిపోయింది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే భరతావని మహిళలు లేని మగ ధరణిగా మిగిలిపోతుంది. వరకట్నాలు అటకెక్కి కన్యాశుల్కాలూ రంగంలోకి వస్తాయి. చేతులు కాల్చుకోవడం, బట్టలుతుక్కోవడం వన్‌సైడెడ్ యాక్టివిటీ అయిపోతుంది. మగాడిగా పుట్టే బదులు మానై పుడితే బాగుణ్ణు అని చింతించే రోజులొస్తాయి. తోడు లేని ఒంటరి బతుకు దుప్పటి లేని వింటరు రాత్రి అయిపోతుంది. ఇలాంటి దుస్థితి పగవాడైన మగాడికి కూడా వద్దేవద్దు!

ఈ ప్రమాదం తప్పటానికి కొన్ని దొడ్డ దారులున్నాయి. ఆకాశంలో సగం అంటున్న మహిళలు అవనినిండా ఉండాలంటే వారిని అన్ని రంగాల్లోకీ ఆహ్వానించాలి. అవునన్నా కాదన్నా అవుతున్నది అదే కాబట్టి- చట్టసభల్లోనూ సగం చోటివ్వాలి. వాళ్లకీ మగాళ్ల కష్టనష్టాలు అర్థమవుతాయి. సభలు కొత్త శోభతో రంజిల్లుతాయి. ఇంకా దేశంలో మహిళలు మరీ తక్కువగా ఉన్న జమ్మూ కాశ్మీర్, ఉత్తర ప్రదేశ్, బీహార్‌లాంటి రాష్ట్రాల్లో నిత్య అశాంతికి కారణం ఏమిటో కనుక్కోవాలి. మహిళలు పురుషుల కన్నా ఎక్కువగా ఉన్న కేరళ అంత అందంగా, ప్రశాంతంగా ఎందుకు వెలిగిపోతుందో పరిశోధించాలి. తెలివైన మగాళ్లు ఈ తేడాలకు కారణమేమిటో తేలిగ్గానే కనుక్కోగలరు కాబట్టి- మహిళాలోకానికి వెంటనే జేజేలు పలకాలి. భవిష్యత్తు కష్టాలు తప్పించుకోవటానికి ఈ తెలివైన నిర్ణయం తక్షణం తీసుకోవాలి. ఇది వందో అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం పురుష ప్రపంచానికి చాలా తెలివైన అవసరం.

లేవాలి మహిళా లోకం... దద్దరిల్లాలి పురుష ప్రపంచం!

★

ఈ సంచికలో....

2 . అణచేకొద్దీ లేస్తాం
3 . పనుంటే పండుగ లేకుంటే పస్తులే
7 . మహిళా చట్టాలు
8 . కబళిస్తున్న ట్రాఫికింగ్
10 . విజ్ఞాన గతి మార్చిన వనితలు
11 . చట్ట సభల్లో మేం
14 . మహిళా లోకంపైనే సంక్షోభ భారం
17 . మేం మైనారిటీలం
20. భూమికోసం... బతుకు బాగు కోసం...
22 . 'చట్టసభల' స్వప్నం నెరవేరేనా?
23 . మహిళా మణులు
26 . పేరుకే గౌరవ స్థానం...
27 . లాభాలు వారికి... రోగాలు వీరికి
28 . అమాయక ఆది వాసీలపై అత్యాచారాలా!
30 . నర్సుల సేవలకు గుర్తింపేదీ...
31. వీరి కష్టాలు గట్టెక్కేదెన్నడో...
32 . ఆకాశంలో సగం... అయినా తప్పని వివక్ష
34 . అతుకుల బతుకులు
35 . అరకొర జీవితాలు
36 . వలస పక్షులు

ఇంకా...

6 ...
ఒంటరి వ్యథలు

16 ...
అభద్రత... అరకొర జీతాలు...

24 ...
సాహిత్యంలో మహిళా స్వర విస్ఫోటనం



అణచేకొద్దీ లేస్తాం

ప్రపంచీకరణ తెచ్చిపెట్టిన పాశ్చాత్య విషసంస్కృతి ప్రభావాలు మహిళలపై ఇంటా బయటా విషం గక్కుతున్నాయి. మహిళలపై అనేక రూపాలలో హింస పెరిగింది. కాటికి కాళ్ళుచాచినా కామంతో కళ్ళు మూసుకుపోయి అమ్మాయిల జీవితాలతో ఆడుకుంటున్న దౌర్భాగ్యులు, కన్నకూతుర్ని కాటేసిన కామాంధులు, ప్రేమ పేరుతో ప్రాణాలు తీయడానికి సైతం వెనుకాడటంలేదు. యాసిడ్ దాడులకు పాల్పడి జీవితాలనే అంతం చేస్తున్న మృగాళ్ళు, కట్నం కోసం పరమకిరాతకంగా భార్యను అగ్నికీలలో ఆహుతి చేస్తున్న కట్న పిశాచులు పెరిగారు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధులు రాజ్యం ఏలుతున్న సమాజంలో ఇంటా బయటా మహిళలు క్షణక్షణం నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం, పోలీసు, న్యాయవ్యవస్థకు చిత్తశుద్ధి లోపించటంతో పోరాడి సాధించుకున్న చట్టాలు నిర్వీర్యమవుతున్నాయి.

నేడు టీవీలు, ఇంటర్‌నెట్‌లు, సినిమాలు వంటి ప్రసార సాధనాలు గ్రామీణ స్థాయికి విస్తరిస్తున్నాయి. కొత్త అభిరుచులు, అలవాట్లు, సాంప్రదాయాలు వంటివి పుట్టుకు రావడంతో వినిమయ సంస్కృతి విస్తరిస్తున్నది. అనుకరణే నేడు ఒక కొత్త ఒరవడిగా ముందుకొస్తున్నది. కొత్తగా పెరుగుతున్న మధ్యతరగతి, పైమధ్యతరగతి కుటుంబాలలో పెరుగుతున్న ఈ బలహీనతనే పాలకులు తమ విధానాలకు పదునైన ఆయుధంగా ఎక్కుపెడుతున్నారు. సమాజంలో 90శాతంగా ఉన్న ప్రజల జీవితాలను వదిలేసి ఒకరిద్దరి లివింగ్‌స్టైల్‌నే రోల్‌మోడల్‌గా చూపించే విధానాన్ని పాలకులు తెస్తున్నారు. ఇదే జీవితం అని ప్రసారమాధ్యమాల ద్వారా గుప్పిస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకునే బహుళజాతి సంస్థలు, వ్యాపారవేత్తలు విదేశీ వస్తువులను, సంస్కృతిని విచ్చలవిడిగా దిగుమతి చేసుకుంటున్నాయి. ప్రజల బలహీనతలను సొమ్మురూపంలో దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. వీళ్ళ ఆగడాలకు అడ్డుకట్ట వెయ్యగలిగే సమర్థవంతమైన విధానాలు కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల దగ్గరలేకపోవడం మూలంగానే మహిళలు, విద్యార్థులు, యువతుల మనుగడకు భద్రత లేకుండా పోతున్నది.

అనేకరకాల ఆటంకాలనూ అధిగమించి మన దేశంలో ఉన్నత చదువులకు చేరుతున్నవారు 2009 కేంద్ర మానవ వనరులశాఖ రిపోర్టు ప్రకారం నూటికి 11మంది వుంటే రాష్ట్రంలో నలుగురు మాత్రమే ఉన్నారు. గ్రాడ్యుయేట్‌ను పూర్తి చేసిన గ్రామీణ ప్రాంత యువతుల్లో నిరుద్యోగినులు 1:5గా ఉంది. పట్టణాల్లో వీరిశాతం అధికంగానే ఉంది. పురుషుల్లో 14శాతం నిరుద్యోగులుంటే యువతుల్లో 25శాతంగా ఉందని పేర్కొనటం ఆందోళన కలిగించే విషయం. చదివిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలనే చిత్తశుద్ధి ప్రభుత్వాల దగ్గర లేకపోవటం ఒక కారణమైతే, యువతుల పైన పెరుగుతున్న వ్యవస్థీకృత నేరాలు మరో కారణంగా చెప్పవచ్చును.

మరోవైపున హత్యలు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, లైంగికవేధింపులు, మృగాళ్ళ-ప్రేమోన్మాదుల దాడులు చిన్నపిల్లలు, ముసలివారు అనే తేడాలు లేకుండా పెరుగుతున్నాయి. దేశంలో 52శాతం మంది చిన్నారులు లైంగిక వేధింపులకు గురౌతున్నారు. 21.9శాతం మంది తీవ్రంగా లైంగిక వేధింపులకు గురౌతున్నారు. 50శాతం మంది పరిచయమున్న వారి చేతుల్లోనే బలైపోతున్నారు. టీనేజ్ అమ్మాయిలు అపహరణకు గురైన కేసులు దేశవ్యాప్తంగా 58శాతం నమోదు కాగా 21శాతం కేసులతో బీహార్ మొదటి స్థానంలో ఉంటే డిల్లీ 9.3శాతంతో నాల్గో స్థానం, మన రాష్ట్రం 7.3శాతంతో ఐదో స్థానంలో ఉంది. 2005లో 950గా ఉన్న కేసులు 2009 నాటికి 1429కి పెరిగారని నేషనల్ క్రైం బ్యూరో 2009 రిపోర్టు పేర్కొనటం చూస్తే రాష్ట్రంలో యువతులకు ప్రభుత్వం యేపాటి రక్షణను కల్పిస్తున్నదో అర్థమౌతున్నది. నేరస్థులకు శిక్షలు పడకపోవడం, నమోదైన కేసులకు సత్వర పరిష్కారాలను కోర్టులు చూపక పోవడం వల్ల ఇలాంటి కేసులు పైశాచికంగా పెరుగుతున్నాయి. దీనికితోడు విచ్చలవిడిగా దిగుమతి అవుతున్న అశ్లీల సినిమాలు, ఇంటర్‌నెట్ అశ్లీల సైట్స్, సెక్స్‌సాహిత్యం విచ్చలవిడిగా పెరుగుతుండటం, రిసార్టు, వీకెండ్ పార్టీలు, పబ్‌లు వంటి దిగుమతి సంస్కృతి వెంబడి మధ్యతరగతి, పై మధ్యతరగతి కుటుంబాలు కొట్టుకుపోవడం, ప్రసారసాధనాల్లో, వ్యాపార ప్రకటనల్లో మహిళను అర్ధనగ్నంగా వ్యాపార వస్తువుగా చూపడం వంటివి ఈ ఘటనలు పెరగడానికి దోహదపడుతున్నాయి.

దిగుమతి అవుతున్న విచ్చలవిడి పోకడలను నియంత్రించ గలిగే విధానపరమైన వ్యవస్థ మన పాలకుల వద్దలేదు. తమ పదవులను ఎట్లా కాపాడుకోవాలి, పదవి ఉన్నంత కాలంలోనే తాను ఎంత సంపాదించుకోవాలి అనేదానిపైన వెచ్చిస్తున్న సమయంలో ఒక్కశాతం వెచ్చించినా వీటిని అరికట్టవచ్చు. ఇది మారాలంటే చదువుకున్న యువతులు రాజకీయాల్లోకి ప్రత్యక్షంగా రావాలి. చట్టాలను రూపొందించే దానిలో, వాటిని అమలు జరిపించే దానిలో భాగస్వాములు కావాలి. అప్పుడే వీటిని సంపూర్ణంగా కాకపోయినా పాక్షికంగానైనా నియంత్రించగలం. అప్పుడే సనాతన భావాలతో కునారిల్లుతున్న ఈ సమాజంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాన్ని మహిళలు సాధించుకోగలరు. అందుకు నేటి యువతులే నాంది పలకాలి.



- రీనా

పనుంటే పండుగ లేకుంటే పస్తులే

'మేస్త్రి పిల్లం రాత్రి ఉపాసం' అన్న చందాన ఉంది భవన నిర్మాణ మహిళా కార్మికుల స్థితి. వీరు తెల్లవారక ముందే సద్ది కట్టుకుని అడ్డాకు చేరుకుని మధ్యాహ్నం వరకు పడిగాపులు కాస్తున్నారు. పనికి పిలుస్తారన్న గ్యారంటీ లేదు. ఇలా వారం రోజులు వరుసగా అడ్డామీదికి వస్తే ఏదో ఒక రోజే పని దొరుకుతుంది. అది కూడా అతి కష్టం మీద. ఒక రోజు కూలి 180 రూపాయలు ఇస్తారు. సగం పూట పనికిపోతే వంద చేతిలో పెడతారు. వచ్చే అరకొర డబ్బుల్లో ఇంటి అద్దెలకే సగం పోతోందని పలువురు మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వస్తువుల ధరలు చుక్కలనంటుతోన్న తరుణంలో మిగిలిన కొద్దిమొత్తంతో పిల్లల చదువులు, వాళ్లకు దుస్తులు, తిండీ తిప్పలు చూసుకోలేకపోతున్నామని తెలిపారు.

భవన నిర్మాణాలపైనే ఆధారపడ్డ వారి జీవితాలు ఇప్పుడు అగమ్యగోచరంగా తయారయ్యాయి. ఆర్థికమాంద్యం ప్రభావంతో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలటం, వివిధ ఉద్యమాల ప్రభావంతో రాష్ట్రంలోని భవన నిర్మాణరంగం కుదేలయ్యింది. ఉద్యమాలు, బంద్‌ల నేపథ్యంలో హైదరాబాద్ సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. భవనాలు నిర్మించేందుకు బిల్డర్లు ముందుకు రావడం లేదు. ఆకాశాన్ని తాకే అపార్టుమెంట్ల నిర్మాణం ఒక్కసారిగా ఆగిపోవటంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైంది. దీంతో అడ్డా కూలీలు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పనిదొరక్క పోవటంతో కుటుంబ పోషణ, పిల్లల చదువు సంధ్యల భారాన్ని భరించలేకపోతున్నారు.

మహిళలంటే చిన్నచూపు

వారంలో ఏ రోజు కూలీ దొరకితే ఆ రోజు పండగే. లేకపోతే పస్తులేనని పలువురు మహిళా కార్మికులు తెలిపారు. ఎక్కడైనా అరకొర పనులు జరుగుతున్నా వాటి వల్ల వచ్చే ఆదాయం సరిపోవటం లేదని చెబుతున్నారు. కూలోళ్ల కోసం ఎవరైనా అడ్డా దగ్గరకొస్తే అతని చుట్టూ పది, ఇరవై మంది మూగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వచ్చిన వ్యక్తులు కూడా పురుష కార్మికులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, తమవైపు కన్నెత్తి కూడా చూడరని వారు తెలిపారు. కార్మికుల్లో ముసలివాళ్లుంటే వారిని కనీసం పలకరించరని చెప్పారు. 'మీరు తట్టలు మోయలేరు, గంపలు మోయలేరు, మిమ్మల్ని పనికి తీసుకెళ్లి ఏం చేసుకోవాలి' అని అవహేళన చేస్తున్నారని మరికొంత మంది వృద్ధ కార్మికులు చెప్పారు. ఒంట్లో రక్తమున్నంత సేపే పనికి పిలుస్తారని లేకపోతే మా దిక్కే చూడరని వారు దీనంగా తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కూలికి పోయినప్పుడు సదరు భవనం దగ్గర కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవటంతో మహిళా కార్మికులు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఎవరినీ అడగలేక తాము నరకయాతన అనుభవిస్తున్నామని వారు చెబుతున్నారు. 'సాయంత్రం వరకు కడుపులో దాచుకోవడం తప్ప చేసేదేమీ లేదు' అని దీనంగా చెప్పారు. 'ఎక్కడి కష్టమొచ్చిందిరా...ఊరొదిలి, ఇల్లొదిలి ఎందుకు వచ్చామురా దేవుడా...దసరా, సంక్రాంతి పండుగల తర్వాత పట్నంలో పనులు దొరుకుతాయని ఆశపడే వాళ్లం. ఉగాది పండుగ దగ్గరపడుతున్నా పదిపైసల పని లేదు. దీనికి తోడు బస్సు కిరాయిలు పెరిగాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్టాలు చాలవన్నట్లు ప్రభుత్వం రేషన్ కార్డుల కింద ఇచ్చే కిరోసిన్ కోటాను తగ్గించారు. చక్కెరనూ తగ్గించారు. బియ్యం నాలుగు కిలోలు ఇచ్చి నెలంతా తినమంటే ఎలా తింటామని పలువురు మహిళా కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

రఘు

ఒక్కొక్కరికి ఎన్ని బాధలో...

ఈ నేపథ్యంలో అశోక్‌నగర్‌లోని అడ్డా దగ్గర పనికోసం పడిగాపులు కాస్తున్న పలువురు మహిళా కార్మికులను పలకరిస్తే...

'ముసలిదాన్ని గాబట్టే నన్ను పనికి పిలువడం లేదు. భర్త చనిపోయిండు. పిల్లలను సాకాలి. పని దొరకడం లేదు. నాకు ఏ పెన్షనూ రావటం లేదు'

- మనోహర

'తెలంగాణా వచ్చుడు..మళ్లీ పోవుడేందో కానీ మేమెట్లా బతకాలో అర్థమయితలేదు. వారానికొక రోజు కూడా పని దొరకడం లేదు. 8వ తరగతి చదువుతున్న నా కొడుకును పనిలో పెట్టాను'

- ఆవుల మల్లమ్మ

'నా భర్త తాగుబోతు. ఆయన వేధింపులు భరించలేక ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని హైదరాబాద్‌కు వచ్చాను. ఇక్కడ పనుల్లేక పస్తులు ఉంటున్నాం. పిల్లలను బాసన్లపనికి పెట్టాను. నేను అడ్డామీదికి వచ్చాను. కూలీ దొరక్కపోవటంతో ఏ పనిపడితే ఆ పని చేస్తున్నాను'

- తలారి చంద్రమ్మ

'పార్టీలు ఇట్లా చేయబట్టే పని దొరకడం లేదు. నాలుగు నెలల నుంచి బందుల మీద బందులొస్తున్నాయి. దీంతో పని దొరికితే తిండి లేకపోతే పస్తులే అయితాంది'

-ఎనుగొంటి ఇంద్రమ్మ

మార్పులు సాధించినా బాధలు తీరలా

ఎన్నో పోరాటాల అనంతరం మహిళలకు ఈ మాత్రం హక్కులైనా వచ్చాయి. అయితే వాటిలో ఎక్కువభాగం కాగితాలకే పరిమితమౌతున్నాయి. చిత్తశుద్ధితో అమలుచేయాల్సిన ప్రభుత్వాలు నేలచూపులు చూస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపుల్లో సైతం మహిళల పట్ల చిన్నచూపే. రాజకీయాల్లో వీరి పాత్ర నామమాత్రమే. ప్రభుత్వ విధానాల పుణ్యమా అని మహిళలు ఆర్థిక, సాంఘిక, మానసిక ఒత్తిళ్లకు లోనౌతున్నారు. వివక్షకు గురౌతున్నారు. అసంఘటిత రంగంలో తప్ప పని దొరకడం లేదు. ఇన్ని ప్రతిబంధకాల మధ్య మహిళలు పురోగమించాలంటే పోరు తప్పదంటున్నారు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్. పుణ్యవతి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రతినిధి కె. అంజనకు ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు...

ఈ ఏడాది మహిళా దినోత్సవ ప్రాధాన్యత ఏమిటి? మహిళల స్థితిగతుల్లో ఏమైనా మార్పులొచ్చాయని చెప్పొచ్చా?

మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం మొదలెట్టి వందేళ్లయింది. శతవార్షికోత్సవం అన్నమాట. ఈ మార్చి 8 ప్రత్యేకత అది. అయితే ఈ సందర్భంగా మీడియాలో వాణిజ్య ప్రకటనలు గుప్పించేసి పండుగ జరుపుకునే పరిస్థితి నేడు లేదు.

ఒకరకంగా చూస్తే అభివృద్ధికరమైన మార్పే వచ్చింది. ఓటుహక్కు, వివాహంలో స్వేచ్ఛ, తల్లీబిడ్డల సంరక్షణ, మెటర్నిటీ లీవ్, 8 గంటల పనిదినం చట్టపరంగా వచ్చాయి. కానీ వీటిలో మెజారిటీ అంశాలు ఉల్లంఘించబడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, పర్మినెంటు ఉద్యోగులకు మాత్రమే పనికి సంబంధించిన హక్కులు అమలౌతున్నాయి. మిగతా రంగాల్లో అమలు కావడం లేదు. టిటిడిలో వేలాది మంది ఉద్యోగులున్నారు. కోట్ల ఆదాయం వస్తుంది. అక్కడి మహిళా కార్మికులు వంద సంవత్సరాల క్రితంలాగే దోపిడీకి గురవుతున్నారు. మున్సిపల్ కార్మికుల పరిస్థితీ అదే. ఇక విశాఖ బ్రాండిక్స్ బట్టల ఫ్యాక్టరీ వంటివాటిలో కార్మికులు దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. చట్టపరంగా అనేక హక్కులొచ్చినా అమలుకు నోచుకోవడంలేదని ఈ ఉదాహరణలు తెలియజేస్తాయి.

మహిళల పరిస్థితిపై అక్టోబర్ విప్లవం ప్రభావం...తర్వాతి పరిణామాలు

సోవియట్ యూనియన్‌లో సోషలిజం మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తెచ్చింది. అది భూలోక స్వర్గంగా పేరుగాంచింది. సోషలిజం రాకముందు అక్కడ కూడా పని ప్రదేశాల్లో లైంగిక దోపిడీ ఎదుర్కొన్నారు. విడాకులు, అబార్షన్ విషయంలో స్వేచ్ఛ లేదు. తల్లిదండ్రులు నిర్ణయించిన ప్రకారమే పెళ్లి జరగాలి. మగవాళ్లు పనికోసం వలస పోయి అక్కడ వేరే సంబంధాలు ఏర్పాటు చేసుకునేవారు. ఇక్కడ మాత్రం భార్యలు మరో పెళ్లి లేకుండా అనేక ఆంక్షల్లో వుండాల్సి వచ్చేది. ఒంటరి మహిళలకు అనేక ఆంక్షలుండేవి. ఇలాంటి పరిస్థితుల్లో అక్టోబర్ విప్లవం తెచ్చిన మార్పు అంతా ఇంతా కాదు. ప్రపంచంలోనే ముందుగా ఓటు హక్కునిచ్చింది ఇక్కడే. కుటుంబ వ్యవస్థ, మతానికి సంబంధించిన పాత సంప్రదాయాలను కూకటి వేళ్లతోసహా పెళ్లగించినట్టు సోవియట్ మార్పు తీసుకొచ్చింది. స్త్రీ పురుషుల్దిరూ సమానులేనంది. నచ్చకపోతే విడిపోయే హక్కు ఇచ్చింది. పిల్లలు, వృద్ధుల బాధ్యత ప్రభుత్వమే తీసుకొంది. పిల్లలు తల్లులు దగ్గరగా వుంటూనే చదువు, పెంపకం బాధ్యత ప్రభుత్వం తీసుకొంది. అమెరికా, బ్రిటన్, జర్మనీల్లో ఏ ఒక్క దేశంలోనూ స్త్రీలకు హక్కులు రాలేదు. మన స్వాతంత్ర్యోద్యమంలోనూ స్త్రీల హక్కుల కోసం పోరాటం జరిగింది. ఆనాడు ఆస్తిహక్కులు, వైవాహిక జీవితంలో సమానత్వం కోసం 50 వేల మంది మహిళలు సంతకాలు చేసి బిఎన్‌రావు కమిటీకి ఇచ్చారు. మొగుడు చచ్చిన ఆడదాన్ని పాడెమీద పెట్టి తగలేసే మన సమాజంలో ఇలాంటి మార్పులొచ్చాయంటే సోవియట్ విప్లవ స్ఫూర్తి ప్రభావం చాలానే వుంది. అలాగే ఆ తర్వాత సోవియట్‌లో ఎదురైన అవాంతరాల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా మహిళా ఉద్యమాలపై పడింది. వర్గ దృక్పథం లోపించడానికి, స్త్రీపురుషుల మధ్య అగాధం పెంచడానికి, బూర్జువా ధోరణులు పైచేయి సాధించడానికి దారితీసింది.

రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో మహిళలకిస్తున్న ప్రాధాన్యత ఎలా వుంది?

ఏమీ లేదు! ఆగస్టు 15కి పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చినట్టు బడ్జెట్లో మహిళలకు కేటాయింపులున్నాయి. స్త్రీల జీవితాల్లో సమానమైన మార్పులు తేవడానికి కావాల్సిన ప్రమాణాలు లేవు. మహిళల సమగ్రాభివృద్ధి లేదు. జండర్ బడ్జెట్ కావాలి. ప్రభుత్వం చూపే ప్రతి సంక్షేమంలోనూ 1/3వ వంతు మహిళలకివ్వాలి. ప్రభుత్వ బడ్జెట్ విధానంలో పురుషాధిక్యాన్ని బలపరిచేదిగా వుంది. సంక్షేమ స్కూళ్లు, కాలేజీల్లో కేటాయింపులు ఆడ,మగ పిల్లలకు సమానంగా లేదు. దాంతో ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఆడపిల్లలు చదువులో వెనకబడుతున్నారు. అభివృద్ధి ఫలాలను సాధించడానికి ఛాయిస్ లేకుండా పోయింది. భూపంపకం జరగాలి. భూమి మొత్తం సోషలైజ్ చేయాలి. సోవియట్‌లోలాగా కలెక్టివ్ ఫామ్స్ ఏర్పాటు చేయాలి. అప్పుడు స్త్రీ ఇండిపెండెంట్ ఎకనామిక్ యూనిట్ అవుతుంది. ఆర్థిక స్వాతంత్ర్యం పొందుతుంది.

రాజకీయ రంగంలో మహిళల స్థానాన్ని ఎలా చూస్తున్నారు? రాజకీయ పార్టీలు 33 శాతం ఇస్తున్నాయా?

అంతా ఆచారమంతులే. బుట్టలో చేపలు మాయం. అప్పటిదాకా అనుభవించిన హక్కులు వదులుకోవడానికి మగవాళ్లు సిద్ధంగా లేరు. అంతర్జాతీయంగా యావరేజ్‌గా 18 శాతం మహిళలే రాజకీయ రంగంలో వున్నారు. ప్రజాస్వామ్య భారతంలో పరిస్థితి మరీ సిగ్గుపడేవిధంగా వుంది. కేవలం 8 శాతం మహిళలు మాత్రమే రాజకీయాల్లో వున్నారు. రాజకీయాలు, వ్యాపారాలు కలగలిసిపోయాయి. ఆధిపత్య ధోరణిలో, అభద్రతాభావంతో అవెక్కడ దెబ్బతింటాయోనని స్త్రీలు రాజకీయాల్లోకి రాకుండా నిరోధిస్తున్నారు.

మీడియాలో మహిళలను చూపుతున్న విధానం ఎలా వుంది?

అయితే గయ్యాళి, కాకపోతే సాధ్వి రుగ్మత కనిపిస్తోంది. అది పోవాలి. అన్నీ భరించి అణిగిమణిగి ఎప్పుడు చూసినా ఏడుస్తుండే మహిళలు కన్పిస్తారు. లేకపోతే విషప్రయోగాలు చేసే మహిళా విలన్లు అగుపిస్తారు. అంతకుమించి ఆత్మస్థైర్యం, ఇంగితజ్ఞానం, యుక్తాయుక్త విచక్షణ, స్వతంత్ర భావాలు, శక్తి సామర్థ్యాలతో పాజిటివ్ రోల్ ప్లే చేయగల సిటిజన్‌షిప్‌ని నిరాకరించే ధోరణి ఈ సమాజంలో కనిపిస్తోంది. మీడియాలో అనేకమంది మహిళలు వస్తున్నారు. అయితే కీలక నిర్ణయాధికారం యాజమాన్యాల చేతిలో వుంది. ఇవి పరమ జుగుప్సాకరమైన వెకిలితనాన్ని, శాడిస్టు లక్షణాలను బయటపెట్టుకుంటున్నాయి. తెలియకుండానే ప్రేక్షక రూపంలో వున్న మహిళలు వాటిని చూస్తున్నారు.

ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో మహిళల తాజా పరిస్థితి ఎలా వుంది?

ఆర్థిక, సాంఘిక, మానసిక పరమైన ఒత్తిళ్లు ఎక్కువౌతున్నాయి. ఇవాళ కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడంతో ఒంటరి మహిళలు పెరుగుతున్నారు. వ్యవస్థలో ప్రజాస్వామ్య సంస్కృతి లేకపోవడం వల్ల కుటుంబంలో కూడా అది పోతోంది. కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్నాయి. వివాహ వ్యవస్థ సంక్షోభంలో పడుతోంది. ఒంటరి మహిళలు పెరుగుతున్నారు. తాగుడు, అక్రమ సంబంధాలు, పెళ్లాలను వదిలేయడం, చావడం, పెళ్లికాని తల్లులు, భర్త వుండీ లేకపోవడం వంటి అనేక అవలక్షణాలు కనిపిస్తున్నాయి. దోపిడీ సమాజంలో ఒంటరి మహిళలకు భద్రత కనుమరుగవుతోంది. ఒత్తిడి పెరుగుతోంది. ఎట్ ఎనీ కాస్ట్ పనిచేయడానికి సిద్ధపడుతున్నారు. ఇళ్లల్లో పాచిపని మొదలుకొని మీడియా, సినిమా రంగాల్లో, బారుల్లోను, క్లబ్బుల్లోను పనిచేస్తున్నారు. మీడియాలో పర్మినెంటు జాబ్ లేకపోయినా ఆడపిల్లలు పనిచేయక తప్పడంలేదు. మరోవైపు ఐటి భూతల స్వర్గంలా కనిపిస్తోంది. రాత్రిళ్లు పనిచేయడం పగలు నిద్రపోవడం. డబ్బు వస్తోందని సర్దుకున్నా.... బంధుత్వాలకు బ్రేక్ పడుతోంది. మానసిక, శారీరక ఒత్తిడితోపాటు అభద్రతాభావం పెరుగుతోంది. కుటుంబ సంబంధాల్లో ఒడిదుడుకులు ఎదుర్కొనాల్సి వస్తోంది.

అసంఘటిత రంగాల్లో మహిళల వేతనాలు ఎలా వున్నాయి?

ఇక్కడ తప్ప మహిళలకు మరో రంగంలో పని లభించే పరిస్థితి లేదు. 94 శాతం మహిళలకు కొద్దో గొప్పో జీతం వచ్చేది ఇక్కడే. అయితేనేం అసలు జీతం భత్యం లేకుండా చేసే పనులు మరెన్నో. వీరి శ్రమను ప్రభుత్వం లెక్కగట్టడం లేదు. వేతనాలు తక్కువ ఇచ్చే ప్రతి చోటా మహిళా కార్మికులే కనిపిస్తారు. విద్యావాలంటీర్లు, ఆశ, మిడ్‌డే మీల్, కాంట్రాక్టు కార్మికులు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, సేల్స్ గరల్స్... ఆ కోవకే వస్తారు. వీరివి హీనమైన బతుకులు. 50 రూపాయల లోపు సంపాదించేవారే అత్యధికం. చాకిరిలో ఫస్ట్. ఆదాయంలో లాస్ట్.

మద్యం అమ్మకాల ద్వారా ఆదాయం పెంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. దానికేమంటారు?

పేద మహిళల ఉసురు పోసుకుంటోంది. ఇప్పటికే ఆర్థికంగా కుటుంబాలు విచ్ఛిన్నమౌతున్నాయి. తాగుడు మూలంగా ఎన్ని పుస్తెల తాళ్లు తెగాయో, ఎంతమంది ఆడవాళ్లు నిద్రలేని రాత్రుళ్ళు గడుపుతున్నారో లెక్కేలేదు. తాగుబోతులు భార్యలను పెట్టే హింస మూలంగా పిల్లలు కూడా భవిష్యత్ నేరస్థులుగా, తాగుబోతులుగా తయారౌతున్నారు. దీనిమూలంగా జాతి నిర్వీర్యమౌతోంది.

మృగాళ్ల దాడులకు ఎలా స్పందిస్తారు? కాపాడాల్సిన పోలీసులే గిరిజన మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. ప్రత్యేకించి అణగారిన వర్గాలకు చెందిన మహిళల స్థితిగతులు, అడ్డూ ఆపూ లేని అత్యాచారాల గురించి ....

దీనికీ పై ప్రశ్నల్లోనే సమాధానం చెప్పుకున్నాం. ప్రభుత్వమే తాగుబోతు కల్చర్‌ని, పెళ్లాన్ని కొట్టే కల్చర్‌ని తయారుచేసిన తర్వాత ఏది రైట్ ఏది రాంగ్ అనేది నేర్చుకునేది ఎక్కడ? ప్రభుత్వమే మృగాళ్లను తయారుచేస్తోంది. దానికి బలిపశువులవుతోంది మహిళలు, వాళ్ల తల్లిదండ్రులే.

పోలీసులూ వ్యవస్థలో భాగమే. కామపిశాచాల అత్యాచారాలు ఒక భాగం. దాడి చేయడానికి అత్యాచారాన్ని ఒక ఆయుధంగా వాడుకోవడం మరొక భాగం. ఆడదాన్ని ఒక సెక్స్ ఆబ్జెక్ట్‌గా చూస్తున్నారు. వాకపల్లి బాధితులకు అతీగతీ లేదు. నేరపరిశోధనలో అనేక అభివృద్ధికర మార్పులొచ్చాయి. కానీ వాటిని వదిలేసి అమాయక ప్రజలపై దాడులు చేసేవిధంగా మొరటు పద్ధతులు అనుసరిస్తున్నారు. నేరస్థులను పట్టుకోవాలంటూ వీళ్లు నేరస్థులుగా మారుతున్నారు. ఇదే దోపిడీ రాజ్య స్వభావం. తన జనం ఏం చేసినా చెల్లుబాటవుతుందనేలా ప్రభుత్వమే మానవహక్కులను ఉల్లంఘిస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో మహిళలు మార్జినలైజ్ అవుతున్నారు. అందులో అణగారిన వర్గాల మహిళలు ఇంకా. అసంఘటిత కార్మికులు, ఒంటరి మహిళలు, టిటిడి మహిళా కార్మికులు ఆర్థికంగా, లైంగికంగా దోపిడీకి గురవుతున్నారు. కుటుంబంలో, సమాజంలో భద్రత లేదు. జీవితంలో గాలి పీల్చడం లాగా సహజ భాగమైంది. ఇదే తమ జీవితం అనుకుంటున్నారు. ఇప్పటికే అభద్రతకు గురవుతున్న మహిళలను కులపరమైన వేధింపులు, అత్యాచారాలు మరింత వేధిస్తున్నాయి.

మహిళలకు ప్రత్యేక చట్టాలున్నాయికదా...

..... కాగితాలమీదే. గృహహింస చట్టం ఎంతగానో పోరాడి సాధించుకున్నాం. గృహహింస కూడా హింసే. భార్యను కొట్టడం నేరం. అవసరమైతే గృహహింస నుంచి భార్య విడిపోయే హక్కు వుంది. కుటుంబంలో ప్రజాతంత్ర పరిస్థితులు ఏర్పరచడానికి వీలైంది. దీని అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. లైంగిక వేధింపులను, దోపిడీని మహిళలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. వీటికి వ్యతిరేకంగా చట్టం చేయాలని సుప్రీంకోర్టు సూచించినా వెలుగులోకి రాలేదు. ఆ సమస్య గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది.

సెక్స్ సెలక్టివ్ అబార్షన్లు జరుగుతున్న కొన్ని చోట్ల డాక్టర్లలోనూ అది కొరవడుతోంది. పుత్రకామేష్టి యాగాలు చేసిన చరిత్ర మనది. కూతురు లేకుండా మనవలెలా పుట్టుకొస్తారో! దీవించడం కూడా పుత్రపౌత్రాభివృద్ధిరస్తు అంటారు. కనిపించని హింస కల్చర్‌లోనే వుంది. ఇష్టం లేని బిడ్డను అబార్షన్ చేయించుకునే హక్కు వుంది. అందుకే కూతుర్ని వదిలించుకుంటున్నారు. పుత్ర సంతానానికి ప్రోత్సాహం ఇచ్చే సంస్కృతిలోనే ఆడపిల్లను వదిలించుకోవాలని సంకల్పం వుంది.

ఒకవైపు పని చేయక తప్పని పరిస్థితి, మరోవైపు ఉపాధి అభద్రత. మూడోవైపు నుంచి ధరాఘాతం....

రోట్లో పడేసి దంచుతున్నట్టుంది. ఎప్పుడు పని దొరుకుతుందో ఎప్పుడు ఊడుతుందో తెలీదు. అభద్రత, లైంగిక దోపిడీ, నెలల తరబడి కుటుంబాలకు దూరంగా వుండడం, మైళ్లకు మైళ్లు నడవడం జీవితంలో భాగమైనాయి. పశువులు గడ్డి వెతుక్కుంటూ వెళ్లినట్టు ఆడవాళ్లు పనికోసం వెతుక్కుంటూ వెళ్లే పరిస్థితి. పెరిగే ధరలు వీరి ఆయుక్షీణాన్ని కోరుతున్నాయి. ప్రభుత్వ విధానాలు వారి ఉసురు పోసుకుంటున్నాయి.

ఇన్ని ప్రతిబంధకాల నడుమ మహిళల పురోగమనం ఎలాగంటారు?

అదే మార్చి 8 మనకిచ్చే సందేశం. వందేళ్ల మహిళా దినోత్సవ ప్రారంభంలో ఇంతకన్నా భయంకర పరిస్థితులున్నాయి. అయినా మహిళలు పోరాటాల్లో పాల్గొన్నారు. దెబ్బలు తిన్నారు. ఆ పోరాటాల పతాకఘట్టం అక్టోబర్ విప్లవం. రోడ్డు మీదకు రావడానికి, సంఘటితం కావడానికి సమస్యను తోటివారితో పంచుకోవాలి. సంప్రదాయం, శీలం, గృహహింస, లైంగిక వేధింపులు, ప్రేమ పేరిట మోసాలు, దాడులు ... నోరు నొక్కేస్తున్నాయి. వీటన్నిటిపైనా చర్చ పెట్టాలి. సామాజిక సమస్యగా మాట్లాడాలి. అందరూ కలవాలి. సంఘం పెట్టాలి. అలా కార్మిక, ఉద్యోగ, మహిళ, విద్యార్థి వంటి సంఘాలేవైనా కావచ్చు. పోరాటాలు చేయాలి. ఆర్థిక సమస్యలు వగైరాలు విధానాలతో ముడిపడివున్నాయి. ప్రభుత్వం చెప్పే తియ్యటి మాటల మాయలో పడకూడదు. ఆయా ప్రభుత్వాలు అమలుచేస్తున్న విధానాలను ప్రశ్నించడానికి చుట్టూ వున్న వారిని సంఘటితం చేయడానికి మహిళలు ముందుకు రావాలి. రష్యాలో జార్ చక్రవర్తులను సింహాసనం నుంచి కిందికి గుంజారు. తర్వాత వచ్చిన కెరన్‌స్కీని దించారు. ఒక రకంగా అక్టోబర్ విప్లవానికి నాంది పలికింది మార్చి 8. ఆ రకంగా తక్షణ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విధానాలను తిప్పిగొట్టడానికి మహిళా సంఘటిత శక్తి ఉపయోగపడాలి. భవిష్యత్తులో సోషలిస్టు విప్లవాలు జయప్రదం కావడానికి ఉపయోగపడుతుంది.

★

'ఒంటరి' వ్యధలు

'ఆమె ఒంటరి' అని తెలిస్తే చాలు! ఆకలి చూపులు, చవకబారు మాటలు, వెకిలి నవ్వులు వెంటాడతాయి. అద్దెకు ఇల్లు దొరకదు. పని సంగతి సరేసరి. ఏ వంకతో ఎప్పుడు ఎక్కడ తడుముదామా అనుకునే మహానుభావులు మన చుట్టూ చాలా మందే ఉన్నారు. మరి ఒంటరి మహిళల గాథలు, వ్యధలు రేఖామాత్రంగా...

పని గంటల దగ్గరి నుంచి మొదలైన మనం పార్లమెంట్‌లో మాకు రిజర్వేషన్ కావాలి అనే వరకు ఎన్నో పోరాటాలు చేశాం. ఓటు హక్కు, భూమి హక్కు, గృహ హింస నిరోధక చట్టం వంటి అనేక హక్కులు సాధించుకున్నాం. కానీ ఏం లాభం మన జీవితాలు 3 అడుగులు ముందుకు, 7 అడుగులు వెనక్కు అన్నట్లే ఉన్నాయి. మహిళలను 2వ తరగతి పౌరులుగానే చూస్తున్నారు. వరకట్న రాక్షసి కరాళ నృత్యం చేస్తోంది. గృహ హింస గుంభనంగా సాగుతోంది. బహు భార్యత్వం బహు రకాలుగా ఉంది. అసమానత అడుగడుగునా కన్పిస్తోంది. స్త్రీలు ఎంతో అభివృద్ధి చెందారని చెప్పే పాలకులు మనకు జరిగే అన్యాయాలకు నోరు విప్పరు. అయినప్పటికి ఇవాళ జాతీయోత్పత్తిలో 65% స్త్రీల శ్రమద్వారానే ఉత్పత్తి అవుతుందని గణాంకాలు చెప్తున్నాయి. కానీ ఆ గౌరవం స్త్రీకి దక్కడం లేదు.

అంతేకాదు ఈరోజు రాష్ట్రంలో నేటికి 33% పైగా కుటుంబీకులు మహిళల భుజస్కందాలపై మోస్తున్నారనేది నమ్మలేని నిజం. 2008లో ఐద్వా నిర్వహించిన ఒంటరి మహిళల సర్వేలో రాష్ట్రంలో 19 జిల్లాల్లో 50 గ్రామాలు వార్డుల్లో సర్వే చేస్తే నూటికి 35 మంది వరకు స్త్రీలే కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్నారని తేలింది. వీరిలో భర్తలు చనిపోయినవారు కొందరైతే భర్త ఉండి కూడా బాధ్యత లేకుండా తాగితందనాలు ఆడుతూ ఇల్లు పిల్లలు పట్టించుకోని, వారు వరకట్నం ఇతర సమస్యలతో వివాహం కానివారు, వివాహం చేసుకొని విడిపోయినవాళ్ళు, ప్రేమ పేరుతో మోసపోయి అవివాహితలుగా మిగిలినవారు ఇలా అనేక కారణాలతో స్త్రీ వంటరి జీవితం గడపాల్సి వస్తోంది. ఇటువంటి వారు చిన్న వయసైనా తిరిగి మరొకరితో కల్సి జీవిద్దామంటే పురుషాధిక్య సమాజంలో మొదటే మోక్షంలేదు. రెండవ పెళ్లి చేసుకొని గౌరవించే కరుణామయులు అరుదు. అందుకే వీరు ఒంటరిగా జీవించడానికే నిర్ణయించుకొంటున్నారు. అయితే జీవన క్రమంలో ఎదురయ్యే సమస్యలు అన్నీ యిన్నీ కాదు. మొదట ఆకలిగొన్న తోడేళ్ళ మధ్య మేక పిల్లలాగా తనను తాను రక్షించుకోవాలి. బ్రతకడానికి ఏదో ఒక పని వెతుక్కోవాలి. బిడ్డల్ని పెంచుకోవాలి. షాపు ఎంప్లాయిస్ సేల్స్ గర్ల్స్‌గాను, చిల్లర దుకాణాదారులుగాను కూరగాయలు, పాలు, పండ్లు అమ్ముకోవడం, టైలరింగు, బడ్డీ దుకాణాలు, చీరల వ్యాపారం, పూలు కట్టడం, గ్రైండర్లు, పిండిమరలు, పిండివంటలు, అప్పడాలు, వ్యవసాయ కూలీలుగా, పట్టణాల్లో బిల్డింగు కార్మికులుగా, మున్సిపల్ కార్మికులుగా, ఆఫీసుల్లో అటెండర్లుగా ఒకటేమిటి ఎక్కడ చూసినా అతి తక్కువ జీతాలతో ఒంటరి స్త్రీలు శ్రమిస్తున్నారు. ఒక పక్క శారీరక ఒత్తిడి, రెండో పక్క మానసిక ఒత్తిడికి గురౌతున్నారు. పని రోజూ దొరుకుతుందో లేదోననే టెన్షన్. పని దొరికినా ఆ రోజు లేదు. ఆ నెల్లో డబ్బు చేతికి వస్తుందో లేదో తెలియదు. వచ్చిన ఆదాయాన్ని పెరుగుతున్న ధరల్లో కుటుంబ అవసరాలకు సరిపెట్టడం సాధ్యం కాక డ్వాక్రా, మైక్రో ఫైనాన్సు, యితర వడ్డీ వ్యాపారుల వద్ద 4, 5 రూ.లకు వడ్డీలకు అప్పులు తేవడం, అప్పుకు వెళ్ళిన దగ్గర, పనికి వెళ్ళిన దగ్గర కాస్త బావున్న స్త్రీనైతే చొంగలు కారుస్తూ చూసే చూపులు (బహుశా ఈ చూపుల బాధను పురుషుడు తన జీవితంలో ఏనాడూ ఎదుర్కోడు). ఇళ్లలో పాచిపని చేసే బాలికలపై అత్యాచారాలు మనం నిరంతరం చూస్తున్నాము. అడ్డాలపై కూలికోసం ఎదురు చూసేటపుడు అందంగా వున్న యువతులకు త్వరగా పని దొరుకుతుంది. నివాసాల సమస్య మరొకటి. ఒంటరిగా వున్న స్త్రీకి ఇల్లు అద్దెకు ఇవ్వడం ఈమె ఎటువంటిదో ఏమి సమస్యలొస్తాయో అనే భయం యజమానుల్లో ఉంటుంది. పనికి వెళ్తున్నా, వస్తున్నా చుట్టుపక్కల వారు చూసే అనుమానపు చూపులు, ఆకతాయిలు మాట్లాడే మాటలు భరించడం చాలా బాధగా ఉంటుంది. ఇక ఫంక్షన్లు, శుభకార్యాలు జరిగేటపుడు ఒంటరి స్త్రీలను అన్నింటికీ దూరంగా ఉంచుతారు. విడో అయితే వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించకూడదు. ఆ ఇంట్లో ఏ పనికీ ఎదురుగా రాకూడదు. అక్కడ ఏ వస్తువు అందించకూడదు ఆమె చేత్తో. దేవాలయాల్లో పూజలు జరిగితే దేవుణ్ణి ఒంటరి స్త్రీ పూజించకూడదు. బిడ్డలు లేని స్త్రీ బారసాల వంటి కార్యక్రమంలో ముందుండి పాల్గొనకూడదు. ముఖ్యమైన పనికి వెళ్ళేటపుడు ఇటువంటివారు ఎదురు రాకూడదు. వస్తే ఆ పనికి కాసేపాగి మళ్ళీ వెళతారు. అంతేకాదు వృద్ధాప్యంలో కన్నబిడ్డలు (కొడుకులు, కూతుళ్ళు) కూడా వీరి మాటకు విలువనివ్వరు. సమాజంలో ఉండే చులకన భావం బిడ్డలపై కూడా ప్రభావం చూపుతుంది.

ఇన్ని బాధల మధ్య ఒంటరి స్త్రీలు మానసికంగా ఎంత నలిగిపోతారో మనం అర్థం చేసుకోవచ్చు. ఒకపక్క కుటుంబ సభ్యుల్ని కోల్పోయిన బాధ, రెండవది ఆ కుటుంబాన్ని పిల్లల్ని పోషించుకోవాల్సిన బాధ్యత. మూడవది సరైన పనిలేక చాలీ చాలని ఆదాయాలు, కడుపునిండా తిండిలేక, కంటినిండా నిద్రలేక కృంగి కృశించి జీవచ్ఛవంలా బతుకుతున్న ఒంటరి మహిళల్ని ఒకతాటిపైకి తెచ్చి సంఘటితం చేయాలని ఐద్వా ప్రయత్నించింది. వీరి పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి సబ్సిడీ పథకాలు, పెన్షన్, ఇంళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల తదితర పథకాలు ఒంటరి స్త్రీలకు ముందుగా వర్తింప చేయాలని, వీరి కోసం సెపరేటు బడ్జెట్ కేటాయించాలని పని ప్రదేశాలలో సౌకర్యాలు, రక్షణ చర్యలు సరిగా చేపట్టాలని మద్యం మహమ్మారిని అరికట్టాలని, ఇంకా కొన్ని డిమాండ్లను వీరి కోసం రూపొందించి ప్రభుత్వానికి అందించింది ఐద్వా. ఈ డిమాండ్ల సాధన కోసం వీరంతా ఐక్యంగా ముందుకు రావాలి. స్త్రీల హక్కులు కోసం జరుగుతున్న పోరాటాల్లో చురుగ్గా పాల్గొనాలి. సాంప్రదాయాల చాటున జరుగుతున్న అవమానాలను రూపుమాపాలి. స్త్రీలు, పురుషులు సమానంగా గౌరవించే సమాజాన్ని సాధించాలి.

- బి. హైమావతి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

మహిళా చట్టాలు

అంతర్జాతీయంగా వచ్చిన మార్పులు మహిళా ఉద్యమ పోరాటాల ఫలితమే. స్త్రీని అమ్ముకునే కన్యాశుల్కం, సతీసహగమన నిషేధం, వితంతు పునర్వివాహం, బాల్యవివాహాల నిషేధం మొదలగు చట్టాలు నేడు మనం చూస్తున్నాం. నాటి కన్యాశుల్కం స్థానంలో నేడు వరకట్నం ప్రవేశించింది. నాడు మహిళను అంగట్లో సరుకుగా అమ్ముకున్న పద్ధతి నుండి నేడు వరకట్నం ఇవ్వాల్సిన పరిస్థితి వరకు సమాజంలో ఎటువైపు చూసినా మహిళే బాధితురాలు, బలిపశువు గావించబడుతుంది. మహిళను చైతన్యపరిచే ఈ రోజున ఈ సందర్భంగా స్త్రీకి సంబంధించిన చట్టాలను తెలుసుకుని ముందుకెళ్లడం ఎంతో ముదావహం.

వరకట్న దురాచారాన్ని రూపుమాపడానికి 1961లో వరకట్న నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టింది మన ప్రభుత్వం. ఈ చట్టంలోని సెక్షన్ 314 ద్వారా వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం కూడా నేరమవుతుంది. దీనితో మహిళకు పూర్తి న్యాయం జరుగుతుందా అనేది ఎండమావి లాగానే ఉన్న సమాజంలో వరకట్నం తీసుకుంటున్న ప్రతిఒక్కరూ నేరస్థులే. ఈ చట్టం ఉన్నా దీనిని అమలు పరిచే యంత్రాంగం, అంతేకాదు చట్టాన్ని తీసుకొచ్చిన పాలకులు పాటించిన దాఖలాలు నూటికో కోటికో తప్ప లేవని చెప్పాలి. ఈ చట్టం ఉన్నా వరకట్న వేధింపులు ఆగకపోవడంతోనే మహిళలకు రక్షణగా 1983లో ఇండియన్ పీనల్‌కోడ్-1973కి మార్పులు చేసి అదనంగా 498-ఎ సెక్షన్‌ను ప్రవేశపెట్టారు. వివాహానంతరం స్త్రీని భర్త గానీ, అత్తింటివారు గానీ, ఎవరైనా భర్త సంబంధీకులు శారీరకంగా, మానసికంగా వేధిస్తే వారికి 3 సంవత్సరాలు జైలు శిక్ష విధించబడుతుంది.

అనుమానాస్పద మరణం: అలాగే సెక్షన్ 304-బి కూడా వరకట్నానికి సంబంధించినదే. వరకట్నం కోసం స్త్రీ అత్తగారింటి వేధింపులు, కాలిన గాయాలు, శారీరక గాయాలతోగానీ మరణిస్తే... సదరు గాయాలు అస్వాభావికమై అలాంటి మరణమునకు ముందు వరకట్నం తీసుకురమ్మని భర్త వల్ల గానీ, బంధువుల వల్ల గానీ వేధించబడినట్లయితే ఈ సెక్షన్ ప్రకారం 7 సంవత్సరాలు గానీ, యావజ్జీవిత ఖైదు గానీ విధించబడుతుంది. రోజు రోజుకు పెరుగుతున్న మహిళలపై అత్యాచారాలు, వరకట్న వేధింపులు, హత్యలు, ఆత్మహత్యలు అరికట్టాలనే ఉద్దేశంతో 19-11-1986న అమలులోకి వచ్చింది.

అనుమతి లేకుండా గర్భస్రావం : సెక్షన్ 313 ప్రకారం గర్భవతి అనుమతి లేకుండా గర్భస్రావం జరిపినట్లయితే వారికి 10 సంవత్సరాల వరకు కారాగారశిక్ష, జరిమానా విధించవచ్చు.

మానసిక వేధింపు: స్త్రీని అవమానపరచాలనే భావనతో ఆ స్త్రీకి వినపడేవిధంగా మాట్లాడినా, ఆమె చూసే విధంగా సంజ్ఞలు, సంకేతములు చేసినా, ఆమె ఏకాంతానికి భంగం కలిగినా సెక్షన్ 509 ప్రకారం ఒక సంవత్సరం వరకు జైలుశిక్ష, జరిమానా విధిస్తారు.

అవమానం: ఒక స్త్రీని అవమానపరచాలనే సంకల్పంతో ఆమెపై దౌర్జన్యం చేసినా, ఆమెపై బలప్రయోగం జరిపి ఆమెను అవమానపరచినట్లయితే 2 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఈ సెక్షన్‌ను వయసుతో నిమిత్తం లేకుండా పసిపాప నుండి ముసలి వారందరికీ సెక్షన్ 354 వర్తిస్తుంది. జుట్టు పట్టుకుని లాగడం, చెయ్యిపట్టుకోవడం, వివస్త్రను చేయడం మొదలైనవన్నీ స్త్రీత్వమును, స్త్రీని అవమానపరచటంగానే భావిస్తారు.

అత్యాచారం చేస్తే...: ఎవరైనా ఒక మహిళపై అత్యాచారం చేసినట్లయితే సెక్షన్ 376 ప్రకారం 7 సంవత్సరాల జైలుశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష గానీ, 10 సంవత్సరాల శిక్ష గానీ విధించబడుతుంది. భర్త కూడా స్త్రీ/భార్య అభీష్టానికి వ్యతిరేకంగా మానభంగం చేసినట్లయితే కూడా ఈ సెక్షన్ అన్వయిస్తుంది. భార్య వయసు 12 సంవత్సరాల పైన ఉన్నట్లయితే 2 సంవత్సరాల శిక్ష మాత్రమే వర్తిస్తుంది.



సెక్షన్ 376-ఎ: ఒక స్త్రీ ప్రత్యేక సందర్భంలోగానీ, కాన్పు ద్వారా గానీ భర్తకు దూరంగా ఉన్న సందర్భంలో ఆమె అనుమతి లేకుండా సంభోగించిన 2 సంవత్సరాల జైలు శిక్ష పడుతుంది.

సెక్షన్ 376-బి: ప్రభుత్వోగి ఆధీనంలో ఉన్న స్త్రీని ఆ ఉద్యోగి కానీ, అతని క్రింది ఉద్యోగి కానీ హోదాను అడ్డుపెట్టుకుని సంభోంగించినట్లయితే 5 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా పడుతుంది

సెక్షన్ 376-సి: మహిళా ఖైదీని జైలు అధికారులు సంభోగించినట్లయితే 5 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించబడతాయి.

సెక్షన్ 376-డి: మహిళా ఉద్యోగులను ప్రలోభపెట్టి సంభోగించినట్లయితే ఈ సెక్షన్ వర్తిస్తుంది.

నేర విచారణ ప్రక్రియ: క్రిమినల్ (ప్రొసీజర్ కోడ్) సెక్షన్ 125 ప్రకారం

1.ఎవరైనా ఒక వ్యక్తి తగినంత ఆర్థిక స్థోమత కలిగి ఉండి కూడా సరైన కారణం లేకుండా,

ఎ)భార్యను పోషించకున్నా

బి)మైనర్ పిల్లల్ని పోషించకున్నా (చట్టబద్ధంగా జన్మించిన పిల్లలైనా, అక్రమ సంతానం అయినా)

సి)తల్లిదండ్రులను పోషించకున్నా

ఈ సెక్షన్ ప్రకారం భరణం పొందవచ్చు. గతంలో ఇది ఒక వ్యక్తికి నెలకు 500 రూపాయలు పంపే లాగా ఉండేది. నేడు ఆ వ్యక్తి ఆదాయాన్ని బట్టి ఎంతైనా విధించవచ్చు. విడాకులు ఇచ్చిన భార్యకు కూడా ఈ చట్టం వర్తిస్తుందని అత్యున్నత న్యాయస్థానం 1985లో షాబాను కేసులో నిర్ణయించింది. ముస్లిం చట్ట ప్రకారం, 'మొహర్' ఇచ్చినా అది సంతృప్తికరంగా లేనట్లయితే ఈ సెక్షన్ ప్రకారం భరణం పొందవచ్చు.

హిందూ వివాహ చట్టం 1955: ఈ చట్టం ప్రవేశం ద్వారా భర్తలు మోసపూరితంగా తమకున్న నపుంసకత్వం గానీ, ఏవైనా జబ్బులు కలిగి ఉన్న వానిని దాచిపెట్టి పెళ్లి చేసుకున్నట్లయితే విడాకులు పొందే హక్కు వుంది. హిందూ అడాప్షన్ మెయింటెనెన్సు చట్టం ద్వారా కూడా భరణం పొందవచ్చు.

గృహహింస రక్షణ చట్టం 2005: మహిళలపై జరుగుతున్న గృహహింస నుండి స్త్రీని కాపాడడం కోసం చర్చించి చివరగా మన దేశంలో 2005లో ప్రవేశ పెట్టారు. 17-10-2006 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా మహిళలు భర్త గృహంలోనే నివాసమును, ఆర్థికంగా భరణం, గృహహింసకుగానూ నష్టపరిహారం పొందవచ్చు. ఈ చట్టం భర్త అత్తింటి వారిపైనేనే కాకుండా తండ్రి/ పుట్టింటి ఆరళ్ళ నుండి కూడా రక్షణ కల్పిస్తుంది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశం స్త్రీని రక్షించడానికే అయినా, ప్రతి వాదులుగా స్త్రీని కూడా చేర్చవచ్చని హైకోర్టు తీర్పునిచ్చింది.

ఎన్ని చట్టాలున్నా అమలులో అలసత్వం పెరిగినట్లయితే నిరుపయోగమవుతుంది. ఈచట్టాలను దుర్వినియోగపరిచినట్లయితే సరియైన బాధితులను కూడా అనుమానించవలసి వస్తుంది. సమాజంలో స్త్రీ తన ప్రత్యేకతను కాపాడుకుంటూ ఆత్మ గౌరవాన్ని నిలుపుకుంటూ సమాజం తలెత్తుకునేలా వ్యవహరిస్తేనే అందుకు ఆ సమాజం సహకరిస్తేనే అది అభివృద్ధికి సంకేతం, లేదంటే నాగరికత వర్ధిల్లనట్టు.

- జి ఎల్ నరసింహారావు, అడ్వకేట్.

కబళిస్తున్న ట్రాఫికింగ్

ట్రాఫికింగ్ అంటే లైంగిక వ్యాపారం కోసం అమ్మాయిల అక్రమ రవాణా. వీరిలో మహిళలు ఉంటారు. బాలికలు (18 ఏళ్లలోపు) వుంటారు. నేడు మహిళాజాతిని కబళిస్తున్న ఘోర విపత్తు ఇది. దినపత్రికల్లో ఈ వార్త కనిపించని దినం లేదు. ఇటీవల దేశరాజధాని ఢిల్లీ నగరంలో ఒక వ్యభిచారకూపం నుండి 64 మందిని - పోలీసులు, ఇతర సామాజిక కార్యకర్తలు కలిసి విడుదల చేశారన్న వార్త పతాక శీర్షికలకు ఎక్కింది. అందులో 25 మంది మహిళలు, 10 మంది బాలికలు మన రాష్ట్రంలోని కదిరి ప్రాంతానికి (అనంతపురం జిల్లా) చెందిన వారని ఆ వార్త పేర్కొన్నది. బాలకార్మిక వ్యవస్థలో మన రాష్ట్రం దేశంలోకెల్లా అగ్రస్థానంలో ఉన్న విషయం తెలిసిందే. అలాగే ఎయిడ్స్ వ్యాధికి సంబంధించి ద్వితీయ స్థానంలో ఉన్నది. ఈ రెండు మహమ్మారులు మన రాష్ట్రాన్ని రాహుకేతుల్లా పట్టిపీడిస్తున్నాయి. ఇప్పుడు ఈ రెంటికీ సంధానంగా అన్నట్టు ట్రాఫికింగ్ మహమ్మారి వేళ్లూనుకులటూ ప్రమాదకర భూమికను పోషిస్తోంది. కర్ణుడు చావుకు అనే కారణాలున్నట్టు బాలికలు ఈ ట్రాఫికింగ్ ఉచ్చులో చిక్కుకోవడానికి కూడా అనేక కారణాలున్నాయి.

ముఖ్యంగా మనది పురుషాధిక్య దోపిడీ సమాజం. ఆడపిల్ల పుట్టిందంటే చాలు-'మైనస్' అనుకునేవాళ్లు, 'పాపం ప్చ్' అని పెదవి విరిచేవాళ్లు, 'సాకడమే దండగ' అని వదిలించుకునేవాళ్లు, పురిట్లోనే అమ్మేసుకునేవాళ్లు, సంధికొట్టి చంపేసేవాళ్లు, కడుపులో ఉన్న ఆడబిడ్డను కడుపులోనే అంతం చేసేవాళ్లు అన్ని తరగతుల్లోనూ ఉన్నారు. పెరుగుతున్నారు. ఇదో విషాదం.

కదిరి వంటి వెనుకబడిన ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటున్నది. వెనుకబాటుతనంతో పాటు కటిక పేదరికం కలిసి జమిలిగా ఆడపిల్ల హక్కులపై, జీవితంపై దాడి చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో పరిశీలించినప్పుడు ఆడపిల్ల పుట్టేది, పెరిగేది కేవలం చాకిరీకి, డబ్బు సంపాదనకు మాత్రమేనన్న భావన ఆ ప్రాంత సమాజంలో బలంగా నెలకొని ఉన్నది. అంటే చిన్నప్పటి నుండి కుటుంబానికి పనిచేసే ఓ యంత్రంగా బాలికను చూడడానికి సమాజం పరిమితమైపోయిందనే విషయం తేలికగానే అర్థమౌతుంది.

ఈ కారణంగా బాలబాలికల్లో వివక్ష నేటికి భయంకరంగా కొనసాగుతూ ఉన్నది. ఎలాగైనా మగపిల్లలను చదివిస్తుంటారు. అవకాశం ఉన్నా ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తుంటారు. విధిలేక ఆడపిల్లలు ఇంటా బయటా చాకిరీకి మాత్రమే మిగిలిపోతుంటారు.

10-12 ఏళ్ల తర్వాత ఇంటి పనినుండి విడివడిన బాలికలు ఇంటికి ఆదాయాన్ని సంపాయించే పొలం పనులకు, ఇతర పనులకు వెళ్లడం ప్రారంభిస్తారు. రోజు కూలి 20 రూపాయల నుండి 60 రూపాయల వరకు వస్తుంది. కొందరు మగవాళ్లు ప్రతిరోజూ 80 రూపాయల నుండి 100 రూపాయలు తాగుడికి ఖర్చు చేస్తూ ఉంటారు. కేవలం తమ తాగుడు కోసమే ఆడపిల్లలను కూలికి పంపించే తండ్రులు లేకపోలేదు. యజమానుల వద్ద 5 వేల రూపాయల నుండి 10 వేలు ముందుగానే అడ్వాన్సు తీసుకుని ఆడపిల్లలను పనిలో పెడుతుంటారు. తక్కువ కూలి ఇచ్చి ఎక్కువ పని చేయించుకోవచ్చనే దుగ్ధతో యజమానులు కూడా ఆడపిల్లల తండ్రులకు బ్రోకర్లతో గాలం వేయిస్తుంటారు.

ఉదాహరణకు సీడ్‌పత్తి చేలల్లో 'క్రాసింగ్' పని అనుకుందాం. మగ పుష్పాలను, స్త్రీ పుష్పాలను వేర్వేరుగా గుర్తించి పుప్పొడి రేణువులతో పరాగసంపర్కం (పాలినేషన్) చేయడం. విషతుల్యమైన క్రిమి సంహారక మందుల ప్రభావంలో ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి శక్తికిమించి బాలికలు పని చేయడం, ఒక ఎత్తు.

అయితే కన్నెపిల్లలు చేస్తేనే ఫలితాలు వస్తాయని, లేకుంటే రావనే అశాస్త్రీయ దుష్ప్రచారంతో ప్రత్యేకంగా ఆడపిల్లలను మాత్రమే ఈ పనిలో వినియోగించడం మరో ఎత్తు. తెలిసో తెలియకో ఈ ప్రచారాన్ని చాలా మంది నమ్ముతున్నారు. పెద్దఎత్తున ఆడపిల్లలను ఈ పనిలో దింపడానికి ఈ ప్రచారం తోడ్పడుతున్నది. ఎవరి ఆర్థిక ప్రయోజనాలు వారికి ఉన్నప్పటికీ అటు యజమానులు, ఇటు తల్లిదండ్రులు దీనినే ఉపయోగించుకుంటారు. ఇక్కడ బాలిక బలైపోతున్నది.

రాయలసీమ కర్నూలు జిల్లా ఆదోని డివిజన్ ఆ చుట్టపక్కల ప్రాంతాల్లో సీడ్‌పత్తి వ్యవసాయం ఉన్న చోటల్లా ఈ దుర్మార్గం విచ్చలవిడిగా కొనసాగుతున్నది. వందల వేల సంఖ్యలో బాలికలు ఈ పనికోసం ఒక చోట నుండి మరో చోటికి రవాణా అవుతున్నారు. ఇంటినుండి బయటపడ్డ బాలికలు ఒక్కోసారి రోజుల తరబడి ఆ పొలాల్లోని కొష్టాల్లోనే నివాసం ఉంటారు.

ఇక్కడే దుర్మార్గంలో దుర్మార్గం అండర్‌గ్రౌండ్ యాక్టివిటీ నడిచేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

యజమానులు లేదా బ్రోకర్లకు సంబంధించిన వ్యక్తులు ఆడపిల్లలకు భోజన వసతితోపాటు రకరకాల ఆశలుచూపి ప్రలోభాలకు గురిచేస్తారు. బొట్టుబిళ్లలు, రిబ్బన్లు, గాజులు, డ్రస్సులతో ప్రారంభమై రకరకాల సి.డి.లు, అశ్లీల చిత్రాలు చూపిస్తూ, మత్తుపానీయాలతో లోబరచుకునేందుకు ప్రయత్నిస్తారు.

డబ్బుతోపాటు, వేరే ఇతర ఉపాధి అవకాశాలు లభిస్తాయేమోనన్న ఆశ ఆడపిల్లలను వెంటాడుతుంది. అదే సందర్భంలో వారు అప్పటికే అనుభవిస్తున్న సామాజిక అణచివేత, వివక్షత నుండి బయటపడేందుకు ఇదే సరైన దారేమో, చక్కటి అవకాశమేమోనన్న ఊహలకు రెక్కలు వస్తాయి. కష్టాల సుడిగుండంలో పుట్టడం, పెరగడం, మళ్లీ (బాల్య) వివాహంతో చిక్కుకుపోవడం కన్నా రంగురంగులతో పలకరించే కొత్త ప్రపంచం బలంగా ఆకర్షిస్తుంది. ఇది కొంత తెలిసీ తెలియక వయసు ప్రారంభంలో ట్రాఫికింగ్ వలలో ఇలా చిక్కుకుపోతుంటారు. జిన్నింగ్‌మిల్లులు, కుట్టుపని, బీడి పని, ఇతర కార్ఖానాల్లో పీస్‌రేట్‌పై పనిచేసే ఈ ప్రాంత బాలికలకు ట్రాఫికింగ్ ఉచ్చు తేలికగా పడుతున్నది. అప్పటికే పనులకోసం వలసలు పోవడం, ఎక్కువ కూలికి ఏ ఇతర పనులు చేయడానికైనా అలవాటుపడడం ట్రాఫికింగ్ మార్గాన్ని సరళం చేస్తున్నది.

అంతేగాకుండా ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో బసివిని, జోగిని, దేవదాసి, కళావంతుల మూఢాచారం కొనసాగుతున్నది. నిరుపేద కన్నెపిల్లలను కులాచారంతో, కుటుంబ మొక్కులతో బాలికలను వ్యభిచారానికి బలిచేసే తంతు ఇది. ఇలాంటి పిల్లలతో కన్నెరికం చేస్తే జయం కలుగుతుందనే పెత్తందార్ల దుష్ప్రచారం ఉండనే ఉంటుంది. ఆ తర్వాత ఆమె ఆ ప్రాంత లైసెన్స్ వ్యభిచారిగా మారుతుంది. మతాన్ని క్షుద్ర పూజలను అడ్డుపెట్టుకుని పేదబాలికలను ఈ పేరుమీద వ్యభిచారకూపంలోకి నెట్టే స్థితి సాగుతున్నది. వికృతం ఏంటంటే సుఖవ్యాధులు ఉన్న మగవాళ్లు స్వచ్ఛమైన (వర్జిన్) కన్నెపిల్లలతో కలిస్తే అవి

పోతాయనే మూఢనమ్మకం కూడా ప్రచారంలో పెట్టారు. ఎటుచూసినా కారణం ఒకటే. అనివార్యంగా బాలికలను ట్రాఫికింగ్‌లోకి నెట్టడమే. అయితే అనేక చోట్ల లైసెన్స్ ఉన్న జోగినిలు, హిజ్రాలు బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి మధ్యవర్తిత్వంతో ఇప్పుడు ట్రాఫికింగ్ వ్యవహారమంతా బహిరంగ రహస్యంగానే సాగిపోతున్నది. 'బాలికలు వ్యభిచారకూపంలో జీవిస్తున్నారంటే వారి జీవితం మృతప్రాయమే, చనిపోతున్న వారితో సమానమే' అని ట్రాఫికింగ్‌పై విడుదల చేసిన ఓ నివేదిక పేర్కొన్నది.

ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల ఒప్పందం ఈ విధంగా తెలియజేసింది. "అన్నిరకాల లైంగిక వేధింపుల నుండి, అత్యాచారాల నుండి, దోపిడీ నుండి బాలబాలికలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాలదేనని వక్కాణించింది (ఆర్టికల్ 34). వ్యభిచారం, అమ్మకం, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలను బలవంతంగా అలవాటు చేయడం, అసహ్యంగా ఫొటోలు తీయడం, అశ్లీల పద్ధతులను ఉపయోగించడం లేదా భయపెట్టడం, వికృత లైంగిక చేష్టలకు పురికొల్పడం మొదలైన అకృత్యాలను నిలువరించడం, నివారించడం కోసం ప్రభుత్వాలు తగు చర్యలు తప్పక చేపట్టాలని" హెచ్చరించింది.

'బాలిక లేదా బాలుడు లైంగిక దోపిడీకి గురైతే, హక్కుగా వారికి సంక్రమించిన అపురూప బాల్యాన్ని నిరాకరించినట్లే' అని కూడా ఆ ఒప్పందం స్పష్టం చేసింది.

అలా వలలో పడిన బాలికలను చిల్లరగా, టోకుగా వ్యభిచార కూపాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. నగ్నంగా చెప్పాలంటే ఇదో మాంసం ముద్దల వ్యాపారం. ఇక్కడ నీతినియమాలకు తావుండదు. ధన సంపాదనే పరమావధి.

ఒక సర్వే ప్రకారం నూటికి 85 మంది పడుపువృత్తిలోకి బాలికలుగా ఉన్నప్పుడు (18 ఏళ్లలోపే) వచ్చినవారే. వలసలు, మోసాలు, పేదరికం, కుటుంబాల విచ్ఛిన్నం, పని వత్తిడి మొదలైనవి కారణాలుగా తెలిసింది. సగటున రోజుకు 7-8 మంది విటులను తృప్తిపరచాలి. ఆరోగ్యం సహకరించకపోయినా, వళ్లంతా పచ్చిపుండైనా, భరించలేని మంటలు ఉన్నా, మందులు, ఐస్‌ముక్కలతో ఉపశమనం పొంది వృత్తికోసం సాగించాల్సిందేనని ఆ సర్వే పేర్కొన్నది.

కాగా ప్రపంచీకరణ కాలంలో ఇటు టూరిజం అత్యంత అభివృద్ధి అవుతున్న రంగంగా ముందుకు వస్తున్నది. మన రాష్ట్రం కాకపోయినా బొంబాయి, గోవా వంటి ప్రాంతాల్లో కొందరు టూరిస్టులు కేవలం వ్యభిచారం కోసమే వస్తున్నారు. విశృంఖల లైంగిక క్రీడలకు దోపిడీలకు, నీలిచిత్రాలకు, ఫొటోలకు పెద్ద ఎత్తున బాలికలను వినియోగించుకుంటున్నారు. విలాసవంతులైన సంపన్నుల గెస్ట్‌హౌస్‌లు, ఫామ్‌హౌస్‌లు, ఇందుకోసం ప్రత్యేకంగా



వినియోగించబడుతున్నాయి. రహస్య స్థావరాలుగా ఏర్పడుతున్నాయి. ఇటీవల గవర్నర్ ఎన్.డి. తివారీ కార్యాలయంలో జరిగిన రాసలీలను మనం మరిచిపోలేం కదా.

అంటే వయసుతో, ప్రాంతంతో, భాషతో నిమిత్తం లేకుండా బాలికల, మహిళల లైంగిక వ్యాపారం- ట్రాఫికింగ్ విచ్చలవిడిగా సాగుతున్నదనే విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. హాస్టళ్ల, క్లబ్‌లు, మతగురువుల ఆశ్రమాలు, మఠాలు, చివరకు ఆరాధనా స్థలాలు సైతం లైంగిక అకృత్యాలకు నిలయంగా మారుతున్నాయి. అయితే ఇంత పెద్ద కళంకాన్ని ఎదుర్కోవడం ఎలా? అధికారులు, ఇతర సామాజిక కార్యకర్తలు ముఖ్యంగా మూడు పద్ధతులు అనుసరిస్తున్నారు.

1. వ్యభిచార కూపం నుండి బయట పడినవారికి, బయట పడేసిన వారికి కౌన్సిలింగ్ జరిపి తిరిగి వారిని వారి కుటుంబాలకు చేర్చి, పునరావాసం కల్పించి, కొత్త జీవితం ప్రారంభించేందుకు చేయూతనివ్వడం.

ఈ క్రమంలో ఇటీవల విజయవాడ పరిసర గ్రామాల్లో జరిగిన కొన్ని సంఘటనలు వెలుగులోకి వచ్చాయి.

సేల్స్‌గర్ల్‌గా, ప్రమోటర్స్‌గా రిక్రూట్ చేసుకున్న ఓ సంస్థవారు యువతులకు, మెరుగైన ఉపాధి అవకాశాలను ఆశగా చూపి మాదకద్రవ్యాలను అలవాటు చేస్తున్నారు. తాము ఊహించుకుంటున్న అందమైన భవిష్యత్తుకోసం తమకు ఇష్టం లేకపోయినా వారు ఆ ఇంజక్షన్స్ తీసుకుంటున్నారు. ఒకసారి అవి తీసుకున్నాక క్రమేపీ వాటికి అలవాటు పడుతున్నారు. ఎడిక్ట్ అయిపోతున్నారు. దాంతో ఇంట్లో ఉన్నా కుదురుగాలేక, మళ్లీ అవే డ్రగ్స్ కోసం వెంపర్లాడడం, ఇంటి నుండి పదేపదే పారిపోవడం జరుగుతున్నది. ఈ పరిణామాలతో మధ్యతరగతి కుటుంబాలు సైతం తమ ఆడపిల్లలను నిర్దాక్షిణ్యంగా వదులుకోవడానికి సిద్ధమవుతున్నాయి. దాంతో వారికి అనివార్యంగా మిగిలిన దారి ట్రాఫికింగ్ అవుతున్నది. పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టు అయింది పరిస్థితి. మాండ్రిక్స్, హెరాయిన్, కొకైన్, భరస్, ఎపిడ్రిన్, కెటామైన్ వంటి మాదకద్రవ్యాలు సైతం ఇప్పుడు చలామణిలోకి వచ్చాయని, జగ్గయ్యపేటలోని ఓ పారిశ్రామికుడు ఇదే మాదకద్రవ్యాల వ్యాపారంతో కోట్లు గడించాడని, రాష్ట్రం మాదకద్రవ్యాల అడ్డాగా మారుతుందని ఈ సందర్భంగా చెబుతూ ఓ పోలీస్ అధికారి ఆందోళన వెలిబుచ్చాడు.

2. వేశ్యావాటికల నుండి బయటపడ్డవారిని ఒక చోట చేర్చి వారికి కొన్ని వృత్తుల్లో శిక్షణ ఇప్పించి (ఒకేషనల్ ట్రైనింగ్) పునరావాసం కల్పించడం, కంప్యూటర్ కోర్సు, అల్లికలు, కుట్టుపని ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీషియన్ కోర్సు, పేపర్ బైండింగ్ వర్కు, బిస్కెట్ల తయారీ మొదలైన వాటిలో కూడా లోపమున్నది. శిక్షణ అనంతరం సరైన ఉపాధి, జరుగుబాటుకు సరిపోయే ఆదాయం రాని పరిస్థితుల్లో మళ్లీ పాతవృత్తినే ఎంచుకునే ప్రమాదం ఉందని శిక్షణ నిర్వాహకులు చెప్తున్నారు.

3. గ్రామాల్లో ఎక్కడికక్కడ కిషోర్ బాలికాసంఘాలను ఏర్పాటు చేయడం. ట్రాఫికింగ్ నివారణకు ఈ సంఘాలు ఉపయోగపడతాయి. సంఘంలో బాలికలు సంఘటిత శ్రమతో జీవన, జీవ నైపుణ్యాలు నేర్చుకుంటారు. ట్రాఫికింగ్ ప్రమాదాన్ని ముందుగానే తెలుసుకుని అధికారులతో, ఇతరులతో కలిసి ఐక్యంగా ఎదుర్కోవడానికి సన్నద్ధమవుతారు. ట్రాఫికింగ్ ఎదర్కొనేందుకు యునిసెఫ్ ప్రత్యేకంగా అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, ఈ నాలుగు జిల్లాల్లోని సమస్య తీవ్రంగా ఉన్న కొన్ని మండలాలను కలుపుకుని ఓ రీజనల్ నెట్‌వర్కును ప్రారంభించింది. కడప కేంద్రంగా, ఆ జిల్లా కలెక్టర్ నేతృత్వాన ఈ నెట్‌వర్క్ పరిమిత స్థాయిలో పై మూడు పద్ధతుల్లో కృషి సాగిస్తున్నది.

ఒక్కటి మాత్రం నిజం

99శాతం మద్యం విక్రయాలు మగవారి తాగుడు అలవాటు వల్లనే జరుగుతున్నాయి. అలాగే సినిమా హాళ్లలో నీలిచిత్రాలు (బ్లూఫిలిమ్స్) చూసేది నూరు శాతం మగవాళ్లే. ఆడవాళ్లు ఎక్కడా కన్పించరు. కానీ నీలిచిత్రాల ఉత్పత్తులకు, లైంగిక వ్యాపారానికి ఆడపిల్లలే అవసరం. డబ్బు, ఉపాధి అవకాశాలు ఎరగా చూపి మాదకద్రవ్యాల ఆసరాతో ఈ లైంగిక దోపిడీ విచ్చలవిడిగా సాగుతున్నది. ఆధునిక పెట్టుబడిదారీ ప్రపంచం ఫ్యాషన్, పబ్‌లు, క్లబ్‌లు, అందాల పోటీలు, కెరీర్‌ల పేరుతో ఈ దుర్మార్గాన్ని ప్రోత్సహిస్తున్నది. అంతిమంగా బాలిక బలైపోతున్నది పారాహుషార్. ముంచుకొస్తున్న ఈ పెనుప్రమాదాన్ని నివారించాల్సిన బాధ్యత కేవలం మహిళాలోకానిదే కాదు, ఇతర సమాజంపై కూడా ఉన్నదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలి.

- కె.శాంతారావు

విజ్ఞానగతి మార్చిన వనితలు

చరిత్ర గతిని పరిశీలిస్తే విజ్ఞాన శాస్త్ర రంగం అభివృద్ధిలో మహిళల పాత్ర విశేషంగా కనిపిస్తుంది. కేవలం పురుషులకే సాధ్యమనుకున్న అనేక క్లిష్ట శాస్త్ర పరిధుల్ని అవలీలగా దాటడమే కాక తమ ప్రతిభా పాటవాలను పటిష్ఠంగా ప్రకటించారు మహిళలు. గణిత, ఖగోళ, రసాయన, జీవ, ఆరోగ్య రంగాలలోనేకాక మరెన్నో చోట్ల స్త్రీలు విశిష్ట పరిశోధనలు చేసి, కొత్త ఆవిష్కరణలకు కారకులయ్యారు.

మహిళా శాస్త్రవేత్తలనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది మేరీ క్యూరీ. రసాయన శాస్త్రంలో ఆమె చేసిన అద్భుతమైన పరిశోధనతో మనకు మన నిత్య జీవితంలో ఎంతగానో ఉపయోగపడే ఎక్స్ కిరణాల వివరాలు లభించాయి. రేడియేషన్ పరిశోధనకు గుర్తింపుగా 1903లో ఒకసారి, రేడియం, పొలోనియం అనే రెండు మూలకాలను కనుగొన్నందుకుగాను 1911లో మరొకసారి, ఆమెకు నోబెల్ పురస్కారం లభించింది. అయితే మేరి క్యూరీ ఎన్నో సంవత్సరాలకు పూర్వమే 'పురుషులదే' అనుకునే రంగాలలో స్త్రీలు తమ ఉనికిని చాటారు. క్రీస్తు శకం 360 ప్రాంతాలలో హైపాషియ అనే గ్రీకు మేధావి అలెగ్జాండ్రియాలో ఉండేది. గణిత రంగంలో ఆమె తొలి గణనీయమైన మహిళగా ప్రసిద్ధి పొందింది. ఆ కాలంలో విస్తారంగా ఉన్న మతవిశ్వాసాలకు వ్యతిరేకంగా ఆమె గణితాన్ని, తర్కాన్ని ప్రోత్సహించేది. శాస్త్రంతో మతాన్ని ఎదుర్కొన్న గొప్ప మహిళగా ఆమెను పేర్కొన్నారు. కానీ ఆమెను మత ఛాందసులు పొట్టనపెట్టుకున్నారు.

పదకొండవ శతాబ్దంలో ఇటలీలో జీవించిన ట్రోటులా గైనకాలజీ రంగంలో విశేష కృషి చేసిన తొలి మహిళల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. స్త్రీల ఆరోగ్యంపై పురుషులకు అవగాహన కలిగించే రీతిలో ఆమె ప్రచురించిన గ్రంథాలు కొన్ని శతాబ్దాల వరకూ వైద్యులు వాడుతూ వచ్చారు. స్త్రీలే కాకుండా పురుషులు కూడా సంతానపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని అప్పట్లోనే ట్రోటులా ప్రతిపాదించి కలకలం రేపారు. ప్రసవ సమయంలో నొప్పి తెలియకుండా మత్తు మందు ఇవ్వడం కూడా ఆమె ప్రోత్సహించింది. యథాప్రకారం మత పెద్దలు అందుకు వ్యతిరేకత కనబరిచేవారు. వారి దృష్టిలో స్త్రీలు ప్రసవవేదన అనుభవించవలసిందే.

1706- 1749 సంవత్సరాల మధ్య జీవించిన ఎమిలీ డ్యు చాట్‌లెట్ ఫ్రెంచ్ భౌతిక, గణిత శాస్త్రవేత్తగా పేరొందారు. ఆమె న్యూటన్ రచించిన ప్రిన్సిపియ అనే గ్రంథాన్ని ఫ్రెంచ్‌లోకి తర్జుమా చేశారు. అయితే ఆ గ్రంథాన్ని ఆమె మరణానంతరం ప్రచురించారు. ఆమె పరిశోధనకు ఆమె తండ్రి ఎంతగానో తోడ్పడ్డాడు. అయితే అది విద్య మీద మమకారంతో కాదు, తన కుమార్తెకు వివాహ సంబంధాలు వచ్చేంత అందం లేదని భావించడం వల్ల. విశేషమేమిటంటే, ఎమిలీకి పంతొమ్మిదవ ఏటే వివాహం జరిగింది. సైన్సు చదవడానికి ఆమె మగవేషం వేసుకునేది. ఆమె గురించి ప్రసిద్ధ ఫ్రెంచ్ రచయిత వాల్టెయిర్ అన్న మాట: "ఎమిలీ గొప్ప వ్యక్తి. ఆ వ్యక్తికున్న ఒకే ఒక లోపం స్త్రీగా ఉండడం".

ఆంటోనీ లవోసియర్ అనే రసాయన శాస్త్రవేత్త ఎన్నో గొప్ప ఆవిష్కరణలు చేశాడు. కానీ ఆయన భార్య మేరీ అన్నేపాల్జే(1758-1836) కూడా గొప్ప రసాయనవేత్త. కాకపోతే మిసెస్ లవోసియర్‌గా ఆమె ప్రతిభ మరుగున పడింది. ఆమెను ఆధునిక రసాయన శాస్త్ర మాతృమూర్తిగా గుర్తించారు. పరిశోధనశాలలో భర్తకు సహకరించడమే కాక ఎన్నో ఇతర భాషా గ్రంథాలను ఫ్రెంచ్‌లోకి అనువదించి భర్తకు చదవడానికిచ్చేవారామె.

1750-1848 సంవత్సరాల మధ్యలో హర్షెల్ ప్రఖ్యాత మహిళా ఖగోళ శాస్త్రవేత్తగా ఉండేది. తన సోదరుడు విలియం హర్షెల్‌కి సహాయకారిగా ఉంటూ, కరోలిన్ హర్షెల్ ఎనిమిది తోక చుక్కలను కనిపెట్టారు. ఆమె, మేరి ఫెయిర్‌ఫాక్స్ కలిసి రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీకి ఎన్నికైన తొలి మహిళలు. వీరు 1835లో ఎన్నికయ్యారు. 96 సంవత్సరాల ముదిమిలో ఆమెకు ప్రష్యా రాజు స్వర్ణ పతకం ప్రదానం చేశాడు. చంద్రుడిపై ఒక లోయకు హర్షెల్ పేరు పెట్టి ఆమెను గౌరవించారు.

కంప్యూటర్ భాషను ప్రోగ్రాం చేసిన తొలి మహిళ అగస్టా అడా కింగ్. లార్డ్ బైరన్‌కి ఏకైక కుమార్తె అడా(1815-1852), చార్లెస్ బాబేజ్ కంప్యూటర్ కోసం విస్తృతమైన వివరణ రాసినందుకు పేరుపొందారు. బాబేజ్ ఇంకా రూపొందించని యంత్రానికి ప్రోగ్రాములు రాశారు. అమెరికా రక్షణ విభాగం రూపొందించిన ఒక కంప్యూటర్ లాంగ్వేజ్‌కి కూడా పేరు పెట్టి ఆమెను సత్కరించారు.

చియెన్ షుంగ్ వూ(1912-1997) చైనాలో జన్మించిన అమెరికన్. భౌతికశాస్త్రంలో ఆమె పరిశోధన న్యూక్లియర్ పదార్థాల లక్షణాలపై అప్పటివరకూ ఉన్న అవగాహనను మార్చివేశారు. ఆమె కృషికి నోబెల్ బహుమతి రావలసిందని అందరూ అనుకున్నారు. ఆమెను చైనీయుల మేడం క్యూరీ అని అంటారు.

నాడీకణాల పెరుగుదల అంశాన్ని కనుగొన్నందుకు స్టాన్లీ కోహెన్‌తో కలిసి ఒక మహిళ 1986 నోబెల్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆమె ఇటలీలో జన్మించిన రీటా లేవీ మొన్టాల్సిని. ఆమె జన్మతః యూదురాలు కావడం వల్ల ముసోలిని ప్రవేశ పెట్టిన చట్టాలవల్ల ఉన్నత చదువుకి ఆటంకం ఏర్పడింది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఆమె ఇంట్లో ఏర్పాటు చేసిన ప్రయోగశాలలోనే పరిశోధనలు చేసేవారు. అక్కడ కోడి పిండాలపై చేసిన పరిశోధనలే మున్ముందు పరిశోధనలకు పునాది. 1909లో జన్మించిన రీటా, జీవించి ఉన్న నోబెల్ గ్రహీతలలో అతి ముదుసలి.

రోజలిండ్ ఫ్రాంక్లిన్ డి ఎన్ ఎ, వైరస్‌ల స్వరూపాలను అర్థం చేసుకునే దిశలో వీలు కల్పించిన ప్రయోగాలు చేసి వినుతికెక్కారు. ఎక్స్‌రే క్రిస్టల్లోగ్రాఫి టెక్నిక్ సాయంతో ఆమె చేసిన పరిశోధనలు వాట్సన్, క్రిక్‌లకు నేరుగా ఉపయోగపడ్డాయి. వాటి వల్లే వారు డిఎన్ఎ నిర్మాణాన్ని కనుగొనగలిగారు. చిన్న వయసులోనే ఆమె క్యాన్సర్ బారినపడి మరణించారు. మరణించిన వారికి పురస్కారం ఇవ్వగూడదని నిబంధన కారణంగా ఆమెకు రావలసిన నోబెల్ బహుమతి వాట్సన్, క్రిక్‌లకు లభించింది.

కరెన్ హార్నీ అనే సైకో అనలిస్ట్, గ్రేస్ హూపెర్ అనే కంప్యూటర్ నిపుణురాలు, జేన్ గూడాల్ అనే ఆంత్రపాలజిస్ట్, కరోల్ జేమిసన్ అనే నాసా అంతరిక్ష శాస్త్రవేత్త, రేచల్ కార్సన్ అనే పర్యావరణ వేత్త... ఇలా అసంఖ్యాకంగా మహిళలు పురుషులు సైతం పునరాలోచించే శాస్త్రరంగాలలో పేరెన్నికగన్నారు. వీరేకాక ఎందరో మహిళలు అటు అణువుల నుండి అంతరిక్షం వరకు, ఇటు గణితం నుండి పర్యావరణం వరకు అపూర్వ పరిశోధనలు చేసి మానవ శాస్త్రీయ జ్ఞానాన్ని ముందుకు నడిపించారు. వారు లేకపోతే మనకు తెలిసిన విజ్ఞానం కొంత తక్కువే అయి ఉండేది. ఈనాడు వారు ఎదుర్కొన్న అవరోధాలు చాలా వరకు లేవు. అందువల్లే శాస్త్ర రంగంలో స్త్రీలు వర్ధిల్లుతున్నారు. ఇంకా వర్ధిల్లాలి. జ్ఞానం విజ్ఞానం ఏ ఒకరి సొత్తూ కాదు. మెదుడును సక్రమంగా ఉపయోగించుకోగలిగే ప్రతి ఒక్కరిదీ.

- కాకర్లమూడి విజయ్

చట్టసభల్లో మేం...

అవరోధాలను అధిగమిస్తూ తనను తాను రుజువు చేసుకోవడానికి మహిళలు నేడెంతో శ్రమిస్తున్నారు. జనాభాలో సగభాగంగా ఉన్నా విధాన నిర్ణయాలలో అవకాశాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. స్థానిక సంస్థల్లో గెలుపొందిన చోట మహిళలు పాలనలో తమదైన ముద్ర వెయ్యడాన్ని చూస్తున్నాం. ఇతర లోపాలను పక్కన పెడితే అక్కడ మహిళల్లో కన్పిస్తున్న నిబ్బరాన్ని గమనించగలం. భర్తలకే మరో ఓటు, సీటు ఇచ్చినట్లేనన్న విమర్శలు ఉన్నప్పటికీ స్థానిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం ఒక ముందడుగే. దేశవ్యాపితంగా జన జీవనాన్ని శాసించే అత్యున్నత చట్ట సభల్లో మాత్రం వీరి సంఖ్య నానాటికీ తీసికట్టు నాగంబొట్లుగా ఉంది. 1952 నుండి జరిగిన ఎన్నికలను ఒకసారి పరిశీలిస్తే..

1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ప్రాతినిధ్యమే లేదు. 1957లో పోటీ చేసిన 45 మందిలో 22 మంది గెలిచారు. మహిళల మొదటి ప్రాతినిధ్యం 4.45 శాతం. ఇది 1962లో 6.27కు పెరిగి 1967 నాటికి 5.57కు తగ్గింది. 1971లో కేవలం 21 మంది మాత్రమే ఎన్నికయ్యారు. వీరి శాతం 1952నాటి కన్నా తక్కువ. కేవలం 4.05 మాత్రమే. 1977 మరింత అధ్వానమైంది. ఈ ఎన్నికల్లో అత్యల్పంగా 19 మంది ఎన్నికయ్యారు. ఇది 3.50 శాతం మాత్రమే. ఇంత తక్కువ శాతం ఇంకెపుడూ నమోదు కాలేదు. 1980 నాటికి 5.16 శాతం, 1984లో 7.74 శాతం పెరిగిన ప్రాతినిధ్యం 1989 నాటికి 5.34 శాతానికి మళ్లీ దిగజారింది. 1991లో కొంత పుంజుకుని 7.1 శాతానికి, 1996లో 7.36కు, 1998లో 7.91 శాతానికి పెరిగింది. 1999 ఎన్నికల్లో 9.02 శాతంతో లోక్‌సభ 49 మంది మహిళలతో నిండింది. మళ్లీ 2004లో ఈ సంఖ్య 45కు తగ్గినా 2009లో 59మంది మహిళలు విధాన నిర్ణయాల సభకు వెళ్లారు. ఈ ఎన్నికల్లో దేశవ్యాపితంగా 556 మంది ఎన్నికల బరిలో నిలబడగా 59 మంది ఎన్నికయ్యారు. ఇది 13.80 శాతం. వైకుంఠపాళిలో నిచ్చెనమెట్లలాగా ఎగుడుదిగుడుగా మహిళల ప్రాతినిధ్యముంది. ఎందరు అనే లెక్కలొక భాగం మాత్రమే. 2004 ఎన్నికలనాటికి దేశంలో 12.5 కోట్లమంది మహిళా ఓటర్లుంటే వారిలో అత్యున్నత నిర్ణయాలు తీసుకునే సభకు వెళ్లినవారు కేవలం 45 మంది మాత్రమే. అంటే పరిపాలనలో మహిళలెక్కడున్నట్టనుకోవాలి?

మన రాష్ట్రానికి సంబంధించి 2004లో ముగ్గురు ఎన్నికయ్యారు. 2009లో ఐదుగురు పార్లమెంటుకెళ్లారు. 42 స్థానాలకు గానూ ఐదుగురి ప్రాతినిధ్యం మాత్రమే. అసెంబ్లీలోనూ మహిళల సంఖ్య అంతంత మాత్రమే. ఎటునుండి ఎటులెక్కించినా మూడు పదులు దాటని పరిస్థితి. మహిళలకు సీటివ్వడమే త్యాగంగానూ, అలా ఇచ్చినవారు మహిళోద్ధారకులు గానూ చెలామణవుతున్నారు. అంతే తప్ప వారి శక్తి సామర్థ్యాలు, ఆలోచనలు సమాజ శ్రేయస్సుకు లాభమనే ధోరణి తక్కువగా ఉంది. ఆడవారికేమీ తెలీదనే భావన మన సమాజంలో వేళ్లూనుకుని ఉంది. ఏదో తాము గెలిపించాం కనుక మహిళలు చాలా ఎదిగిపోయారని వ్యంగ్యంగానూ మాటలు వినపడుతుంటాయి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను ఎలాగోలా అంగీకరించిన 'పెద్దలు' చట్టసభల్లో మహిళా బిల్లెందుకని మోకాలడ్డుతున్నారో అర్థం చేసుకోవాలి. విధాన నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో తెలుసుకోవాలి. మహిళాబిల్లు కోసం పోరాటం కేవలం రాజకీయ అధికారాల్లో సమానభాగం కోసం నిర్వహిస్తున్న ఉద్యమం మాత్రమేకాదు. స్త్రీల గురించి సమాజంలోనూ, సాంస్కృతికంగానూ ఉన్న మూసపోత భావజాలాన్ని ప్రశ్నిస్తున్న ఉద్యమమిది. ఎన్నో పార్టీలు పైకి అతి మర్యాదగా దీన్ని సమర్థిస్తూనే అసలు సమయానికి తమ వంకర బుద్ధిని ప్రదర్శించడాన్ని 1996 నుండీ మనం చూస్తున్నాం. ఈ కాలం నుండీ ఎన్నో ఎన్నికలు వచ్చాయి. 1999-2000 మధ్యలో ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక, బీహార్, ఒరిస్సా, హర్యానా, మణిపూర్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ శాసన సభలకు ఎన్నికలొచ్చాయి. ఈ రాష్ట్రాలలో మొత్తం 1519 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మహిళాబిల్లు ఆమోదమే పొంది ఉంటే 509 మంది మహిళా ఎమ్మెల్యేలు ఈ తొమ్మిది రాష్ట్రాలలో ఎన్నికయ్యేవారు. కానీ ఇక్కడ ఎన్నికైంది కేవలం 85 మంది, అంటే 5.5 శాతం మాత్రమే. ఈ వివరాలు తెలుసుకుంటే బిల్లు ప్రాధాన్యం అర్థమౌతుంది. సంఖ్య పెంపుదల మాత్రమే కాదు, సమాజంలో స్త్రీల పట్ల కొనసాగుతున్న వివక్షను ప్రశ్నిస్తున్న వైనాన్నీ చూడొచ్చు. విధాన నిర్ణయాలలోనే మహిళల భాగస్వామ్యం ఉంటే వచ్చే చట్టాల తీరుతెన్నులు మరోలా ఉండడానికి ఆస్కారముంది. పేరుకు ప్రాతినిధ్యంలాగా ఆ స్థానం, ఈ స్థానం అని చెప్పుకున్నా దానివల్ల మహిళలకొనగూరే మేలు అంతగా ఉండదు.

మన రాష్ట్రం పరిస్థితినే చూద్దాం. తెలంగాణా పోరాటం అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆ పోరాట వీరులు, వీరనారులు అసెంబ్లీలో అడుగుపెట్టారు. మన మొట్టమొదటి ప్రతిపక్షనేత ఆరుట్ల కమలాదేవి. చర్చల్లో ఆ వాడీ, వేడిని నేటికీ చెబుతుంటారు. సమస్యలపై స్పందన, లోతైన అధ్యయనం అప్పటి వారి సొంతం. ప్రజల సమస్యల నాడి తెలిసిన మహిళలు తర్వాత కాలంలోనూ సభలో అడుగుపెట్టారు. రానురానూ వారసత్వ రాజకీయాల ప్రభావంతో అధ్యయనం తగ్గి అర్హతగా మాత్రమే మొత్తంగా రాజకీయాలలోనే ఒక ఒరవడిగా కొనసాగుతోంది. ప్రస్తుతం దేశంలోని అత్యున్నత స్థాయి, స్థానాలలో మహిళలున్నారు. రాష్ట్రపతి ప్రతిభాపాటిల్, యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, స్పీకర్ మీరాకుమార్, ప్రతిపక్షనేత సుష్మాస్వరాజ్ తదితరులు జాతీయస్థాయిలో కీలక నేతలుగా ఉన్నారు. మన రాష్ట్రంలో శాసనసభాపక్ష నాయకురాలిగా గీతారెడ్డి, హోంమంత్రిగా సబితా ఇంద్రారెడ్డి, మంత్రులుగా సునితా లక్ష్మారెడ్డి, గల్లా అరుణకుమారి, డికె అరుణ తదితరులు ప్రస్తుతం మంత్రులుగా ఉన్నారు. గతంలో మన అసెంబ్లీకి ప్రతిభా భారతి స్పీకరుగా ఉన్నారు. ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఒకవైపు, ప్రతినిధులు అలంకారప్రాయంగా ఉండడం మరో వైపు కనపడుతుంది. ఈ పాటి ప్రాతినిధ్యానికి మహిళల సమస్యలు మటుమాయం అయ్యాయంటున్న వారు ఇటీవల మన రాష్ట్రంలో మహిళా భద్రతపై ఆలోచించాలి. ఏ రకమైన దాడులు ఎటు నుంచి వస్తాయో, ఏ ఉన్మాది ఎక్కడ విరుచుకుపడతాడో తెలియని పరిస్థితి. భర్తల చేతుల్లో హింసకు గురవుతున్న సంఖ్యలో మనమే ఫస్టట. మహిళా సంక్షేమ కార్యక్రమాల అమలు లోపభూయిష్టం. ఇలా విడదీసి చూడలేని పలు సమస్యల్లో మహిళలున్నారు. మహిళల ప్రాతినిధ్యం పెరగడం, రాజకీయ రంగంలో అధ్యయనం, పోరాటాలలో మహిళలను సమీకరించడం, ఆ అనుభవాలను చట్ట, శాసనసభల్లో వినిపించడం, పరిష్కారానికి పాటుబడడం అవసరం. జనాభాలో భాగానికనుగుణంగా వారి వాణిని వినిపించేందుకు సంఖ్యరీత్యా పెరగడం అవసరం. రాజకీయాల్లోనూ పాలుపంచుకోవాలి. ఇదే సమయంలో స్త్రీల సమస్యల పట్ల ఏ వేదిక లేక పార్టీకి సానుభూతి ఉన్నదో గమనిస్తూ అందుకు అనుగుణంగా మహిళా ఓటర్లు తమ మద్దతును ఎవరికివ్వాలో నిర్ణయించుకోవాలి. సదరు కూటముల్లో ఏది మహిళా సమానత్వానికి వ్యతిరేకో పరిశీలించి దాన్ని ఓడించాలి. భావ ప్రధానంగా ఎవరు 'మన' అనే విచక్షణతో ఓటు చేస్తే రాజకీయాలు ప్రక్షాళనౌతాయి. వర్గ తారతమ్యాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. మహిళా ప్రాతినిధ్యం అంటూ నొక్కి చెప్పడం పురుష వ్యతిరేకత కాదు. బూర్జువా సమాజంలో అంటే జీవనాధారానికీ, సాంస్కృతిక పురోగమనానికీ అవసరమైన వస్తువుల ఉత్పత్తి సాధనాలపై ప్రయివేట్ యాజమాన్యం అదుపుంది. దీన్ని తొలగించగలిగితే దోపిడీకి గురవుతున్న వర్గానికీ, అదే విధంగా అణగారిన తరగతులకు చెందిన మహిళలకూ విముక్తి, సమానత్వం దక్కుతుంది. ఈ వర్గ తారతమ్యాల అధ్యయనం మన మహిళా ప్రతినిధులకు అన్ని స్థాయిల్లోనూ పెరగాలని కోరుకుందాం. ప్రతి వంటగత్తె ఒక రాజకీయవేత్త కావాలన్న లెనిన్ మాటను అవలోకిద్దాం.

- ఉష

మహిళా! మేలుకో!!

-కె.స్వరూపరాణి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం శతవార్షికోత్సవాలు జరుపుకుంటోంది. ఈ వందేళ్ళ ప్రస్థానం ప్రపంచవ్యాప్తంగా మహిళల స్థితిగతులలో అనేక కోణాలలో మార్పు వచ్చింది. మార్చి-8 ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛ, సమానత్వం, స్త్రీ విముక్తి కోసం పోరాడే వారికి స్ఫూర్తినిచ్చే రోజు. మార్చి-8కి చారిత్రక ప్రాధాన్యత వుంది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నీడిల్‌ట్రేడ్‌కి చెందిన మహిళా కార్మికులు 1857 మార్చి 8వ తేదీన వేతనాలు, 8గంటల పనికోసం (15గంటలపనినుండి), పని ప్రదేశాలలో సౌకార్యాల కోసం, ఓటుహక్కు కోసం వీరోచిత పోరాటాన్ని నిర్వహించారు. దీర్ఘకాలం సాగిన ఈ పోరాటంలో 13-35 సంవత్సరాల వయస్సు గల యువతులు 146 మంది కాల్పులలో మరణించారు. మహిళల మొక్కవోని పోరాటం ముందు యాజమాన్యం దిగిరాక తప్పలేదు. ప్రపంచంలో దోపిడీ, పీడన, అణచివేతకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు ఈ విజయం స్ఫూర్తినిచ్చింది.

1907లో జర్మనీలోని స్టట్‌గార్డ్‌లో కమ్యూనిస్టు నాయకురాలు క్లారాజెట్కిన్ నాయకత్వాన అంతర్జాతీయ సోషలిస్టు మహిళా సదస్సు జరిగింది. మరల1910లో డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్‌లో సోషలిస్టు మహిళల ప్రతినిధులతో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మార్చి 8వతేదీని మహిళా దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చింది. ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రపంచ వ్యాప్తంగా మహిళా హక్కులకోసం మార్చి 8 సంకేతంగా నిలిచింది.

మాతృస్వామ్య వ్యవస్థలో తప్ప మహిళలకు స్వంత వ్యక్తిత్వం, ఆత్మగౌరవం, ఆస్తిహక్కులు లాంటివి లేవు. బాల్యవివాహాలు, నిర్బంధ వైధవ్యం, సతీసహగమనాలు, బహుభార్యత్వం, అవిద్య, స్వేచ్ఛ లేకపోవటం వంటి అంశాలు మహిళలను అణచివేశాయి. విద్యకు దూరమై ఇంటి నాలుగు గోడల మధ్య బంధీలై మూఢవిశ్వాసాలతోనూ, సాంఘీక దురాచాలతోనూ బానిసల కంటే హీనంగా జీవించారు. 19వ శతాబ్దంలో రాజారామ్మోహన్‌రాయ్, వీరేశలింగం, ఈశ్వరచంద్రవిద్యాసాగర్, జ్యోతిబా పూలే, సావిత్రీబాయ్ పూలే, సరోజినీ నాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ వంటి వారు సంస్కరణ ఉద్యమాలు సాగించారు. సతీసహగమనం, వితంతు పునర్వివాహాలు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, స్త్రీ విద్య కోసం అనేక పోరాటాలు నిర్వహించారు. భారతదేశంలో మహిళా ఉద్యమాలు జాతీయోద్యమం నుండి ప్రారంభమయ్యాయి. స్త్రీ పురుష అసమానతలే కాకుండా మొత్తంగా ఎదురవుతున్న వివక్ష, అణచివేత దోపిడీకి వ్యతిరేకంగా మహిళా ఉద్యమాలు జరిగాయి. స్వాతంత్ర్యానంతరం మహిళలు విద్య, ఉద్యోగాలలో అభివృద్ధి సాధించారు. చట్టపరమైన హక్కులకోసమే కాక ప్రజాస్వామ్య హక్కుల కోసం కూడా మహిళలు వీధుల్లోకొచ్చారు.

ఆంధ్రరాష్ట్రంలో సంఘసంస్కరణ ఉద్యమాల స్ఫూర్తితో డా॥అచ్చమాంబ, మానికొండ సూర్యావతి, వల్లభనేని సీతామహాలక్ష్మి, చండ్ర సావిత్రి, నాగెళ్ళ రాజేశ్వరమ్మ మొదలైన వారి నాయకత్వాన మహిళలు హక్కులకోసం కదిలారు. ఆనాడు మహిళలు పరదాల చాటున బతికేవారు. గడపదాటి బయటికి వచ్చే స్వేచ్ఛ లేదు. స్త్రీలను విద్యా, ఉద్యోగాలకు అనర్హులుగా పరిగణించేవారు. ఇంటిపని, పిల్లల్నికనే యంత్రంలా వుండాలి తప్ప స్త్రీకి ఎలాంటి స్వేచ్ఛా వుండకూడదు. కార్యేషుదాసి, కరణేషుమంత్రి, భోజ్యేషుమాత, శయనేషు రంభా, క్షమయా ధరిత్రి అంటూ స్త్రీలకు కట్టుబాట్లు విధించడం, మనుధర్మ సూత్రాలను స్త్రీలే ఆచరించేటట్లుగా పురుషాధిక్య సమాజం ఆ భావజాలాన్ని మహిళల్లో ప్రచారం చేసింది. ఆనాడు సమాజంలో వున్న కట్టుబాట్లను ధిక్కరించి కమ్యూనిస్టు నేతలు పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావుగారి ప్రోద్భలంతో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని పలు విజయాలు సాధించారు. ఓటుహక్కు మొదలుకొని స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షత, అసమానతలపై మహిళా సంఘాలు సాగించిన నిరంతర పోరాట ఫలితంగానే ప్రభుత్వాలను కదిలించి హక్కులు సాధించుకోగలిగారు.

1971లో ఐక్యరాజ్య సమితి సూచనపై మహిళల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు కమిటీని నియమించింది. ఆ కమిటీ భారతదేశ మహిళల స్థితిగతులపై నివేదిక సమర్పించింది. 1975 అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 1975 నుండి క్రమం తప్పకుండా మార్చి-8 దినోత్సవం ప్రపంచంలో నలువైపులా జరుగుతోంది. ఐద్వాలాంటి సంస్థలు మహిళల హక్కుల దినంగా జరిపితే ప్రభుత్వ సంస్థలు వేడుకగా జరుపుతున్నాయి. బహుళజాతి సంస్థలు తమ లాభాల కోసం మహిళల్ని అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ సాంప్రదాయ కోణం నుండి ప్రచారం చేస్తున్నారు. మహిళా సంఘాలు, ప్రజాతంత్ర వాదులు నిర్వహించిన ఉద్యమాల ఫలితంగా భారత ప్రభుత్వం కొన్ని చట్టాలను, సంక్షేమ పథకాలను రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది.

అందులో బాల్య వివాహ నిరోధక చట్టం(1922), బాలికల వ్యభిచార నిరోధక చట్టం (1956), ప్రత్యేక వివాహాల చట్టం (1955), హిందూవారసత్వ చట్టం(1956), వరకట్న నిషేధ చట్టం (1961), సమాన పనికి సమాన వేతన చట్టం (1976), కుటుంబ కోర్టుల చట్టం (1984), వరకట్న చట్టానికి సవరణల చట్టం (1985), మహిళల అసభ్య చిత్రీకరణ నిరోధక చట్టం (1986), మహిళలకు విద్య, ఉద్యోగాలలో 33% రిజర్వేషన్స్, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్స్(1992), స్త్రీలకు సమాన ఆస్తిహక్కు చట్టం(1986), భ్రూణహత్యల నిరోధకచట్టం (పియన్‌డిటి యాక్ట్1994), ర్యాగింగ్ నిరోధక చట్టం(1997), గృహహింస నిరోధక చట్టం (2005), ఐపిసి 498/ఎ సెక్షన్ మొదలైన చట్టాలను సాధించుకొగలిగాం.

అయితే ఈ అభివృద్ధి నాణేనికి ఒకవైపు మాత్రమే. స్వాతంత్ర్యం సిద్ధించి ఆరు దశాబ్దాలు గడుస్తున్నా కోట్లాదిమంది మహిళలు సమస్యల సుడిగుండంలో దుర్భర దారిద్ర్యంతో మగ్గుతున్నారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఉపాధిలేమి, సామాజిక వివక్షత, అత్యాచారాలు, దిగజారుతున్న విలువలు మహిళల ప్రగతికి ఆటంకంగా వున్నాయి. అత్యాచారాలు, వధువుల సజీవదహనాలు, వరకట్న చావులు, యాసిడ్‌దాడులు, భుక్తికోసం పడుపువృత్తి, అమ్మాయిల అక్రమ అమ్మకాలు లెక్కకు మించి జరుగుతున్నాయి. మధ్య యుగాలనాటి ఫ్యూడల్ ఆచారాలు, అలవాట్లను తిరిగి ప్రవేశపెడ్తూ, మహిళలను మతతత్వంలోకి, బానిసత్వంలోకి నెడుతున్నాయి.1992 నుండి ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల నేపథ్యంలో స్త్రీల పరిస్థితి మరింత దిగజారింది. స్త్రీలను దారిద్ర్యంలోకి నెట్టడంతోపాటు అనేక రూపాలలో ఇంటా బయటా హింసను పెంచుతోంది. ముఖ్యంగా దళిత, ఆదివాసి, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళల పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి.

భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులలోని 14వ అధికరణం ద్వారా మతం, జాతి, కులం, లింగభేదం వంటి కారణాలపై ఏ పౌరుడు, పౌరురాలిపై వివక్ష చూపరాదని పేర్కొంది. అయినా మహిళల పట్ల ఆర్థిక, రాజకీయ, సామాజిక వివక్ష కొనసాగుతోంది. బ్రిటిష్ వలసవాదం పోయినా భారతదేశ బడాబూర్జువాల నాయకత్వాన బూర్జువా, భూస్వామ్య ప్రభుత్వం కొత్త రూపాలలో మహిళలను అణచివేతకు గురిచేస్తోంది. ఫ్యూడల్ వారసత్వంతో వచ్చిన వెనుకబాటుతనం, మూఢాచారాపు అలవాట్లు, మతమౌఢ్యం వారిని మరింత బంధీలుగా చేస్తున్నాయి.

ప్రభుత్వ గణాంకాలే దిగజారుస్తున్న స్త్రీల పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయి.

అదృశ్యమౌతున్న ఆడవాళ్లు

దేశంలో 1000:933 మంది స్త్రీ పురుష నిష్పత్తి వుంది. హరిత విప్లవంతో ఆర్థికాభివృద్ధి సాధించిన పంజాబ్, హర్యానా, ఢిల్లీ, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో 71 జిల్లాలలో 800ల లోపుకు పడిపోయింది. 0-6 సంవత్సరాల వయస్సు బాలికలలో ఈ నిష్పత్తి గత దశాబ్దికాలంలో 945 నుండి 927కి పడిపోయింది. పుత్ర సంతానానికి ప్రాధాన్యతనిస్తున్న సంస్కృతి, అభద్రత, వరకట్నం వంటి వాటి కారణంగా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి ఆడపిండాల్ని తొలగించటమే నిష్పత్తి పడిపోవటానికి కారణమవుతున్నాయి. దేశవ్యాప్తంగా లింగనిర్ధారణ పరీక్షలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నడిపిన ఫలితంగా 1994లో పిఎన్‌డిటి చట్టం వచ్చింది. అయినా ఆడపిండాల అబార్షన్లు తగ్గలేదు. 1991 నుండి 5 కోట్లమంది ఆడపిల్లలు భూమి మీద పడకుండానే అంతర్ధానమయ్యారు(యునిసెఫ్ నివేదిక ప్రకారం).

విద్య - ఉపాధి

మహిళల అభ్యున్నతికి అత్యంత ముఖ్యమైన అంశాలు విద్య, ఉపాధి. ప్రస్తుత సమాజంలో నెలకొన్న ఆర్థిక, సాంఘీక పరిస్థితులలో పేద మహిళలు విద్యకు, ఉపాధి అవకాశాలకు నోచుకోవటం లేదు. మహిళల అక్షరాస్యత శాతం 55.4 శాతం. మైదాన గిరిజన మహిళల్లో 19 శాతం, ఏజెన్సీ గిరిజన మహిళల్లో 9 శాతం, దళితుల్లో 33 శాతం. ప్రతి వందమందిలో 8 మంది మాత్రమే డిగ్రీ చదువులకు వెళుతున్నారు. విద్యారంగం ప్రయివేటీకరణ కావటం వల్ల ముఖ్యంగా మహిళల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాల వల్ల ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. నూటికి 94 శాతం అసంఘటిత రంగంలో దారుణమైన పరిస్థితులలో మహిళలు పనిచేస్తున్నారు. పరిశ్రమల ఆధునీకరణ కారణంగా నైపుణ్యం లేని పని, అతి తక్కువ వేతనం, అమానుష పనిపరిస్థితులు, అభద్రతతో మహిళలు పనిచేయాల్సి వస్తోంది. సమానమైన పనికి సమాన వేతనం, ప్రసూతి సౌకర్యాలు వంటి శాసనాలు అమలు చేయడం లేదు. వ్యవసాయంలో వచ్చిన మార్పుల ఫలితంగా గ్రామీణ మహిళల ఉపాధి తగ్గుతోంది. ఉపాధి హామీ కేంద్రాలలో పేర్లు నమోదు చేయించుకున్న మహిళలు అసంఖ్యాకంగా వున్నారు. సరళీకరణ విధానాల తర్వాత కాంట్రాక్టు సిస్టమ్ పెరిగింది. హోమ్‌బేస్డ్ వర్కర్లు పెరిగారు. సంఘటిత రంగంలో వున్న 2.6కోట్ల మంది ఉద్యోగులలో మహిళలు 6 శాతానికి మించిలేరు. అసంఘటిత రంగంలో పనిచేసే మహిళలకు సంఘటితరంగంలో పనిచేసే మహిళలకు ఉన్నటువంటి సామాజిక, సంక్షేమ పథకాలు (పిఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ) లేవు. శ్రమదోపిడీ విపరీతంగా పెరిగింది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తగ్గటంతో వలసలు అనివార్యమవుతున్నాయి. వలస కార్మికులకు నివాస ప్రాంతాలలోనూ, పనిచేసే చోట తగు రక్షణ, వసతులు లేవు. ఉపాధి భద్రత లేదు. వ్యవసాయ పనులలో 50శాతంపైగా మహిళలు ఉన్నారు. కానీ 9శాతానికి మించి మహిళలకు భూమిపై హక్కు లేదు. నిత్యం పెరుగుతున్న ధరలు, చాలీచాలని వేతనాలతో పౌష్టికాహార లోపంతో 54 శాతం మంది మహిళలు రక్తహీనతతో రోగాల బారిన పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరచి ఎక్సైజ్ ఆదాయాన్ని బంగారు బాతుగుడ్డులా భావిస్తోంది. ఆదాయం కోసం విచ్చల విడి మద్యం అమ్మకాలను పెంచింది. 2010-11 సంవత్సరాలలో 15000 కోట్ల ఆదాయానికి ప్రణాళిక సిద్ధం చేసింది. సంక్షేమ పథకాలకోత, ప్రజలపై పడుతున్న భారాలతో కుటుంబ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. తాగుడు వ్యసనం వలన మహిళలపై హింస పెరగడమే కాక కుటుంబ భారం మహిళలపై పడుతున్నది. దేశంలో మహిళలపై ఆధారపడిన కుటుంబాలు 35శాతం వున్నాయి.

అద్దె తల్లులు

సరళీకరణ విధానాల తర్వాత ప్రపంచం అంతా ఒక కుగ్రామం అని చెపుతున్న నేపథ్యంలో మహిళల పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. పేదరికాన్ని ఆసరాచేసుకొని కొన్ని ఏజెన్సీలు రకరకాలుగా మహిళల జీవితాలతో ఆడుకుంటున్నాయి. గర్భాశయాన్ని అద్దెకు యిచ్చే తల్లులు ప్రవేశించారు. దేశంలో 500మిలియన్ల కోట్లరూపాయల వ్యాపారం సాగుతుంది. కన్సెల్‌టెన్సీలు పెట్టినవారు ఇది మరింత అభివృద్ధి అవుతుందని, లాభసాటి వ్యాపారమని సంబరపడుతున్నారు. డబ్బు కోసం ఆ పేద మహిళ బతుకు జీవన్మరణ సమస్యగా మారుతుందని భావించటం లేదు. నవమాసాలు మోసి బిడ్డను వదిలి వేయాలంటే ఆ తల్లి బాధ వర్ణనాతీతం. ఎలాంటి పరిస్థితులలో అద్దె తల్లిగా మారవల్సి వస్తోందో గమనించటం లేదు. ఉత్తరభారతాన సాగుతున్న అద్దె తల్లుల(సరొగేట్) వ్యాపారం హైదరాబాద్‌కి వచ్చింది. ఇందులో మధ్య దళారీలు మరింత లాభపడుతున్నారు.

నామమాత్రపు ప్రాతినిధ్యం

ఉన్నత పదవులలో వున్న రాష్ట్రపతి, స్పీకరువంటి కొద్ది మంది మహిళలను చూపించి మహిళలు అన్ని రంగాలలోనూ సాధికారత సాధించారని పాలకులు ప్రచారం చేస్తున్నారు. రాజకీయ పార్టీల్లో అంతర్గత వ్యవహారాల్లో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రమే. 1996 నుండి చట్టసభలలో మూడోవంతు మహిళా రిజర్వేషన్స్ బిల్లుకోసం ఆందోళనలు సాగుతున్నాయి. మహిళలకు 1/3వంతు రిజర్వేషన్ బిల్లుకు పాలకులు గ్రహణం పట్టించారు. ఏకాభిప్రాయం లేదనే సాకుతో బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం లేదు. 15వ లోక్‌సభలో మహిళల భాగస్వామ్యం 10శాతానికి మించిలేదు. 544 లోక్‌సభ స్థానాలకు 55మంది మహిళలు ఎన్నికయ్యారు. మన రాష్ట్ర అసెంబ్లీలో 294 స్థానాలకు కేవలం 35మంది మాత్రమే ఎన్నికయ్యారు. లింగ వివక్షతతో కూడిన మన రాజకీయ సంస్కృతిని మహిళలు అవగాహన చేసుకోవాలి.

మార్చి-8 సందర్భంగా మహిళా హక్కుల కోసం ఐక్యంగా పోరాడతామని ప్రతిన పూనుదాం. ఈ శత ఉత్సవాల్లో మన ముందు అనేక సమస్యలు వున్నాయి. మన ఉద్యమం నిస్సందేహంగా విస్తరించింది. కాని ఇది పరిమితులతో కూడి వుంది. మన సామ్యవాద నేతలు శ్రామికవర్గ, ఆర్థిక, సామాజిక దృష్టితో వెనుకబడిన సమాజాన్ని ముందుకు నడిపించడంతో చురుకుగా పనిచేయాలనే వారసత్వాన్ని మనకు అందించారు. సామాజిక మార్పు అనే మౌలిక లక్ష్యంపై నుండి మన దృష్టి చెదరకూడదు. ప్రస్తుతం వున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ సాంస్కృతిక నేపథ్యంలో ముందుకు వస్తున్న భయంకరమైన సమస్యల్ని ఎదుర్కొంటూనే సమాజంలోని అత్యధిక సంఖ్యాక మహిళల్ని ఐక్యం చేయటం మన ప్రాథమిక కర్తవ్యం. పాలకులు పీడిత వర్గం తమకున్న సర్వశక్తులూ, అన్ని మాయలూ ప్రయోగించి మార్చి-8 అసలు లక్ష్యం ఏమిటో మరిచేలా చేయాలని కుట్రలు పన్నుతున్నారు. నిజానికి మహిళలపై ప్రతినిత్యం దాడి జరుగుతున్నది. బహుముఖంగా జరుగుతున్న ఈ దాడులను ఎదుర్కోవడానికి బహుముఖ ఉద్యమాలు నిర్మించడం, వర్గదృష్టిలో దాన్ని అభివృద్ధి చేయటం, మానవజాతి భవిష్యత్తును కాంతివంతం చేయటం నూతన తరాల పట్ల మనకున్న బాధ్యత. ఈ కారణం వల్లే మానవత్వానికి ప్రథమ శత్రువైన సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా మన పోరాటం ఎక్కుపెడదాం. అంతర్జాతీయ శతవార్షికోత్సవాల సందర్భంగా సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానం నశించాలి.

ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి. విధాన నిర్ణయాలలో భాగస్వామ్యం కోసం, మహిళలపై జరుగుతున్న అణచివేత, దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం! ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలను ప్రతిఘటిద్దాం!!

లైంగిక సమానత్వ సాధన కోసం, మానవులందరి విముక్తి కోసం మనం ప్రతినబూనుదాం.

ఫ్యాషన్ పెరేడ్‌లకు, వేడుకలకు మార్చి 8 వేదిక కాకూడదు.

మహిళా హక్కులకోసం గళం విప్పదాం - సాధించుకుందాం!!

★

మహిళాలోకంపైనే
సంక్షోభ భారం

ప్రస్తుతం ప్రపంచ దేశాలను పట్టి పీడిస్తున్న ఆర్థిక, ద్రవ్య సంక్షోభం మహిళలపై సమాజంలో వారి శాతం కంటే ఎక్కువ భారం మోపుతున్నది. పురుషులతో పోల్చితే నిరుద్యోగం పాలౌతున్నది, సామాజికభద్రతా పథకాలలో తక్కువ మొత్తం పొందుతున్నదీ మహిళలే. ఆర్థిక వనరులు కూడా వారికి అందుబాటులో ఉండటం లేదు. బీజింగ్ కార్యాచరణ వేదిక ఏర్పడి పదిహేను సంవత్సరాలు గడిచింది. అది నిర్దేశించిన లక్ష్యాలపై 2000 సంవత్సరంలో జరిగిన ఐదు సంవత్సరాల సమీక్షలో అంతకు ముందు లాటిన్ అమెరికా, దక్షిణాసియా, తూర్పు ఐరోపా దేశాల సంక్షోభంలో కూడా మహిళలే ఎక్కువగా దెబ్బతిన్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు కోత కారణంగా వేతనం లేని పని భారం కూడా వీరిపైనే పడినట్లు తేలింది. సహస్రాబ్ది లక్ష్యాలను చేరుకోవటం అసాధ్యమని వెల్లడైంది. ముఖ్యంగా శిశు మరణాలు, ప్రసూతి మరణాలు తగ్గటం లేదు. మహిళాసాధికారత, లింగసమానత్వం సుదూరంగా ఉంది. ఉపాధి అవకాశాలకు మహిళలు దూరంగా ఉన్నందున ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఏటా 42 నుంచి 47 బిలియన్ డాలర్లు, లింగవివక్ష కారణంగా 16 నుంచి 30 బిలియన్ డాలర్లు నష్టపోతున్నారని అంచనా వేశారు. వర్తమాన సంక్షోభం బీజింగ్ లక్ష్యాలను మరింత వెనక్కు నెట్టింది.



బీజింగ్ కార్యాచరణ వేదిక 15న వార్షికోత్సవం సందర్భంగా మార్చి 1వ తేదీ నుంచి 12వరకు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో న్యూయార్క్ నగరంలో మహిళ ప్రస్తుత స్థితి కారణంగా తలెత్తుతున్న సమస్యల గురించి ఐక్యరాజ్యసమితి కమిషన్ 54వ సమావేశం జరుగుతున్నది. దీనికి పలు ప్రభుత్వాల మంత్రులతో పాటు 2000 మందికి పైగా మహిళా సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారు. ఆర్థిక సంక్షోభం విస్తృతం కావటం, పర్యవసానంగా కొన్ని ప్రాంతాలలో రాజకీయ అస్థిరత తలెత్తటం వలన బీజింగ్ లక్ష్యాలు అనేక దేశాలలో వెనుకపట్టుపట్టాయని ఈ సందర్భంగా సమర్పించిన ముసాయిదా సమీక్షలో వెల్లడైంది. అభివృద్ధి చెందిన, చెందుతున్న, వెనుకబడిన దేశాలు అనే తేడా లేకుండా అన్ని చోట్లా మహిళల ఉపాధిపై తిరోగమన ప్రభావం పడింది. పర్యవసానంగా ప్రమాదకరమైన పని పరిస్థితులుండే ఉద్యోగాలు, రక్షణలేని వృత్తులను ఎంచుకోవటం, తమ కుటుంబాలను ఆదుకొనేందుకు గిట్టుబాటుగాని వేతనాలు, తమకు తగని ఉద్యోగాలను కూడా మహిళలు ఎంచుకోవాల్సి వస్తోంది. కమిషన్ 52వ సమావేశం జరిపిన సమీక్షలో మహిళాసాధికారత, లింగ సమానత్వానికిగాను నిధులు కేటాయించటం ద్వారా ఉత్పాదకత పెరగటంతో పాటు సామర్థ్యం, నిలకడైన ఆర్థికాభివృద్ధి సాధ్యమౌతుందని నిర్ధారణకు వచ్చారు. దారిద్ర్యనిర్మూలన, సహస్రాబ్ది లక్ష్యాలను నెరవేర్చేందుకు మహిళాసాధికారత కీలకాంశమని పేర్కొన్నది. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరింది. దోహా ప్రకటనలో కూడా దేశాధినేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పూర్వరంగంలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఆర్థిక సంక్షోభ పర్యవసానాలను చర్చించాలని దోహా ప్రకటన కోరింది. న్యూయార్క్ సమావేశ ఎజెండా అదే.

ఆర్థిక సంక్షోభాన్ని విధానపరంగా ఎదుర్కొనేందుకు నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సి ఉంది. ఉదాహరణకు ఐరోపా ఆర్థికవ్యవస్థను అదుపు చేస్తున్నవారిలో మహిళలు కేవలం 5శాతం మాత్రమే ఉన్నారు. అన్ని దేశాల రిజర్వుబ్యాంకుల గవర్నర్లుగా పురుషులే ఉన్నారు. ఈ సంస్థల నిర్ణయాలు జరిగే కమిటీలలో మహిళలు 17శాతం ఉన్నారు. ఐరోపా సెంట్రల్ బ్యాంకు పాలకమండలిలో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. న్యూయార్క్ సమావేశంలో వర్తమాన ఆర్థిక సంక్షోభం మహిళలు, బాలికలపై ఎలా పడింది, విధానపరమైన నిర్ణయాలలో ఈ సంక్షోభపూర్వరంగంలో లింగపరంగా ఎలాంటి వైఖరి తీసుకోవాలి, మహిళాసాధికారతకు, లింగపరమైన సమానత్వానికి తగిన వనరులను ఎలా కేటాయించాలి, ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు, ప్రయివేటురంగం, పౌరసమాజం ఎలాంటి పాత్ర వహించాలి, సంక్షోభ సమయాల్లో జీతం భత్యం లేని పనులకు మహిళలు గురికాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలను చర్చించాలని నిర్ణయించారు. ఈ అంశాలకు సంబంధించి కొంతమంది తమ పత్రాలను, అభిప్రాయాలను సమావేశానికి ముందుగానే సమర్పించారు. వాటిపై చర్చ జరగనుంది.

ఉగాండాకు చెందిన ఎలిజబెత్ ఎ ఇలిర్ సమర్పించిన పత్రంలో మహిళాదారిద్ర్యాన్ని గురించి చర్చించారు. ఆమె పత్ర సారాంశం ఇలా ఉంది. ఆర్థిక, ద్రవ్య సంక్షోభం ఆదాయ నష్టాన్నేగాక మానవ హక్కులను కూడా ప్రభావితం చేస్తుంది. ఆఫ్రికా ఖండంలో 1980,90దశకాలలో అమలు జరిపిన సంస్కరణల సంక్షోభం నుంచి తేరుకుంటున్న తరుణంలో వర్తమాన సంక్షోభం తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నది. లింగ సమానత్వం, మహిళాసాధికారతకు ముప్పు తెచ్చింది. అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థికవ్యవస్థ కుంచించుకుపోవటం అంటే మహిళలకు ఉత్పాదకరంగంలో ఉద్యోగాలు తగ్గిపోతాయి. ఆఫ్రికా ఖండంలో 2002 నుంచి ఎగుమతులు 28 బిలియన్ డాలర్ల నుంచి 240 బిలియన్లకు పెరిగాయి. విదేశాల్లో పనిచేస్తున్న కోటి అరవైలక్షల మంది ఆఫ్రికన్లు స్వదేశాలకు పంపిన వార్షిక మొత్తాలు పదిహేను రెట్లు పెరిగాయి. డిసెంబరు నుంచి విదేశీ ఆర్డర్లు తగ్గటంతో ఆఫ్రికా ఎగుమతులు పడిపోవటం ప్రారంభమైంది. ఆసియా నుంచి కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. 2005 జి-7 సమావేశంలో ఆఫ్రికాకు స్నేహ హస్తం అందిస్తామని నాయకులు వాగ్దానం చేశారు. అయితే ఆ తరువాత వారే తమ జనం బాగోగులను చూసుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. వారి పరిస్థితే అలా ఉంటే ఆఫ్రికాలో పెరిగిన చమురు, ఆహార ధరల కారణంగా మాంద్యం ప్రపంచవ్యాపితం

అవుతుందేమో అనిఅనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఆఫ్రికాలో కుటుంబాలను ఆదుకొనేందుకు మహిళలు అసంఘటితరంగంలో అధనపు పనిచేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో అత్యవసర చర్యలు తీసుకోని పక్షంలో సార్వత్రిక ప్రాథమిక విద్య లక్ష్యం నెరవేరదు. ఆరు సంవత్సరాల పాఠశాల విద్య 2015 నాటికి అందరికీ రావాలంటే 2010 నాటికి అందరూ స్కూళ్లలో చేరాలి. అయితే యునెస్కో అంచనా ప్రకారం 2015 నాటికి ఒక్క ఆఫ్రికాలోనే మూడు కోట్ల మంది పిల్లలు స్కూళ్లకు దూరంగా ఉంటారు. ఆర్థిక మాంద్యం ఆహార సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయనుంది. 2005లో దాదాపు ఐదులక్షల మంది మహిళలు ప్రసవ సమయం లేదా ఆరువారాల తరువాత మరణించారు. సబ్‌సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలోనే ఎక్కువ మంది బాధితులున్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో ప్రతి 7,300 మంది మహిళల్లో ఒకరు గర్భిణీగా ఉన్నపుడు సమస్యలు తలెత్తుతుండగా పేద, వర్ధమాన దేశాలలో ప్రతి 22 మందిలో ఒకరికి సమస్య వస్తోంది. ప్రభుత్వాలు మార్కెట్లను క్రమబద్ధీకరించాలి. వారి లాభాలు తప్ప మానవ హక్కుల గురించి పట్టించుకోని ప్రయివేటు రంగ నిర్ణయాలపై మన ఆధారపడకూడదు. మహిళలు, బాలికలు ఇప్పుడు కొత్త కోరికలనేమీ కోరటం లేదు. గతంలో జరిగిన సాధికారత వంటి నిర్ణయాలకు కార్యాచరణ కోరుతున్నారు.

స్త్రీ-పురుషులు, మానవహక్కుల అంశంపై సకీకో ఫుకుడా సమర్పించిన పత్రంలోని అంశాల సారాంశం ఇలా ఉంది. ద్రవ్య సంక్షోభం ప్రపంచ ఆర్థిక మాంద్యానికి దారితీస్తున్న ఈ సమయంలో అభివృద్ధి, దారిద్ర్యనిర్మూలన అంశాలపై రాజీపడినట్లు అంగీకరించటానికి పెద్ద విభేదాలు లేవు. వాషింగ్టన్ మేధావి నాన్సీ బర్డ్‌సాల్ చెప్పిన మాటలు ప్రస్తావనార్హం. 'అభివృద్ధి చెందుతున్న దేశాలలో నివశిస్తున్న ఐదువందల కోట్ల మంది ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి గురైన అమాయక బాధితులు'. ఈ సంక్షోభం ఇలాగే కొనసాగితే 2015 నాటికి ఏటా రెండు నుంచి మూడు లక్షల మందిపిల్లలు అధనంగా మరణిస్తారు. ఐదుకోట్లమందికి పైగా దారిద్ర్యంలో కూరుకుపోతారు. కష్టకాలంలో ఆదుకొనేందుకు ధనిక దేశాలు తమ ఉద్దీపన పథకాల్లో 0.7శాతం లేదా 15 బిలియన్ డాలర్లను కేటాయించాలని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు జోఎలిక్ చెప్పారు. అయితే ఆ మొత్తం లక్షకోట్ల డాలర్లుగా ఉండాలని నాన్సీ చెప్పారు. దక్షిణ కొరియాలో 1998 ఆర్థిక మాంద్యం, అదే ఏడాది జపాన్‌లో కోబ్ భూకంపం, 2005లో అమెరికాలో కత్రినా తుఫాను వంటి ఉదంతాలలో దెబ్బతిన్న పేదలు తిరిగి కోలుకోవటం నత్తనడక నడుస్తున్నది. ఇలాంటి సమయాలలో రక్షణ చర్యలు ఉండాలి. జోసెఫ్ స్టిగ్లిజ్ చెప్పినట్లు



వర్తమాన మాంద్యానికి 'అమెరికా తయారీ' ముద్ర ఉన్నప్పటికీ అది ఇప్పటికే అమెరికా సరిహద్దులను దాటి ప్రభావం చూపుతున్నది. దాన్ని అదుపు చేసేందుకు అంతర్జాతీయ ప్రయత్నాలు జరగాలి. అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా ప్రకారం 2009లో మాంద్యం కారణంగా ఐదుకోట్ల మంది కొత్తగా నిరుద్యోగులయ్యారు. ఉద్యోగులను తొలగించినపుడు అన్ని దేశాలలో ముందుగా బలయ్యేది మహిళలే. షామికా సిరిమానె సమర్పించిన పత్రంలో ఇళ్ల సంక్షోభాన్ని ప్రస్తావించారు. అమెరికాలో 2008 మూడవ త్రైమాసికంలో ప్రారంభమైన గృహరంగ సంక్షోభం ఇప్పటికీ అనేక పర్యవసానాలకు కారణం అవుతున్నది. గతంలో సంభవించిన ఆసియన్ సంక్షోభంలో రెండుకోట్లమంది ఇండోనేషియన్లు, పదకొండు లక్షల మంది థాయ్ పౌరులు దారిద్ర్యరేఖకు దిగువకు చేరారు. ఐదు సంవత్సరాల తరువాత కూడా దాని ప్రభావం ఏదో ఒక రూపంలో ఉంది. ఎనభై దేశాలలో ద్రవ్య సంక్షోభాలను సమీక్షిస్తే నిజవేతనాలు తిరిగి పూర్వపు స్థాయికి రావటానికి మూడుసంవత్సరాలు పట్టింది. అనేక సంవత్సరాలు గడిచినా ఉపాధి పూర్వపు స్థాయికి చేరలేదు. దక్షిణాసియా వ్యవసాయరంగంలో మహిళలు 2007లో 60శాతం ఉన్నారు. వారికి ఎలాంటి బీమా లేదు. ఉపాధి ఏక్షణంలో అయినా పోయే స్థితిలో ఉంటారు. మాంద్యం, సంక్షోభాలు వచ్చినపుడు సులభంగా తొలగించటానికి వీలైన శ్రామికశక్తిగా మహిళలను పరిగణిస్తున్నారు.

-సత్య

కొన్ని గణాంకాలు...

*ప్రతి ఏటా ఐదు లక్షల మంది మహిళలు గర్భ సంబంధమైన సమస్యలతో మరణిస్తున్నారు.

*లక్షమంది యువతులు సురక్షితంగాని అబార్షన్లతో ప్రాణాలు కోల్పోతున్నారు.

*పశ్చిమ ఐరోపాలో ఒక గర్భిణీ స్త్రీ మరణిస్తే ఆఫ్రికాలో 180 మంది చనిపోతున్నారు.

*అమెరికాలో ప్రతి 18 నిమిషాలకు ఒక మహిళ దెబ్బలు తింటున్నది, ప్రతి ఆరునిమిషాలలో ఒకరు అత్యాచారానికి గురవుతున్నారు.

*కార్ల ప్రమాదాలు, అత్యాచారాలు, ఇతర సందర్భాలలో కంటే గృహహింసల వల్ల మహిళలు ఎక్కువగా గాయాల పాలౌతున్నారు.

*ఫ్రాన్స్‌లో జరిగే హింసాకాండలో బాధితులు 95శాతం మంది మహిళలే. వారిలో 51శాతం మంది భర్తల చేతుల్లో దెబ్బలు తింటున్నారు.

*ప్రపంచవ్యాప్తంగా నూటికి 20 నుంచి 50 మంది వరకు వివాహాల సందర్భంగా మహిళలు గృహహింసకు గురవుతున్నారు.

*పుట్టబోయేది ఆడపిల్ల అని తెలుసుకొనేందుకు గాను జన్యుపరమైన లోపాల పేరుతో అనేక దేశాలలో పరీక్షలు చేయిస్తున్నారు.

*ప్రపంచంలో వందకోట్లకు పైగా నిరక్షరాస్యులైన వయోజనుల్లో మూడింట రెండువంతుల మంది మహిళలు. ఎక్కువ మంది గ్రామీణులే.

*పద్దెనిమిది సంవత్సరాల వయస్సు వచ్చే సమయానికి అబ్బాయిల కంటే అమ్మాయిలు సగటున 4.4 సంవత్సరాల విద్యను తక్కువగా పొందుతున్నారు.

*అమెరికాలో దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న మహిళల్లో 71శాతం మంది ఆఫ్రో-అమెరికన్‌లే.

*ప్రపంచంలో తొమ్మిదేళ్ల లోపు వయస్సులో మరణిస్తున్న బాలికల్లో 17.6శాతం మంది శ్వాసతీసుకోవటంలో వస్తున్న జబ్బులే కారణం. అధికాదాయం ఉన్న దేశాలలో 10-19 ఏళ్ల వయసున్న బాలికల మరణాలకు రోడ్డు ప్రమాదాలు 28.9శాతం కారణం.

*ప్రపంచంలో పిల్లలు కనే వయసులో ఉన్న మహిళల్లో మరణాలకు 19.2శాతం ఎయిడ్స్ కారణం.

*ప్రపంచంలో పురుషుల కంటే మహిళల్లో సగటు జీవితకాలం ఎక్కువగా ఉండటానికి కారణం శారీరక, ప్రవర్తనలో ఉన్నతేడాలతో పాటు అనేక దేశాలలో మాతృ సంబంధ మరణాలు తగ్గటం కూడా ఒక ప్రధాన కారణంగా వెల్లడైంది.

*మహిళలకు శారీరకంగా ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నప్పటికీ లింగవివక్ష కారణంగా రోగాల పాలైనపుడు తగిన చికిత్స చేయించని కారణంగా ముందే మరణిస్తున్నారు.

అభద్రత... అరకొర జీతాలు...

మానవ వనరుల అభివృద్ధికి పసిపిల్లలు పట్టుకొమ్మలు. వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. మానవాభివృద్ధి నివేదిక ప్రకారం పిల్లల పోషకాహారలోపంలో మనదేశం, బంగ్లాదేశ్, నేపాల్‌ల సరసన ఉంది. దేశంలోని పిల్లల్లో దాదాపు సగం మంది పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. పిల్లల పోషకాహారలోపానికి ప్రధాన కారణమైన పేదరిక నిర్మూలన జరిగినప్పుడు మాత్రమే దీనిని నివారించగలుగుతాం.

పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు, అనుబంధ పోషకాహారాన్ని అందిస్తూ ఆరోగ్య అవగాహనను కల్పించడంలో ఐసిడిఎస్ పాత్ర ముఖ్యమైనదనే చెప్పాలి. దీన్ని గుర్తించిన సుప్రీంకోర్టు ప్రతీ నివాస ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాక దారిద్ర్యరేఖతో నిమిత్తం లేకుండా 6 సంవత్సరాల పిల్లలందరికీ, గర్భిణీలకు, బాలింతలకు అదనపు పోషకాలను అందించాలని ఆదేశించింది.

యుపిఎ1 ప్రభుత్వం తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో "ఐసిడిఎస్ పథకాన్ని ప్రతి సెటిల్మెంటులోనూ అమలు జరుపుతూ పిల్లలందరూ దానికిందికి వచ్చే విధంగా ఐసిడిఎస్‌ను సార్వత్రీకరిస్తాం" అని చెప్పింది. కానీ నేటికీ ఇది ఆచరణకు నోచుకోలేదు.

ఐసిడిఎస్‌ను సార్వత్రీకరించి అంగన్‌వాడీ సేవలను పటిష్టవంతంగా అమలు చేసేందుకు, అంగన్‌వాడీ ఉద్యోగాలకు మెరుగైన వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు కల్పించేందుకు 2010 - 11 బడ్జెట్‌లో కనీసం 15000 కోట్ల రూపాయలు కేటాయించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ కోరుతున్నది.

కానీ నిత్యం మహిళా సాధికారత గురించి, సంక్షేమం గురించి గప్పాలు కొడుతున్న మన పాలకులు వీటిని పరిగణనలోకి తీసుకోవడంలేదు. పిల్లలు, మహిళల సంక్షేమం పట్ల ఏమాత్రమూ చిత్తశుద్ధి కనబరచడం లేదు. ఈ బడ్జెట్‌లో ఐసిడిఎస్ కోసం నామమాత్రపు నిధులు కేటాయించారు. ఈ అరకొర నిధులతో ఐసిడిఎస్ సార్వత్రీకరణ ఎలా సాధ్యం? పైగా ఐసిడిఎస్ సంస్కరణ 4వ ప్రాజెక్టు పేరిట "మార్పు చేసిన జాతీయ చట్రం" (రివైజ్డ్ నేషనల్ ఇంప్లిమెంటేషన్ ఫ్రేమ్‌వర్క్) ద్వారా ప్రపంచ బ్యాంకు చేసిన మార్గదర్శకాల అమలుకు పూనుకున్నది.

వికేంద్రీకరణ పేరుతోనూ, ప్రజల భాగస్వామ్యం పేరుతోనూ ఐసిడిఎస్‌ను ప్రయివేటీకరించేందుకు పూనుకున్నది. ప్రభుత్వ సరళీకృత విధానాల కారణంగా ఇప్పటికే ఐసిడిఎస్ సేవలు బలహీనపడుతున్నాయి. ఈ కొద్దిపాటి సేవలు కూడా పేదలకు అందకుండా చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు స్థానిక ప్రజలతో దగ్గరి సంబంధాలుండడం వల్ల వీరితో అనేక అదనపు పనులు చేయించుకుంటున్నారు. రేషన్ కార్డుల సర్వే, ఓటరు ఫొటో గుర్తింపు కార్డు మొదలు కుటుంబ నియంత్రణ వంటి పనుల్లో కూడా వీరిని ఉపయోగిస్తున్నారు. గత సంవత్సరం ఏలూరు పట్టణ మున్సిపల్ కమిషనర్ అంగన్‌వాడీ ఉద్యోగులతో చెత్త సేకరణ, గ్రేడింగ్ పనికూడా చేయించేందుకు పూనుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. ఇది అంగన్‌వాడీ కేంద్రాల్లో పనికి ఆటంకంగా మారుతున్నది. వర్కర్లు, హెల్పర్లపై పని భారం కూడా పెంచింది.



ఐసిడిఎస్ ద్వారా జరిగే ఇతర సేవలు, ప్రజల ఆరోగ్య అవసరాలు కొంతమేరకైనా తీరుతున్నప్పటికీ ప్రభుత్వ విధానాల కారణంగా ప్రాథమిక సౌకర్యాలు కొరవడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక సౌకర్యాలు, ఆటబొమ్మలు వంటివి కల్పించేందుకు ప్రభుత్వం శ్రద్ధ చూపడంలేదు.

పరిస్థితులు ఇలా ఉంటే పులిమీద పుట్రలా మన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పంచాయతీలకు అప్పజెప్పి చేతులు దులుపుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం జీవో నెం 41ను జారీ చేసి స్త్రీ శిశు సంక్షేమ శాఖ నిర్వహణ నుండి వైదొలగేందుకు సిద్ధమైంది. అంగన్‌వాడీ ఉద్యోగుల విధి నిర్వహణలో రాజకీయ జోక్యాన్ని, గ్రామ సమాఖ్యల జోక్యాన్ని కల్పిస్తూ జీవో 42ను జారీ చేసింది.

ఉద్యోగభద్రత లేక, నిత్యం రాజకీయ వేధింపులతో, అరకొర జీతాలతో అది కూడా సకాలంలో అందక బాధపడుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులకు ఈ జీవో మరింత ముప్పుతెచ్చింది. ఉన్న కొద్దిపాటి ఉపాధి కూడా ఉంటుందో ఊడుతుందో తెలియని స్థితి ఏర్పడింది. వీటికి తోడు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో స్వచ్ఛంద సంస్థలు/ఐపికె/ఇతర ప్రయివేటు సంస్థల ద్వారా పోటీ సెంటర్లు పెట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లల సంఖ్య తగ్గిపోతున్నది. దీనిని సాకుగా చూపి అంగన్‌వాడీ ఉద్యోగులను తొలగించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తమ హక్కుల రక్షణకు, సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడడం తప్ప మరో మార్గం లేదని అంగన్‌వాడీ ఉద్యోగులు భావించారు.

కనీసవేతనాలు, రిటైర్‌మెంటు బెనిఫిట్స్, ఐసిడిఎస్ సార్వత్రీకరణ వంటి డిమాండ్లుతో పాటు జీవో 41, 42లను పూర్తిగా రద్దు చేయాలని, ప్రయివేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు అరికట్టాలని పెద్దఎత్తున ఉద్యమించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఫిబ్రవరి 19న కలెక్టరేట్‌లను ముట్టడించాడు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌లను స్థంభింపచేశారు. ఈ సందర్భంగా అధికారయంత్రాంగం కదిలివచ్చింది. జిల్లాల్లో తమ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు అంగీకరించారు. ప్రధాన సమస్యలను పరిష్కరించేంతవరకు పోరాటం సాగిస్తారు.

- పి.రోజా

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

మేం మైనారిటీలం...

పితృస్వామిక సమాజంలో మహిళలు సమస్యల వలయంలోనే బతుకీడుస్తున్నారు. ముస్లిం మైనారిటీలలో ఈ సమస్యలు మరీ అధికం. మతాచారం ప్రకారం మహిళలను ఇంటికే పరిమితం చేయడం వల్ల ఎన్నో అవకాశాలను వారు అందిపుచ్చుకోలేకపోతున్నారు. గోషా, పర్దా పేరుతో మహిళలను ఆధునిక సమాజానికి దూరంగా ఉంచుతున్నారు. ఫలితంగా వారు విద్య, ఉపాధి అవకాశాల్లో వెనుకబడుతున్నారు. దేశంలో ముస్లింలకు అవకాశాలు పరిమితంగా ఉన్నాయి. ఆ అరకొర అవకాశాలు కూడా మహిళలకు అందని స్థితి. సమాజ వివక్షకు తోడు ముస్లింలలో మహిళలపై ఉన్న నిబంధనలు కూడా అందుకు కారణం.

అభివృద్ధికి తొలి మెట్టు అయిన విద్యలోనూ ముస్లిం మహిళలకు అన్యాయమే జరుగుతోంది. సాధారణ విద్యకు వారిని దూరం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో వారి హాజరు అత్యల్పం. ముస్లిం మహిళలకు ఉర్దూ, అరబ్బీ చదువులు చెప్పించడానికే వారి తల్లిదండ్రులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. అరకొర ఆదాయం ఉన్నవారు బాలురను ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చేర్పించి బాలికలను మదరసాల్లో చేరుస్తున్నారు. మరికొంత మంది తమ పరిసర ప్రాంతాల్లో గల పాఠశాలల్లో 7, 10వ తరగతి వరకు చదివిస్తున్నారు. పై చదువులకు దూరం వెళ్లాల్సి వస్తే మాత్రం అభద్రత పేరుతో బాలికలను పంపించడం లేదు. పాఠశాలకు ముస్లిం బాలికలు బుర్ఖాతో రావడాన్ని అనుమతించని కొన్ని పాఠశాలలు కూడా వారిని తీసుకోవడానికి అంతగా ఇష్టపడటం లేదు. ఉర్దూ మీడియం పాఠశాలలు తక్కువగా ఉండటంతో బాలికలను ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు కాకుండా మదరసాలకు పంపిస్తున్నారు. దీంతో ఇతర మహిళలతో పోలిస్తే ముస్లిం మహిళల్లో విద్యావంతుల సంఖ్య చాలా తక్కువ. పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీల్లో 19 శాతం మంది ముస్లిం మహిళలు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు.

ఇంట్లోనే ఉపాధి

ముస్లిం మహిళలు ఎక్కువగా ఇంట్లో ఉండి చేసే కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ, జరీవర్క్, చికన్ వర్క్, రెడిమేడ్ గార్మెంట్స్, అగర్‌బత్తీ రోలింగ్, బీడీ రోలింగ్ వంటి పనులు చేస్తున్నారు. స్త్రీలను బయటికి పంపించి ఉద్యోగాలు చేయించడానికి పురుషులు ఇష్టపడటం లేదు. ఇందులో తక్కువ ఆదాయం వచ్చినా సర్దుకుంటున్నారే తప్ప భద్రత పేరుతో ఎక్కువ ఆదాయం వచ్చే ఉద్యోగాల కోసం బయటికి పంపించడానికి వారు ఇష్టపడటం లేదు. మహిళలు చేసే పనులు ఎక్కువగా సబ్ కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉండటంతో ఆదాయం కూడా తక్కువగా వస్తోంది. తాము చేస్తున్న పని యజమాని ఎవరో తెలియకపోవడంతో ఆదాయం విషయంలో పోరాడే అవకాశమూ ఉండడం లేదు. ఇటీవల కాలంలో ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ వల్ల కుటీర పరిశ్రమలు కుంటుపడటంతో వారి జీవనోపాధి కూడా కరువైంది. ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే స్థితిలో ఉండే పురుషులు తమ మహిళలతో పని చేయించడానికి ఇష్టపడటం లేదు. స్కూల్ యూనిఫారంలు వంటి దుస్తుల తయారీల్లో ప్రభుత్వం ముస్లిం మహిళలకు డైరెక్ట్‌గా కాంట్రాక్ట్‌లు ఇస్తే ఆర్థికంగా నిలదొక్కుకునే వీలుంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి అమలు చేస్తున్న జవహర్ రోజ్‌గార్ యోజన కింద లోన్లు, ఇళ్లు, వితంతు పెన్షన్లు కూడా వారికి సరైన రీతిలో అందడం లేదు. ఉన్నత వర్గాల్లోని హిందూ మహిళల కంటే కూడా ముస్లిం మహిళల్లో ఉద్యోగం చేస్తున్న వారి సంఖ్య అత్యల్పం. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లో, వాటర్‌షెడ్ ప్రోగ్రాముల్లో, పంచాయతీ రాజ్ స్కీముల్లో ముస్లిం మహిళల సంఖ్య అత్యల్పం. వీటిలో వారి భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరముంది.

ఆరోగ్యం

ముస్లిం మహిళల ఆరోగ్యం వారి ఆర్థిక స్థితితో నేరుగా ముడిపడి ఉంది. పేదరికంతో మురికివాడల్లో ఎక్కువగా నివసించే మహిళలకు శుద్ధమైన తాగునీరు, పారిశుధ్యం అందని ద్రాక్షే. ఇతర మహిళల కంటే ముస్లిం మహిళల ఆరోగ్యం క్షీణించి ఉండటానికి ప్రధాన కారణం ఆరోగ్యం పట్ల వారికి సరైన అవగాహన లేకపోవడం, ఒత్తిడి ఎక్కువవడం కూడా. ప్రభుత్వ ఆరోగ్య శిబిరాలకు వారు అరుదుగా వెళ్తుంటారు. తమ కమ్యూనిటీకి సంబంధించిన ఆరోగ్య కేంద్రాలనే ఆశ్రయిస్తుండటంతో వారికి సరైన చికిత్స లభించడం లేదు. ప్రభుత్వం ప్రచారం చేస్తున్న కుటుంబ నియంత్రణ, ఆరోగ్య సూత్రాలు ముస్లిం మహిళలకు చేరడం లేదు.

ప్రత్యేక సమస్యలు

విడాకుల విషయంలోనూ షరియత్ మహిళలకు అన్యాయమే చేసింది. మహిళలు అత్యవసరమైతే తప్ప 'ఖులా' (భర్తకు భార్య ఇచ్చే విడాకులు) ఇవ్వరాదని, దానికి సంబంధించి చాలా కఠిన నిబంధనలను పెట్టింది. తలాక్ (భార్యకు భర్త ఇచ్చే విడాకులు) విషయంలో నిబంధనలు అంత కఠినంగా లేవు. మహిళలకు వైవాహిక రక్షణ కల్పిస్తున్నామని ముస్లిం పర్సనల్ లా బోర్డు చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం అది కనిపించడం లేదు. బహుభార్యత్వం ముస్లిం మహిళలకు మాత్రమే ఉన్న ప్రత్యేక శాపం. భార్యలందర్నీ, వారి పిల్లలను పోషించే సత్తా ఉంటే బహుభార్యత్వం కూడా తప్పుకాదని షరియత్ చెప్పడం మహిళలకు కొరుకుడుపడని విషయాన్ని బలవంతంగా అంగీకరింపజేయడమే. అయితే మహిళలు అంగీకరిస్తేనే రెండో పెళ్లి చేసుకోవాలని ఇటీవల నిబంధనలను సవరించడంతో కొంత ఊరట కలిగింది. కానీ ఇది అమలుకు మాత్రం అంతగా నోచుకోవడం లేదు. 'గోషా' పేరుతో ముస్లిం మహిళలను నాలుగు గోడల మధ్య (ఇంటికే) పరిమితం చేయడం సాధారణ విషయంగా మారింది. దీంతో వీరికి సామాజిక స్పృహ తగ్గి, వారి అభివృద్ధి మందగించింది. ఇంట్లోనే, ముస్లిం సముదాయంలోనే మహిళలకు భద్రత ఉంటుందని వారిని బావిలో కప్పలుగా మారుస్తున్నారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ముస్లిం మహిళల దీనస్థితికి అంతమే లేదు. దీంతో ఇటు సామాజిక పరంగానూ, అటు కుటుంబ పరంగానూ వారు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారిని జాగృతం చేసేపనిని విద్యావంతులైన ముస్లిం మహిళలు చేయాలి. విద్య, ఉపాధి రంగాల్లో మెరుగైన స్థాయిలో ఉన్న ముస్లిం మహిళలు వెనుకబడిన వారి అభివృద్ధి కోసం కొంతైనా సమయం కేటాయించాలి. అప్పుడే వారిలో మార్పు సాధ్యమవుతుంది.

- సుమేరా ఫిర్దోస్

మార్చి 8 శత వార్షికోత్సవం
సోషలిస్టు మూలాలు

వందేళ్ల కిందట అంటే 1910లో అంతర్జాతీయ సోషలిస్టు సంస్థ మహిళా మహాసభ కోపెన్‌హాగెన్‌లో జరిగింది. 1910 ఆగష్టు 27న విప్లవ నేత క్లారా జట్కిన్ తన సహచరిణులైన అలెగ్జాండర్ కొల్లంతాయ్ తదితరులతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలంటూ ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. "వర్గ చైతన్య పూరితులైన, రాజకీయ సంస్థలలోనూ కార్మిక సంఘాలలోనూ సమీకృతులైన వివిధ దేశాల కార్మికులతో కలిసి అన్ని దేశాల సోషలిస్టు మహిళలు ప్రతి ఏటా ఒక రోజును మహిళా దినోత్సవంగా జరుపుతారు. ప్రధానంగా మహిళలకు ఓటింగు హక్కు సాధించడం దీని ప్రధాన లక్ష్యం. మహిళా సమస్యపై మొత్తం సోషలిస్టు సూత్రాల స్ఫూర్తితో సమ్మిళితమయ్యేలా ఈ దినోత్సవాన్ని నిర్వహించవలసివుంటుంది. ఈ మహిళా దినోత్సవానికి అంతర్జాతీయ స్వభావం వుండాలి. చాలా శ్రద్ధాసక్తులతో దానికి సన్నద్ధం కావాలి" అని వారు ప్రవేశపెట్టిన చారిత్రాత్మక తీర్మానం పేర్కొన్నది. మహిళల ఓటుహక్కు సోషలిజం కోసం మనం చేసే పోరాటానికి శక్తి సమకూరుస్తుంది అని నినాదం ఆమోదించారు. అయితే ఆ మేరకు నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇదమిద్ధంగా ఫలానా తేదీ అని మాత్రం అనుకోలేదు. 17 దేశాల నుంచి వచ్చిన మహిళా ప్రతినిధుల సమావేశంలో ఆ తీర్మానాన్ని ఏకగ్రీంగా ఆమోదించారు. వారిలో కార్మిక సంఘాల నుంచి, సోషలిస్టు పార్టీల నుంచి, శ్రామిక మహిళా క్లబ్బుల నుంచి వచ్చిన మహిళా ప్రతినిధులే గాక తొలిసారి ఫిన్లండు పార్లమెంటుకు ఎన్నికైన ముగ్గురు మహిళా సభ్యులు కూడా ఆ సమావేశంలో పాల్గొన్నారు.

-బృందాకరత్
ఐద్వా ఉపాధ్యక్షురాలు

కోపెన్‌హగెన్ ఇచ్చిన పిలుపునకు ప్రతిస్పందనగా 1911లో పదిలక్షల మందికి పైగా స్త్రీ పురుషులు ప్రదర్శనలు జరిపారు. జర్మనీ, ఆస్ట్రియా, డెన్మార్క్, స్విడ్జర్లాండ్, తదితర యూరోపియన్ దేశాలలో మహిళా దినోత్సవం పాటించబడింది. 1848లో ప్రష్యన్ రాజుకు వ్యతిరేకంగా జరిగిన విప్లవ గౌరవార్థం మొదట మార్చి 19వ తేదీని ఎంపిక చేశారు. ఆ సందర్భంగా అన్ని అంచనాలకు మించి ప్రదర్శనలు జరిగాయని అలెగ్జాండ్రా కొల్లంతాయ్ రాసింది. ఆమె తర్వాత బోల్షివిక్ పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికైన తొలి మహిళ అయ్యారు. చిన్న చిన్న పట్టణాలు గ్రామాల్లో కూడా సభామందిరాలు మహిళలతో కిక్కిరిసి పోయాయని, పురుష కార్మికులు పక్కకు తప్పుకుని స్త్రీలకు చోటివ్వవలసిందిగా వత్తిడి వచ్చిందని ఆమె రాశారు. ఆ సందర్భంగా 30వేల మందికి పైగా పాల్గొన్న అతి పెద్ద ప్రదర్శనపై పోలీసుల దౌర్జన్యం రక్తపాతానికి దారి తీసింది. సోషలిస్టు ప్రజా ప్రతినిధుల జోక్యం వల్లనే అది సద్దుమణిగింది అని కూడా కొల్లంతాయ్ రాశారు. రష్యాలో అమలులో వున్న ప్రత్యేక క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరి ఆఖరు ఆదివారంనాడు మహిళలు ఆ దినోత్సవం జరిపారు. అమెరికాలోనైతే అంతకు ముందుగానే 1908లోనే జాతీయ మహిళా దినోత్సవం జరిపి ఓటు హక్కు, ఆర్థిక హక్కులు కోరారు. అప్పటికే సమరశీల పోరాటాలు చేస్తున్న దర్జీ మహిళల కోర్కెలను కూడా దాంట్లో మిళితం చేశారు. దేశాల సరిహద్దులకు అతీతంగా మహిళలు యుద్ధం వద్దని శాంతి నినాదాలు వినిపించారు. 1913లో అంతర్జాతీయ మహిళా దినం మార్చి 8న జరపాలని నిర్ణయమైంది.

అయితే ఆ మరుసటి ఏడాదే ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లింది. 1915-16 సంవత్సరాల్లో కూడా దాన్ని నిర్వహించేందుకు ప్రయత్నం జరిగినా యుద్ధోన్మాదులు శాంతి ప్రదర్శనలను అనుమతించే స్థితి లేకుండా పోయింది. నార్వేలో మాత్రమే కొంతమంది మహిళా ప్రతినిధులు ధైర్యంగా సమావేశమై ఒక తీర్మానం ఆమోదించారు. ఆ తర్వాత వచ్చింది ప్రపంచ చరిత్రనే మార్చిన రష్యా అక్టోబర్ విప్లవ సంవత్సరం 1917. జారు చక్రవర్తికి వ్యతిరేకంగా ప్రజా వెల్లువ మొదట మహిళా ప్రదర్శనలతోనే ప్రారంభమైంది. శ్రామిక మహిళలు, సైనికులు, కార్మికుల భార్యలు, తిండి లేని నిర్భాగ్య స్త్రీలు మార్చి 8 మహిళా దినోత్సవ ప్రదర్శన జరిపి శాంతి కోసం నినదించారు. ఆ ప్రదర్శనలతోనే సంచలనాత్మకమైన విప్లవకర ఘటనలకు నాంది పలికినట్టయింది. ప్రపంచంలో తొలి సోషలిస్టు రాజ్యానికి అంకురార్పణ జరిగింది. వాస్తవానికి కారల్ మార్క్సు 1868లో చేసిన వ్యాఖ్యలలోనే ఈ స్ఫూర్తి తొణకిసలాడుతుంది. చరిత్ర ఏ మాత్రం తెలిసిన వారెవరైనాసరే మహిళల ప్రజ్వలన లేకుండా సోషలిస్టు మహా విప్లవాలు సాధ్యం కావని తెలుసుకోగలుగుతారని ఆయన ఆనాడే రాసిన దాన్ని రష్యన్ మహిళలు నిజం చేసి చూపారు. అందుకు తగినట్టే మొదటి సోషలిస్టు దేశం మార్చి 8న మహిళా దినోత్సవ సందర్భంగా సెలవుగా ప్రకటించింది. చైనాలోనూ ఆ ఏడాది దాన్ని జరిపారు. భారత దేశం విషయానికొస్తే 1931లో లాహోర్‌లో ఆసియా మహిళల సమానత్వ మహాసభ సందర్భంలో తొలిసారిగా నిర్వహించారు. మహిళల సమానత్వాన్ని, దేశాల సమానత్వాన్ని సంధానం చేస్తూ ఒక తీర్మానం ఆమోదించారు.

వామపక్ష మహిళా సంఘాలు సోషలిస్టు దేశాలలోని తమ మహిళలతో సహా కలసి మార్చి 8న మహిళా దినోత్సవం జరిపే సంప్రదాయం కొనసాగించాయి. అయితే 1960ల తర్వాత అమెరికాలోనూ ఐరోపాలో హెచ్చు భాగంలోనూ 'ఫెమినిజం వెల్లువ' తాకింది. అప్పటి నుంచి మహిళా దినోత్సవ నిర్వహణ అంతకంతకూ పెరిగింది. చివరకు 1975లో ఐక్యరాజ్యసమితి ఒక తీర్మానం ఆమోదించింది. అంతర్జాతీయ ప్రజాతంత్ర మహిళా సంఘం (డబ్ల్యుఐడిఎఫ్) అధ్యక్షురాలి సూచన మేరకు చేసిన ఈ తీర్మానం మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినంగా ప్రకటించింది. దేశ దేశాలలో దాన్ని పాటించడం పెరిగింది. ఒక విధంగా ఇది సంతోషించే విషయమైనా మరోవైపున మార్చి 8 సోషలిస్టు మూలాలను నీరు గార్చడానికి కూడా అవకాశం ఏర్పడింది. దాన్ని సమరశీల పోరాట మహిళలకు ప్రతీకగా దోపిడీపై పోరాటానికి సాధనంగా కనిపించకుండా చేసే పరిస్థితి కూడా తలెత్తడానికి ఇది కారణమైంది. కనుక మార్చి 8 అసలైన మూలాలను నొక్కి చెప్పి దాన్ని మార్కెట్ వేడుకగా అలంకార ప్రాయమైన మహిళా సంబరంగా మార్చే పోకడలను నిలవరించవలసిన అవసరమూ కలుగుతున్నది.

రెండు అంశాలు

మార్చి 8 ప్రాధాన్యతకు సంబంధించి మనం రెండు అంశాలను గమనించవలసి వుంది. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడటానికి, సోషలిస్టు ప్రత్యామ్నాయ సాధనకు మహిళలను సన్నద్ధం చేయడం ఒకటి. మహిళలను ప్రత్యేకించి శ్రామికవర్గ మహిళలను సంఘటిత పర్చడం అవసరమన్న అవగాహన త్వరితంగా గుర్తించడం ఒకటి. విమోచన పోరాటంలో మహిళల ఉద్యమాలు పెంపొందించేందుకు శ్రామిక మహిళలు పోషించవలసిన కీలక పాత్ర గురించి గుర్తింపు పెరగడానికి ఐరోపాలోనూ, రష్యా అమెరికాలలోనూ జరిగిన వారి పోరాటాలు కారణభూతమైనాయి. అత్యంత అధ్వాన్నమైన పరిస్థితులలో ఆధునిక పరిశ్రమలలో ప్రవేశించిన మహిళలు, బాల శ్రామికులు అసాధారణ లాభాలకు వనరుగా మారారు. మార్క్సు పెట్టుబడిలో ఈ విషయమే రాశారు. దోపిడికీ వ్యతిరేకంగా జరిగే పోరాటంలో మహిళలను సమీకరించడానికి సోషలిస్టు మహిళా కార్యకర్తలు ప్రతిచోటా ముందునిలిచారు. మార్క్సు ఎంగెల్సుల నాయకత్వాన వున్న మొదటి అంతర్జాతీయ కార్మిక సంస్థ స్త్రీ, బాల కార్మికుల హక్కులతో సహా అందరి కోసం పోరాడాలని తన శాఖలకు ప్రత్యేకంగా పిలుపునిచ్చింది. ఆ సమాచారం సేకరించేందుకు ప్రశ్నావళి కూడా పంపించారు. ఎనిమిది గంటల పని, బానిస పరిస్థితుల మార్పు వంటి అంశాలు ఆ కోర్కెల పత్రంలో వుండేవి. మార్క్సు కుమార్తె ఎలినార్ తూర్పు లండన్‌లో శ్రామిక మహిళలను సంఘటిత

పాలుపంచుకున్నారు. వీరిలో గుండాల కేంద్రంలో కోయలను ఉత్తేజపరిచి తానూ బందూకు పట్టిన మల్లు స్వరాజ్యం నేటికీ మహిళా ఉద్యమంలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ పోరాటం మహిళల్లో దాగిన అన్ని రకాల శక్తులనూ లోకానికి తెలియజెప్పింది. సమాజ విముక్తి కోసం సాగే పోరాటంలో మహిళలూ చరిత్ర సృష్టించగలరనేందుకు తెలంగాణా పోరాటం ఒక సజీవ సెల్యులాయిడ్. ఎందరో, ఎందరెందరో, కొన్ని పేర్లు తెలిసీ, మరికొన్ని సంఖ్యల్లో ఒదిగి కన్నీటిచారికల్లోనూ కర్తవ్యాన్ని విస్మరించని వారి త్యాగం అనుసరణీయం...ఆదర్శం.

భూపోరాటం ఒక భూకంపం

జానెడు జాగాకోసం నినదించి కదిలిన పేదలపై ప్రభుత్వ దమనకాండకు తార్కాణంగా సాగిన మహోద్యమమిది. భూస్వామ్య వర్గాలతోనూ, నయా కార్పొరేట్ జమీందారులతోనూ పెనవేసుకుపోయిన ప్రభుత్వాధినేతల వర్గ స్వభావాన్ని ఎండగట్టిన వర్గ సమరమిది. 2004 ఎన్నికలకు ముందు ఇళ్లస్థలాలిస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ మాట తప్పింది. 2005 జులైలో పలు ప్రజాసంఘాల కార్యకర్తల నిరవధిక దీక్షలనంతరం సమస్యను పరిష్కరిస్తానంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రాతపూర్వకంగా హామీనిచ్చింది. మళ్లీ మాట తప్పింది. నిలదీసిన పేదలు తమంతటతామే ప్రభుత్వ భూములు ఆక్రమించి హద్దులు వేసుకున్నారు. ఈ స్థలాలకు రేయీపగలూ మహిళలు కాపలా కాశారు. ఇక్కడ, అక్కడ అని కాకుండా పోలీసులు అన్నిచోట్లా మహిళల జుట్లు పట్టి లాగారు. అయినా మహిళలు ఆ జాగాను వీడకపోతే అరెస్టు చేసి జైళ్లలో కుక్కారు. కొన్నిచోట్ల మంగళసూత్రాలూ తెంపితే మానవ హక్కుల కమిషన్ వరకూ ఫిర్యాదులెళ్లాయి. ఈ ఉద్యమానికి పరాకాష్టగా ఖమ్మం జిల్లా ముదిగొండ ఘాతుకం నిలుస్తుంది. మీ అన్నను, తమ్ముణ్ణి అంటూ మురిపిస్తే నమ్మి గెలిపించిన మహిళలపైనే నరమేధాలు సాగించి నెత్తురుటేరులు పారించే పాలకుల పైశాచికతను బయటపెట్టిన ఈ ఘోరకలిలో ప్రాణాలు కోల్పోయిన ఏడుగురిలో కత్తుల పెద్దలక్ష్మి కూడా ఉన్నారు. 60 గజాల స్థలం అడిగినవారిపై బనాయించిన కబ్జా కేసుల్లో మహిళలు వాయిదాలకు తిరిగి తిరిగి అలిసిపోయారు. ప్రజాకంటక పాలకుల విధానాలను వ్యతిరేకించిన మహిళా సంఘం నాయకురాలు పుణ్యవతి తలను పోలీసులు పగలగొడితే అప్పటి పాలకులను తెగనాడిన కాంగ్రెస్ నాయకులు నిర్విరామంగా సాగిన భూ పోరాటంలో ఎందరో పుణ్యవతుల తలలు పగలగొట్టి కితాబులిచ్చుకున్నారు. ఈనాటికీ ఇళ్ల స్థలాలకోసం, పంట భూములకోసం ఆందోళనలు సాగుతూనే ఉన్నాయి.

శ్రమకు తగ్గ వేతనం కోసం

2001 లెక్కల ప్రకారం రాష్ట్రంలో 74 లక్షల మంది మహిళా కార్మికులున్నారు. వీరికి సమాన వేతనం లేదు. యాంత్రీకరణ ప్రభావంతో వ్యవసాయంలో పని దినాలు తగ్గుతున్నాయి. మరోవైపు ఆదాయాలకూ ఖర్చులకూ పొంతన లేకుండా పోతోంది. శ్రమకు తగ్గ వేతనం కోసం శతాబ్దాలుగా పోరాటాలు సాగుతున్నాయ్. మహత్తర తెలంగాణా పోరాటంలోనూ కూలి రేట్ల పెంపుదల ఆందోళనలు మిళితమై ఉన్నాయి. రోజుకు కూలి నాలుగు శేర్లకు పెంచాలని కొండపల్లిలోనూ, బీడీ ఆకు కోతకు కూలి పెంచాలని పిండిప్రోలు, ఇల్లెందు తదితర 90 గ్రామాలలోనూ జరిగిన పోరాటాలకు స్త్రీలు నాయకత్వం వహించారు. ఈ ఆందోళనల కొనసాగింపులో భాగంగా 1997-98 సంవత్సరాలలో కూలి రేట్ల ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా జరిగింది. ఈ సందర్భంగా భూస్వాముల నుండి ఎదురైన బెదిరింపులకు జడవకుండా నిలబడిన మహిళలు ఊరూరికీ ఉన్నారనడం అతిశయోక్తి కాదు. ఈ కాలంలో మొత్తంగా 1300కుపైగా గ్రామాలలో కూలి రేట్లు పెంచుకోగలిగారు. ఈ సమయంలో భూస్వాముల పక్షం వహించిన ప్రభుత్వ యంత్రాంగం పెట్టిన తిప్పలను తట్టుకునే క్రమంలో పలు గ్రామాలలోని మహిళలు ధైర్య సాహసాలు ప్రదర్శించారు. ఇప్పటికీ ఇది కొనసాగుతూనే ఉంది. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా అమలాపురం, ఖమ్మం జిల్లాలోనూ కూలి పోరాటాలలో మహిళలు ముందు పీఠిన ఉన్నారు.

'ఉపాధి' భద్రత కోసం..

వామపక్షాల ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం అనివార్యంగా తెచ్చిన ఉపాధి హామీలో మన రాష్ట్రంలో పనిచేస్తున్న కూలీలలో 54 శాతం మహిళలున్నారు. ఈ పథకం అమలులో దొర్లిన అనేక లోపాలపై మహిళలు నిలదీస్తున్న తీరు వారి చైతన్యానికి ప్రతీక. ఈనాటి వ్యవసాయమంత్రి రఘువీరారెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మడకశిరలో చట్టాలు తెలీక కూలి చెల్లింపులో మోసపోయిన మహిళలు అధికారులను నిలదీసి మరీ సాధించుకున్నారు. తమకెందుకు పనులు చూపరో చెప్పాలంటూ కూడేరులో మహిళలు పెద్ద ఆందోళనే చేస్తున్నారు. కోర్టునూ ఆశ్రయించారు. ప్రస్తుతం అధికారులెవ్వరినీ గ్రామ పొలిమేరల్లోకి కూడా రానివ్వడం లేదు. కడపజిల్లా రంగసముద్రంలో అధికార కాంగీయులు చెరువు పనులు చెయ్యకుండానే లక్షలు డ్రా చేసుకున్నారు. ఆ గ్రామ మహిళలు ఇతరులతో కలిసి మండలాఫీసును మూడు రోజులు దిగ్బంధించారు. కలెక్టరునూ ఘెరావ్ చేశారు. దెబ్బకు ఎమ్డీఓ సస్పెండయ్యాడు. లక్షలు మింగినవారు కక్కారు. చిత్తూరు జిల్లా సత్యవేడులో కుల దూషణకు పాల్పడిన ఎస్ఐ మెడలు వంచి క్షమాపణలు చెప్పించారు. ఈ చట్టంలో మహిళలకున్న సౌకర్యాలను అమలు చేయించుకునే విధంగా మహిళలు చైతన్యయుతంగా వ్యవహరిస్తున్నారు.

మాయదారి సారాపై మహా సమరం

మహిళను భూమాతతో పోలుస్తారు. భరించి భరించి బద్దలైన ఆవేదన ఆవేశంగా మారితే సమాజలోతుల్లోంచి పుట్టిన మరో మహత్తర పోరాటం సారా వ్యతిరేక ఉద్యమం. యాంత్రీకరణతో మహిళలకు పనులు తగ్గాయి. మరోవైపు కూలి సరిగా లేదు. ఇంకోవైపు సంపాదించిందంతా మొగుడు సారా కొట్టుకు సమర్పిస్తే ఆకలితో నకనకలాడుతున్న పిల్లల జాలి చూపులను భరించలేక తెగించిన మహిళలు ముందు పీఠిన నిలిచిన పోరాటమిది. "కల్లు మానండోయ్..కళ్లు తెరవండోయ్" అంటూ 1920లోనే మహాత్ముడు నినాదమిచ్చాడు. తననొక్కరోజు, గంట నియంతగా నియమిస్తే మత్తు పదార్థాలు, మద్యపానీయాలపై నిషేధం అమలు చేస్తానని అన్నాడాయన. 1934లోనే కల్లు పాకల వద్ద మహిళలు ధర్నాలు చేశారు. రాష్ట్రంలో ఉవ్వెత్తున సాగిన ఈ ఉద్యమానికి అక్షరాల దిద్దుబాటు కారణమైంది. సాక్షరతా ఉద్యమం నెల్లూరులో ఒక సాంస్కృతిక ప్రభంజనాన్ని సృష్టించి లక్షల మందిని కదిలించింది. మెరుగైన జీవితం కోసం మహిళలు ఒకచోటకు చేరారు. తమ బతుకులను కాలరాస్తున్న సారాపై తిరగబడ్డారు. ఇది దూబగుంట నుంచి అలా ప్రారంభమై ఇలా రాష్ట్రమంతా అల్లుకుంది. మా ఊరికి సారావద్దు అంటూ వేలంపాటలను నిలువరించింది. చిన్న నీటిబొట్లే పెద్ద సముద్రమైనట్లు ఈ కాలంలో కదిలిన మహిళలను చూస్తే అదో ప్రభంజనం. ప్రారంభంలో దూబగుంట స్ఫూర్తితో నెల్లూరులో ప్రారంభమైనా తర్వాత్తర్వాత ప్రతి జిల్లా ఒక సింహపురైంది. మహిళలు శివంగులై కదిలారు. ఈరోజుకీ ఏదో ఒక ప్రాంతంలో సారాపై సమరం కొనసాగుతూనే ఉంది. ఇటీవల అసెంబ్లీకి సమర్పించిన రోశయ్య బడ్జెట్‌లోనూ మద్యంపైనే ఆశలు పెట్టుకున్నట్లు విదితమైంది. జనాల ఒళ్లు గుల్ల చేసి కాపురాలు కూల్చే మద్యంపై వ్యాపారంతో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి మహిళల్ని లక్షాధికారులను చేస్తామని ప్రభుత్వం నమ్మబలుకుతోంది. తస్మాత్ జాగ్రత్త!

ఈ రోజు మన శాసన సభాపక్ష నాయకురాలు, మన హోం మంత్రి, స్పీకర్, పార్లమెంట్ స్పీకర్, అత్యున్నత రాష్ట్రపతి మహిళలే. ఇది నాణేనికి ఒకవైపే. మరోవైపు ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం 1995 ప్రకారం సమాజంలో స్త్రీల పనిని, కృషిని తక్కువగా అంచనా వేసేందుకు గ్లోబల్ స్థాయిలో కుట్ర సాగుతోంది. 'మన దేశ మహిళలపై సాగుతున్న వివక్ష కారణంగా గత శతాబ్దంలో 3.7కోట్ల మంది పసిమొగ్గలు తల్లి గర్భంలోనే కన్నుమూశారు. స్త్రీ, పురుష నిష్పత్తిలో తీవ్ర అసమానతలొచ్చాయి. మన రాష్ట్రంలో స్త్రీలపై హింస పెచ్చుమీరింది. ఏ యాసిడ్ దాడో, కత్తి పోటో చెప్పలేని అభద్రతలో ఉన్నాం. చట్టాలు చట్టుబండలై కలవారి లోగిళ్లలో చక్కర్లు కొడుతున్నాయ్. ఈ దశలో సాధించిన వాటిని మననం చేసుకోవాలి. అందుకు మహిళామతల్లులు చేసిన త్యాగాలు మననం చేసుకోవాలి. చారిత్రక వారసత్వాన్ని మన ముందు తరాలకు మనమూ అందివ్వాలి. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన ఈ స్ఫూర్తిని నింపుకుందాం.

-కె.ఉష

'చట్టసభల' స్వప్నం నెరవేరేనా?

'చట్టసభల' స్వప్నం నెరవేరేనా?

శతాబ్దాల అణచివేత. తరతరాలుగా కొనసాగిన పీడన. సాంప్రదాయాల పరదాల చాటున గొంతు నొక్కేసిన వైనం. జీవిత ఆకాంక్షలకే కాదు ఆటపాటలకూ ఆంక్షలు! నాలుగ్గోడల మధ్య కూడా స్వేచ్ఛగా నవ్వనివ్వని కట్టుబాట్లు ...! ఈ దుష్ట సంస్కృతినుండి మొట్టమొదటిసారిగా జాతీయ ఉద్యమంలో గళం విప్పింది భారత మహిళ. స్వేచ్ఛకోసం, సమానత్వం కోసం నినదించింది. వీరతెలంగాణా విప్లవపోరాటంలో సాయుధ శక్తియైంది. భూమికోసం, భుక్తికోసం, వెట్టి విముక్తికోసం పోరాట రూపమైంది. అయినా, స్వేచ్ఛగా, నిర్భీతిగా ముందుకురకలేని స్థితి. సంకెళ్లేవో కట్టిపడేస్తున్న అనుభూతి. పోరాటంలో సగమైనా, పోరాటమే తానైనా వెంటాడుతున్న సంకెళ్ల చప్పుడు! కనపడని ఆ సంకెళ్లపై నారీలోకం పూరించిన సమరశంఖమే చట్టసభల్లో రిజర్వేషన్లు. ఏదైతే దేశభవిష్యత్తును నిర్దేశిస్తోందో, ఎక్కడైతే జాతి గొంతు ప్రజ్వలమవుతుందో, అక్కడ, ఆ వేదికపై నుండే తరతరాల అణచివేతపై సంఘటిత విజయం సాధించాలన్న ఆకాంక్ష!

మహిళాబిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలు కన్పిస్తున్నాయి. అంతర్జాతీయ మహిళాదినోత్సవమైన మార్చి8ను ముహూర్తంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయపార్టీల దొంగాట కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటనపైనా ఎన్నో అనుమానాలు!

ఎన్ని అడ్డంకులో ....!

ఎప్పటినుండో కొనసాగుతున్న పితృస్వామ్య భావజాలానికి రాజకీయపార్టీలు అతీతం కాదు. కొన్ని పార్టీల్లో ఈ భావజాలానిదే ఇప్పటికీ పైచేయి. ఈ పరిస్థితిని మార్చేందుకే మహిళాసంఘాలు నడుంకట్టాయి. మహిళానేతలూ జతకట్టారు. సుదీర్ఘకాలం చేసిన పోరాటం ఫలితంగా చట్టసభల్లో మూడవవంతు రిజర్వేషన్లు మహిళలకు కల్పించడానికి, ఈ మేరకు రాజ్యాంగసవరణ చేయడానికి పార్టీలు మద్దతిచ్చాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తరపున మొట్టమొదటిసారి ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పుడు అప్పటి ప్రధానమంత్రి దేవెగౌడ తన జీవితం ధన్యమైనట్లుగా ప్రకటించారు. 'దేశచరిత్రలో ఇదో సుదినం' అన్నారాయన. అప్పటి నుండి ఇప్పటి వరకూ పార్లమెంటు ఆమోదం పొందకుండా ఎన్నో అడ్డంకులు. వామపక్షాలు మినహా అన్ని రాజకీయపార్టీలదీ అదే దారి. కొందరు పార్లమెంటు సభ్యులైతే ఏకంగా అవమానకర వ్యాఖ్యలకే దిగారు. 1996లో దీనిని ప్రవేశపెట్టినప్పుడు బిజెపికి చెందిన ఉమాభారతి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కుటుంబజీవనం, సాంఘిక సత్సంబంధాల పేర ఆర్ఎస్ఎస్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది. 2000 సంవత్సరంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానిదీ ఇదే దారి. ఏకాభిప్రాయం లేకుండా బిల్లును ప్రవేశపెట్టడం అసాధ్యమని బిజెపి ప్రకటించింది. అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పేయి బిల్లు భారాన్ని లోక్‌సభ స్పీకర్ మనోహర్‌జోషి నెత్తినవేసి చేతులు దులుపుకున్నారు. ఏకాభిప్రాయం మాట చెప్పిన మరుసటిరోజే భిన్నాభిప్రాయాలున్నప్పటికీ ప్రసారభారతి బిల్లును ఆమోదింపచేసుకున్న ఘనత ఆ ప్రభుత్వానికే దక్కింది. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వమూ అదే బాటపట్టింది. ఎన్నికల సమరంలో మహిళాబిల్లును ఆమోదింపచేస్తామంటూ హామీల వర్షం కురిపించిన ఆ పార్టీ నేతలు ఆ తరువాత 'సభ వెలుపల ఏకాభిప్రాయం కుదరాలి' అంటూ బిజెపి పల్లవినే అందుకున్నారు. ఆ ప్రభుత్వమే అణుఒప్పందం వంటి అత్యంత వివాదాస్పద ఒప్పందాలపై లోక్‌సభలో ఎంపీలు నిట్టనిలువునా చీలిపోయినా ఏ మాత్రమూ జంకకుండా తమ పంతం నెగ్గించుకున్న విషయం అందరికి తెలిసిందే. యుపిఏకు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి అణుఒప్పందం కన్నా మహిళాబిల్లే ప్రమాదకరంగా కనిపించిందేమో! ఈ నేపథ్యమే బిల్లు ప్రవేశపెడతామంటూ తాజాగా చెబుతున్న మాటలను అనుమానంగా చూడకతప్పని స్థితి కలిపించింది.

ఎన్ని అవమానాలో ...!

అవమానాల సుడిగుండంలో బతుకులీడ్చడం ఈ దేశంలో మహిళలకు నిత్యకృత్యమైంది! మహిళా బిల్లుకు సైతం అటువంటి పరిస్థితే. గౌరవనీయులుగా తమనుతాము అభివర్ణించుకునే పార్లమెంటుసభ్యులు ఈ బిల్లుకు చేసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు అటువంటివే! సీట్లను రిజర్వు చేయడానికి బదులుగా రాజకీయపార్టీల అభ్యర్థుల జాబితాల్లోనే రిజర్వేషన్లు కల్పించాలన్నది అందులో ఒకటి. దీని ప్రకారం ఏ సీటూ మహిళకు రిజర్వు చేయరు. పార్టీలు మాత్రం వారికి సీట్లు కేటాయించాలి. దీనివల్ల చట్టసభల్లో ఒక్క స్థానానికి కూడా మహిళ ఎన్నికవుతుందన్న గ్యారంటీ లేదు. రిజర్వేషన్ తప్పనిసరి కావడంతో గెలవడానికి అవకాశంలేని సీట్లనే పార్టీలు వారికి కేటాయిస్తాయి. పార్టీల దయాదాక్షిణ్యాలతో ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ గెలిచి చట్టసభలో సభ్యులు కావడానికి మాత్రం ఆస్కారం లేని పద్ధతి ఇది. ఇంతకన్నా దారుణమైన మరోసూచన కూడా వచ్చింది. దాని ప్రకారం దేశంలోని మూడవ వంతు సీట్లను దంద్వ సీట్లుగా మార్చడం. ఈ స్థానాల నుండి పురుష ప్రతినిధితో పాటు మహిళా ప్రతినిధిని కూడా ప్రజలు ఎన్నుకుంటారు. ఆ ఇద్దరు ఎంపీలు ఆ నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తారు. ఆచరణలో ఏం జరుగుతుందో ఇట్టే అర్థం కావడం లేదూ! మూడో ప్రతిపాదన ఇప్పుడున్న లోక్‌సభ నియోజకవర్గాలకు అదనంగా 182 సీట్లను పెంచాలన్నది. బిజెపి అయితే, అదనంగా ఎన్నికయ్యే మహిళా సభ్యులతో కలిపి ఎంపీలందరూ కూర్చోవడానికి వీలైన భవనాన్ని నిర్మించాలనే ప్రతిపాదన వరకూ వెళ్లిపోయింది. అంతపెద్ద సంఖ్యలో నియోజకవర్గాలు పెరగడం అసాధ్యమని చివరకు తేలింది. ఇక ఓబిసి మహిళల సంగతి తేల్చితీరాలన్న మరో సవాల్! ఇది ఆచరణలో సాధ్యం కావాలంటే మరో రాజ్యాంగ సవరణ అవసరమన్న విషయమూ వారికి తెలుసు. ఆ విషయం తెలిసీ పదేపదే ఆ డిమాండ్‌ను ముందుకు తీసుకువస్తున్నారంటే మహిళాబిల్లును అడ్డుకోవాలన్న తలంపే తప్ప మరొకటి కాదన్నది బహిరంగ రహస్యమే. ప్రస్తుత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం ఎస్సీ,ఎస్టీ స్త్రీలకు రిజర్వేషన్ వర్తిస్తుంది. రిజర్వేషన్ల సాధారణ విభాగంలో ఒబిసీ కోటాను చేరిస్తే ఆ మహిళలకూ ఈ కోటా లభిస్తుంది. ఆ విషయాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే విస్మరిస్తూ కొన్ని రాజకీయపార్టీలు ఉద్దేశ్యపూర్వకంగా బిల్లును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

రిజర్వేషన్లు ఎందుకోసం ...?

చట్టసభల్లో మహిళారిజర్వేషన్లు కేవలం రాజకీయ అధికారాల్లో సమానభాగం కోసం చేస్తున్న పోరాటం కాదు. తరతరాలుగా సాగుతున్న పురుషాధిక్య భావజాలానికి ఈ డిమాండ్ ఒక సవాల్! ఆర్థిక, సామాజిక రంగాల్లో నెలకొన్న వివక్షపై తిరుగుబాటు. సమాజంపట్ల మరింత బాధ్యతతో, మరింత జాగ్రత్తతో ముందడుగు వేయడానికి అవకాశం. వీటన్నింటికీ మించి పంచాయతీల్లో ఇప్పటికే సాధించుకున్న రిజర్వేషన్లను కాపాడుకోవడానికి అవసరం. అందుకే, తాజా బిల్లు ప్రతిపాదన తరువాత ఫలితం ఏమైనప్పటికీ ఇదే స్ఫూర్తితో ముందుకు కదలడానికి సిద్ధం కావాలి.

-వి.రాజగోపాల్

మహిళామణులు

క్లారా జట్కిన్

ప్రఖ్యాత జర్మన్ కమ్యూనిస్టు నేత. అంతర్జాతీయ శ్రామిక ఉద్యమానికి ఆద్యురాలు.

కార్మిక వర్గ సమస్యలపైన ప్రపంచ శాంతి కోసం విశేష కృషి చేశారు. జర్మన్ పార్లమెంట్ సభ్యురాలు కూడా. మార్క్స్ కుమార్తె లారా లాఫార్గ్, ఎంగెల్స్, ఆగస్ట్ బెబెల్, రోజా లగ్జెంబర్గ్‌తో కలిసి పనిచేశారు.

రోజా లగ్జెంబర్గ్

జర్మనీలో ప్రఖ్యాత కార్మికోద్యమ నాయకురాలు. పోలిష్ జాతీయురాలు. జాతీయంగానే గాక, అంతర్జాతీయంగా కూడా కార్మికవర్గ ఐక్యతకోసం రాజీ లేని పోరాటం చేశారు. ఒక దేశ కార్మికులు మరో దేశ కార్మికవర్గంతో యుద్ధం చేసి నాశనం కావద్దని, ప్రపంచ యుద్ధాలకు వ్యతిరేకంగా పోరాడారు. జర్మన్ ఫాసిస్టులు రోజా లగ్జెంబర్గ్‌ను, మరో నాయకుడు కార్ల్ లీబెనెక్ట్‌ను హత్య చేశారు.

అలెగ్జాండ్రా కొల్లంతాయ్

ప్రథమ సోషలిస్టు దేశమైన సోవియట్ యూనియన్‌లో ప్రథమ మహిళా మంత్రి.

ప్రపంచంలో మొట్టమొదటి మహిళా రాయబారి కూడా. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వాహకుల్లో ఒకరు. కార్మిక ఉద్యమంలో అంతర్భాగంగా కుటుంబంలో స్త్రీ సమాన హక్కుల సమస్యను పరిష్కరించడంలో విశేష కృషి చేశారు.

నాదెజ్దా కృపస్కయా

రష్యాలో శ్రామిక మహిళల్ని సంఘటితం చేశారు. కార్మికుల్ని విజ్ఞానవంతుల్ని చేయడంలో గొప్ప కృషి చేశారు. శ్రామిక మహిళ పత్రిక నడిపారు. ప్రప్రథమ సోవియట్ ప్రభుత్వం స్త్రీల హక్కుల్ని కాపాడడంలో, తల్లిపిల్లల సంరక్షణ బాధ్యత తీసుకోవడంలో ఆమెది ప్రముఖ పాత్ర.

సుశీలా గోపాలన్

చదువుకునే రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 18 సంవత్సరాల వయసులో కొబ్బరి పీచు కార్మికుల్లో పనిచేశారు. చనిపోయే వరకు పీచు కార్మికుల సంక్షేమం కోసం పనిచేశారు. సిఐటియు ఉపాధ్యక్షురాలు కూడా. ప్రముఖ పార్లమెంటేరియన్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శిగా చాలాకాలం పనిచేశారు. కేరళ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా కూడా ఉన్నారు. క్యాన్సర్‌తో చనిపోయారు.

మోటూరు ఉదయం

ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం కార్యదర్శిగా 18 సంవత్సరాలు పనిచేశారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘంలో ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు. ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి. మహిళా సమస్యలపై కళారూపాలు తయారుచేసి విస్తృతంగా మహిళల్లో ప్రచారం గావించారు.

విమలా రణదివే

శ్రామిక మహిళా ఉద్యమ నిర్మాత. 1979లో ఏర్పడిన మొదటి శ్రామిక మహిళా సమన్వయ కమిటీకి కన్వీనర్‌గాను, సిఐటియు కార్యదర్శిగాను ఉన్నారు. చనిపోయే వరకు ఆ బాధ్యతల్లో ఉన్నారు. టీ, కాఫీ, రబ్బరు తోటల్లో పనిచేసే ప్లాంటేషన్ కార్మిక సంఘానికి నాయకురాలుగా కూడా ఉన్నారు. అంగన్‌వాడీ యూనియన్ నిర్మాత.

అహల్య రంగ్నేకర్

చిన్నతనంలోనే అన్న బిటి రణదివే ప్రోత్సాహంతో జాతీయోద్యమంలోనూ, ఆ తరువాత బొంబాయి బట్టల మిల్లు కార్మికోద్యమంలోనూ పాల్గొన్నారు. అరెస్టయ్యి జైళ్లకు వెళ్లారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నిర్మాతల్లో ఒకరు. సిఐటియు ఉపాధ్యక్షురాలుగా కూడా ఉన్నారు.

మానికొండ సూర్యవతి

రాష్ట్ర మహిళా ఉద్యమ నిర్మాతల్లో ఒకరు. మహిళా లోకం గర్వించదగ్గ మణిపూస మానికొండ సూర్యవతి. ఆశయ సాధన కోసం మొక్కవోని విశ్వాసంతో నిలిచిన ఆదర్శనారి. అట్టడుగు వర్గాలకు కొండంత అండగా నిలబడ్డ త్యాగశీలి. ★

యద్దనపూడి సులోచనా రాణి

కళా సాహిత్య వికాసంలో మహిళల పాత్రను గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. కాని ఆ రంగాలలో వారి స్థానం అందుకు తగిన స్థాయిలో వుండదు. అసలు భాష పుట్టుక, పెరుగుదలలో మహిళల పాత్ర కీలకం. అసలు మాతృభాష అన్నది అమ్మతోనే మొదలు. గొప్ప రచయితలందరూ తాము మంచి భాష తల్లులు, తాతమ్మల దగ్గరే నేర్చుకున్నామని చెబుతారు. కాని చెప్పుకోబోతే మాత్రం అందరూ పురుషుల పేర్లే వినిపిస్తారు. పురుషుల బొమ్మలే కనిపిస్తాయి. పురుషాధిక్య సమాజ స్వభావానికి ఇదే నిదర్శనం. ప్రతి దేశంలోనూ జానపద సాహిత్యంలో మహిళల మనోభావాలే ప్రతిబింబిస్తాయి. దంపుడు పాటలు, కోత పాటలు ఏవైనా శ్రమ జీవితాన్నే చూపిస్తాయి. అలాగే పెళ్లిళ్లు, పేరంటాల పాటలు కూడా. ఇవేగాక అత్తింటి ఆరళ్లను, కోడళ్ల యాతనలను, పేదల వేదనలను పెత్తందార్ల దౌర్జన్యాలను పల్లె పదాల్లో అత్యంత సహజంగా చూడగలుగుతాము. కలవారి కోడలు కలికి కామాక్షి అయినా పుట్టినింటికి పోవాలంటే భర్త అనుమతి కోసం ఎన్ని ప్రదక్షిణాలు చేయవలసి వచ్చిందో ఆ పాట విన్న ప్రతివారికీ తెలుసు. (దాన్నే కొంచెం మెరుగుపర్చి సీతారామయ్య గారి మనవరాలు చిత్రంలోనూ చూపించారు) రామాయణం మొత్తాన్ని సీతమ్మోరి చెరలు అనడం మనకు తెలుసు. ఇవన్నీ తరతరాలుగా మహిళల దురవస్థలను బాధావేదనలను కళ్లకు కడతాయి.

సాహిత్యంలో మహిళా స్వర విస్ఫోటనం

- తెర

జానపదాల నుంచి జ్ఞానపదాలనే పండిత సాహిత్యం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. ఇవి రాసిన వారు ప్రధానంగా రాజాశ్రితులైన పురుష పుంగవులే. కనుక వాటిలో ఎక్కడో గాని మహిళల మనోగతం మనకు దర్శనమివ్వదు. పురాణాలు ప్రబంధాలు అన్నిటిలోనూ స్త్రీలను కేవలం పురుష సేవక పరాయణత్వంలోనే ముంచి తేల్చారు. అదే గొప్ప నారీ ధర్మం అన్నారు. వేశ్యాలంపటత్వంతో వ్యాధిగ్రస్తుడైన భర్తను బండిలో వేసుకుని అక్కడికి చేర్చడమే గాక ఆయన్ను బతికించుకోవడానికి సూర్యోదయాన్నే అడ్డుకోవడం పెద్ద పతివ్రతా ధర్మంగా చెప్పారు. మరో వైపున పురుషులను మాత్రం రసిక శిఖామణులుగా చేసి వారికోసం అప్సరసలను, గంధర్వ కన్యలను, వేశ్యా లలామలను సృష్టించారు. పురాణాలు ప్రబంధాలన్నిటిలోనూ మనకు నోరెత్తని పతివ్రతలు లేదా అప్సరసలు మాత్రమే కనిపిస్తారు. ఇది అక్షరాలా పురుషాధిక్య సమాజపు ఆంక్షలకు కాంక్షలకు ప్రతిబింబం. అప్పట్లో రాసే వారిలోనూ మహిళలు నామకార్థం. రాసిన ముద్దుపళని వంటివారిపై కూడా ఆక్షేపణలే ఎక్కువ. ఇక మొల్ల కింది కులం నుంచి వచ్చినందువల్ల ఆమెకూ గౌరవం దక్కలేదు. తరికొండ వెంగమాంబ వంటివారిని భక్తి రసంలో ముంచేసి స్త్రీలుగా వారి ప్రతిపత్తికి గుర్తింపు లేకుండా చేశారు. ఆఖరుకు అనేక విషయాల్లో విప్లవాత్మక భావాలు వినిపించిన వేమన కూడా స్త్రీల విషయం వచ్చేసరికి శాపనార్థాలకే పరిమితమై పోయాడు. వీరబ్రహ్మం పద్యాలలోనూ అలాంటివి చాలా కనిపిస్తాయి. భూస్వామ్య సమాజం పొడుగునా మనకు కనిపించే దుర్లక్షణం ఇదే.

19వ శతాబ్ది చివరలో, 20వ శతాబ్ది ప్రారంభంలో గాని మహిళల చిత్రణ సరైన రూపం తీసుకోలేదు. కందుకూరి వీరేశలింగం, మహాకవి గురజాడ అప్పారావు అందుకు నాంది పలికారు. అప్పటి వరకూ చలామణిలో వున్న ఏకపక్ష పాతివ్రత్య ధర్మపన్నాలకు భిన్నంగా 'మగడు వేల్పన పాతమాటది ప్రాణమిత్రుడ నీకు' అంటూ భార్యా భర్తలను స్నేహితులుగా చిత్రించాడు గురజాడ. వేశ్యా వనిత మధుర వాణిని మహాచైతన్యవంతమైన నాయికగా తీర్చిదిద్ది ఛాందస వర్గాల గుండెల్లో ప్రకంపనాలు పుట్టించారు. ఆయనే కథల్లోనూ స్త్రీ వికాసానికి పట్టం కట్టారు. ఆయన 1911లో రాసిన 'దిద్దుబాటు' తొలి తెలుగు కథానిక అనుకునే వారు గాని, బండారు అచ్చమాంబ 1902లోనే 'ధనత్రయోదశి' పేరిట రాసింది తొలి కథ అని ఇప్పుడు స్పష్టంగా రుజువైంది. మొదట చెప్పుకున్నట్టు భాషా సాహిత్యాలలో స్త్రీల ప్రథమ స్థానాన్ని ఈ ఉదాహరణ కూడా నిరూపిస్తుంది.

అయితే గురజాడకున్న అనుభవమూ, అవకాశాల రీత్యా ఆయనలో ఈ భావం సంపూర్ణమైందని చెప్పడం అతిశయోక్తి కాదు. సరిగ్గా అప్పుడే దేశంలో జాతీయ పవనాలు వీచడం మొదలవుతున్నది. 1920ల నాటికి ఇవన్నీ తీవ్రరూపం తీసుకున్నాయి. ఇందుకు భిన్నంగా భావ కవులు స్త్రీల వాస్తవిక పరిస్థితిని పట్టించుకోకుండా వూహాసుందరిని సృష్టించి ఆమె కోసం ఏడుస్తూ ప్రేమ విలాప కవిత్వం గుప్పించడం మొదలెట్టారు. కనపర్తి వరలక్ష్మమ్మ ఈ ధోరణిని గేలి చేస్తూ గొప్ప కవిత రాశారు.

ఇంచుమించు అప్పుడే చలం, కొడవటిగంటి, విశ్వనాథ సత్యనారాయణ వంటి వారు వేర్వేరు కోణాల నుంచి స్త్రీ ప్రధానమైన సాహిత్య రచన చేశారు. ఇందులో మొదటి ఇద్దరూ ప్రగతిశీల కోణం తీసుకోగా విశ్వనాథ సనాతన ధర్మాన్ని నెత్తినెత్తుకున్నారు. అగ్రవర్ణ పురుషుడు నాలుగు పెళ్లిళ్లు చేసుకోవచ్చని రాయడమే గాక బాల్య వివాహాలను కూడా ఆకాశానికెత్తాడు. ఆ విధంగా తెలుగు సాహిత్యంలో కుటుంబ సంబంధాలు స్త్రీ సమస్యల చిత్రణలో భిన్న ధోరణులు ఘర్షణ పడ్డాయి. వీటిలో చలం పెద్ద సంచలన కారుడయ్యాడు. అయితే ఆయనలో స్త్రీ పక్షపాతాన్ని హర్షిస్తూనే సమాజ పరిణామం పట్ల ఆయన అవగాహనకుగల పరిమితులను అందరూ ఆమోదించారు. ఇందుకు భిన్నంగా కొడవటిగంటి చైతన్య వంతులైన, సజీవ శక్తులైన స్త్రీ మూర్తులను సృష్టించారు. అందులోనూ యాంత్రికత కొంత వుండకపోదు. 40,50దశకాలనాటికి కమ్యూనిస్టు ఉద్యమాలు విప్లవ పోరాటాల నేపథ్యంలో మహిళల చైతన్యం కొత్త పుంతలు తొక్కింది. వీర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం, లంక భూముల పోరాటం వంటివి సరికొత్త మహిళానేతలకు వూపిరిపోశాయి. తొలిసారిగా అలాంటి పాత్రలు సాహిత్యంలో ప్రవేశించాయి. ఇందుకు తోడు ప్రజా నాట్యమండలి, అభ్యుదయ రచయితల ఉద్యమం ప్రజా కళా సాహిత్యాలను సృష్టించడంతో స్త్రీలకు కూడా కొత్త చైతన్యం కలిగింది. సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలు కూడా పురుషులే వేస్తున్న స్థితి మారి మహిళలను ముందుకు తేవడం పెరిగింది. మహిళా సంఘం నాయకురాలు మొటూరు ఉదయం మంచి బుర్రకథకురాలు కావడం ఇందుకో ఉదాహరణ మాత్రమే. అప్పుడే రచయిత్రులు ముందుకు రావడం కూడా పెరిగింది గాని అరవయ్యవ దశకంలో గాని అది విస్తృత రూపం తీసుకోలేదు. స్వాతంత్ర్యానంతరం అమ్మాయిలను చదివించడం, ఉద్యోగాలవైపు ప్రోత్సహించడం అప్పటికి కొంత పెరిగింది. రేడియో పత్రికల వంటివి కూడా విస్తరించాయి. ఆ నేపథ్యంలోనే



వాసిరెడ్డి సీతాదేవి

రంగనాయకమ్మ

కొంత విద్యాగంధం అబ్బిన మహిళలు రచనలు చేయడం మొదలు పెట్టారు. నాటి వారపత్రికలు అందుకు మంచి వేదికలైనాయి. చదువుకొన్న మహిళల మెదడుకు మేతగానూ కాలక్షేపంగానూ కూడా వాటిలో వచ్చే ధారావాహికలు ఉపయోగపడ్డాయి. యద్దనపూడి సులోచనా రాణి, కోడూరి కౌసల్యాదేవి, ద్వివేదుల విశాలాక్షి, లత, కావిలపాటి విజయలక్ష్మి, కె.రామలక్ష్మి, మాదిరెడ్డి సులోచన, వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ తదితర రచయిత్రులు అనేక మంది తమ తమ కోణాలలో ధోరణులలో విస్తృతంగా రాస్తుంటే పాఠకురాళ్లు వాటికోసం ఆసక్తిగా ఎదురు చూడటం పరిపాటిగా మారింది.

ఈ రచయిత్రులలో ఎక్కువ మంది మధ్యతరగతి మహిళల మనోభావాలనే ప్రతిబింబించారు. అంటే కొంత చదువుకొని ఆత్మగౌరవం కాపాడుకుంటూ ఏదైనా చిన్న ఉద్యోగం చేసుకుంటూ అందగాడూ ఆదర్శప్రాయుడైన భర్త రావాలని కోరుకోవడం వీటన్నిటిలో సాధారణాంశం. కొన్ని సార్లు వైవాహిక జీవితంలో సర్దుబాటు సమస్యలను కూడా వీటిలో చర్చించే వారు. ఏతావాతా ఇవి కొత్తగా పైకి వస్తున్న విద్యాధిక మహిళల ఆలోచనా ధోరణినే ప్రతిబింబించాయి. వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మ వంటి వారి రచనలలో మహిళల సమస్య చిత్రణ, సామాజిక చైతన్యం ఎక్కువగా వున్నా ఈ దశకు ప్రధాన ప్రతినిధి యద్దనపూడి, కోడూరి వంటివారే. వీరి రచనలలో వర్గ దృక్పథం లేదన్న విమర్శ ప్రధానంగా ఎదురైంది గాని వారు వ్యక్తం చేసిన ఆలోచనల్లో పెద్ద తప్పు పట్టాల్సింది కూడా లేదు. ఉన్నంతలో ఐశ్వర్యం, అందం, అవగాహన వున్న భర్త రావాలని కోరుకోవడమే పెద్ద పగటికల అన్నట్టు కొందరు విపరీతంగా విమర్శలు చేశారు. ఈ నవలలే సినిమాలుగానూ వచ్చాయి. ఒక దశలో సినిమాలకూ నవలలకూ తేడా లేకుండాపోయింది. ఏది ఏమైనా ఈ రచయిత్రులు పాఠకులను విపరీతంగా పెంచేందుకు కారకులయ్యారు. అయితే క్షీణ సంస్కృతి వెర్రితలలు వేసిన తర్వాత వీరి కాల్పనికత చాలని దశ వచ్చింది. అందుకే ఎనభయ్యవ దశకం తర్వాత యండమూరి వీరేంద్రనాథ్ వంటి వారు రంగ ప్రవేశం చేశారు. వీరి రచనల్లో స్త్రీలను అసభ్యంగా చిత్రించడం సర్వసాధారణమై పోయింది. అప్పటికే సినిమాల్లోనూ కథానాయిక పాత్ర దిగజారడం మొదలైంది. చివరకిది క్షుద్ర సాహిత్యంగా క్షీణించి పోయింది. ఈ సాహిత్యాన్ని సృష్టించిన వీరేంద్రనాథ్ వ్యక్తిగతంగానూ ఒక కేసులో చిక్కి ఎలాగో బయటపడటం కూడా ఈ పరిస్థితికి ఒక ప్రతిబింబం వంటిదే.

ఈ దశలోనే దేశంలో వరకట్న మరణాలు, అత్యాచారాల వార్తలు విపరీతంగా వెలుగులోకి రావడం మొదలైంది. రాజకీయంగానూ రమిజాబీ, షకీలాలపై పోలీసుల అత్యాచారాల వార్త రాష్ట్రాన్ని కుదిపేసి చెన్నారెడ్డి ప్రభుత్వ పతనానికి కారణమైంది. అంతర్జాతీయ మహిళా దశాబ్దం ముగింపు దశకు వచ్చింది. మరో వైపున వారపత్రికలు క్రమంగా వెనకపట్టు పట్టి దూరదర్శన్ విస్తరించడం మొదలైంది. సినిమా కూడా విజృంభించింది. రచయిత్రులు వారి ధారావాహికలు ప్రధాన పఠన వనరుగా కాలక్షేపంగా వున్న స్థితి పోయింది. స్త్రీలపై సాగుతున్న ఈ అత్యాచారాలు వివక్షతలు తీవ్ర ఆగ్రహావేశాలకు దారి తీయడమే గాక స్త్రీ వాదం అన్న ధోరణి పుంజుకోవడానికి కూడా కారణమైనాయి. అప్పటి వరకూ వున్న మహిళా ఉద్యమం, చేస్తున్న పోరాటాలకు సమాంతరంగా ఈ స్త్రీ వాదం అనేది సాహిత్యంలో ఒక ముఖ్య ధోరణిగా ప్రవేశించింది. పాశ్చాత్య దేశాల ప్రేరణ గల కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా ఇందుకు ప్రోత్సాహమిచ్చినా ప్రధానంగా అప్పటి సామాజిక పరిస్థితులే ప్రధానంగా దానికి ప్రేరణ అయ్యాయి. ఈ దశకు ఓల్గా మొదటి ప్రతినిధి అయ్యారు. తర్వాత కథలు, కవిత్వాలు కూడా స్త్రీవాద కోణం నుంచి పెద్ద ఎత్తున వచ్చాయి. సత్యవతి, ఘంటసాల నిర్మల, కొండేపూడి నిర్మల, విమల, సుమతి, వసంత కన్నాభిరాన్, మృణాళిని, జయప్రభ, కుప్పిలి పద్మ, మెహజబీన్, షాజహానా, తదితరులు వేర్వేరు కోణాలలో రాయడం మొదలెట్టారు. అంతకు ముందు స్త్రీల సమస్యలు రాయడంలో పాటించిన పరిమితులను హద్దులను కూడా వీరు లెక్కచెయ్యకుండా స్త్రీల సామాజిక దైహిక అంశాలను సూటిగా అక్షరబద్ధం చేయడం అలజడికి దారితీసింది. అభ్యుదయ వాదులుగా విప్లవవాదులుగా పేరు పొందిన వారు కూడా అభ్యంతరకరమైన భాషలో వీరిపై దాడి చేశారు. పురుషాధిక్యతను తప్ప పురుషుల పట్ల వ్యతిరేకతను పెంచరాదన్నది వీరిపై ప్రధాన విమర్శ. ఈ రెంటినీ విడదీయడం అంత తేలికకాదని కూడా అందరికీ తెలుసు. అలాగే సమాజంలో ఇతర పోరాటాలకు మహిళా విముక్తికి మధ్య సంబంధాన్ని సవ్యంగా అర్థం చేసుకోవాలన్నది మరో విమర్శ. తొలి దశలో తీవ్ర స్వరంతో రాసినా మలి దశలో స్త్రీ వాదులు కూడా కొంత సమతుల్యత పెంచుకోవడానికి ప్రయత్నించారు. ఇతర అభ్యుదయ ఉద్యమాలపై దాడి తగదని గుర్తించారు కూడా. అయితే ఈ స్త్రీ వాదం సమాజంలోనూ సాహిత్యంలోనూ పాతుకుపోయిన కొన్ని భావజాలాలను భాషా ప్రయోగాలను సమూలంగా మార్చివేసిందనేది నిస్సందేహం. అది అభినందనీయం కూడా. ఉదాహరణకు చైర్మన్ అనే బదులు చైర్ పర్సన్ అని ఇప్పుడందరూ అంటున్నారు. జెండర్ న్యాయం అన్న భావన సామాజిక కొలబద్దల్లో ఒకటిగా ప్రవేశించడంలో ఈ ఉద్యమం పాత్ర చాలా వుంది. దళిత కవిత్వానికి చిక్కనవుతున్న పాట లాగే స్త్రీ వాదానికి 'నీలి మేఘాలు' కవితా సంకలనం ప్రతీకగా నిలిచింది. తర్వాత కాలంలో స్త్రీ వాదంలోనూ దళిత బహుజన మైనారిటీ వర్గాల మహిళల ప్రత్యేక బాధలను వ్యక్తం చేసే కవిత్వాలు కూడా వచ్చాయి. తనపై అత్యాచారం చేసిన పెత్తందార్ల కుర్రాడిని ఉద్దేశించి 'మానం కడుక్కుంటే పోతుంది, చిరిగిన రవికె ఎక్కడ తెచ్చుకోనురా .... కొడకా' అని ఒక దళిత మహిళ వాడిన పదజాలం చదివిన వారిని వెంటాడుతూనే వుంటుంది. అలాగే మధ్యతరగతి ఉద్యోగినులకు పనిప్రదేశాల్లో ఎదురయ్యే రకరకాల వికారమైన పరిస్థితులను యథాతథంగా చిత్రించడం కూడా ఈ సాహిత్యంలో చూస్తాం. అలాగే అంతకు ముందు సాహిత్యంలో ఎంతమాత్రమూ కనిపించని ప్రసవం, రుతు క్రమం, పిల్లలు, ఇంటి చాకిరీ, కార్యాలయాల్లో ఎప్పటికీ ఎదగనివ్వని అసమానతలు వంటి సున్నితమైన అంశాలను స్త్రీ వాద యుగంలో రచయిత్రులు ధైర్యంగానూ సమర్థంగానూ చర్చకు తెచ్చారు. కాల్‌గర్ల్స్ మోనాలాగ్ వంటి కవితలు గాని, పైటను తగలెయ్యండి వంటివి గాని మరో తరహాకు చెందినవి. ఇవి నీలి కవితలని జ్వాలాముఖి వంటి సంయమన శీలి కూడా తిట్టిపోసినా నిజానికి స్త్రీల అంగాంగ వర్ణన చేసిన గత సాహిత్యం కన్నా, హీనాతి హీనంగా చూపిస్తున్న నేటి నీలి చిత్రాల కన్నా ఇందులో అశ్లీలతేమీ లేదు. అమ్మాయిల ఓణీల పండుగలు కూడా ఆర్భాటంగా చేసే సమాజంలో మహిళలు తమ దేహాలను తాము చూసుకోవడం, రాసుకోవడం ఎలా తప్పవుతుంది? కాకపోతే శరీర ధర్మాలతోనే ఆగిపోకుండా సమాజ ధర్మాలను కూడా చూడాలని మొదట్లో చెప్పవలసి వచ్చింది. తర్వాత స్త్రీవాదులు ఎక్కువ మంది ఆ అవసరాన్ని గుర్తించారు కూడా. అయితే ఇప్పటికీ సామ్రాజ్యవాద వ్యతిరేక కోణం దాదాపు వుండటం లేదు. శ్రమజీవుల, ఉద్యోగినుల జీవితాలను చిత్రించే సాహిత్యం తగినంతగా రావడం లేదు. ప్రపంచీకరణ తాకిడికి ఆర్థికంగా అల్లాడటమే గాక ఆ ప్రభావానికి గురైన పురుషుల దౌర్బల్యాలకు, దౌర్జన్యాలకు సమిధలవుతున్న కోణాలను, హైటెక్ సంస్కృతి హైన్యాన్ని మరింత సమర్థంగానూ సమగ్రంగానూ చిత్రించే సాహిత్యం రావలసే వుంది. ఆ దిశలో కవయిత్రులు, రచయిత్రులు ముందడుగు వేయాలని కోరుకుందాం. ★

పేరుకే గౌరవ స్థానం...



ఉపాధ్యాయులంటే సంఘంలో ఒక గౌరవం. ఓ మన్నన. పదిమందికీ విద్య నేర్పి, వారిలో విజ్ఞానదీపాన్ని వెలిగించేవారు ఉపాధ్యాయులు. భావితరాలకు బంగారు భవిష్యత్తునిచ్చేవారు ఉపాధ్యాయులు. 'గురుదేవోభవ' అని తల్లిదండ్రుల తరువాత ఉపాధ్యాయులకు ఉన్నత స్థానమిచ్చిన సంస్కృతి మనది. అందులోనూ మహిళలపట్ల సమాజంలో ఎంతో గౌరవం. అటువంటి ఉద్యోగం చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు నిజంగా గౌరవప్రదంగా జీవిస్తున్నారా? వారికి సంఘంలో దొరుకుతున్న గౌరవమేపాటిది? ప్రభుత్వపరంగా వారికి దక్కుతున్న సహాయ సహకారాలు ఏపాటివి?

ఉపాధ్యాయుడు కుటుంబం, సమస్యల గురించి ఆలోచించకుండా... కేవలం విద్యార్థులకు విజ్ఞానం అందించాల్సిన కేంద్రాలుగా తరగతి గదులు వుండాలనేది సూత్రం. విద్యాలయం అన్న మాటలోనే పవిత్రమైనదనే భావన వుంది. కానీ ఆ ప్రశాంత వాతావరణం నేడు అరుదుగా మాత్రమే కనిపిస్తోంది.

మన రాష్ట్రంలో వున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు మూడు లక్షలైతే... అందులో 35-40శాతం స్త్రీలే! పూర్వం మహిళా ఉపాధ్యాయులు పాఠశాలకు ఒక్కరుండేవారు. నేడు పురుషులను మించి వీరి సంఖ్య పెరిగింది. సంఖ్యలో వాసి పెరుగుతున్నా... సదుపాయాల్లో వీరు అనేక కొరతలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వసతుల లేమి వారికో పెద్ద సమస్యగా మారింది. కనీస సౌకర్యాలుసైతం వారికి అందుబాటులో లేవు. ఆల్వాల్ పాఠశాలలో పనిచేసే విజయకుమారి మాట్లాడుతూ, “మాకు సరైన బాత్రూములుండవు. బాత్రూములుంటే అందులో నీటిసౌకర్యముండదు. దీనివల్ల మహిళా టీచర్లే కాదు, విద్యార్థినులు కూడా ఇబ్బంది పడుతున్నారు” అని వాపోతున్నారు. అంతకన్నా కఠోరవాస్తవం ఏమిటంటే... ఈ సమస్యవల్ల అనేకచోట్ల మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు దాహమైనా మంచినీరు ముట్టడంలేదు. ఉపాధ్యాయిని ప్రసన్న మాట్లాడుతూ, “విశాఖలోని ఓ పాఠశాల విద్యార్థినులు మంత్రిగారికి ఈ సమస్యపై మెమోరాండం సమర్పించారు. స్త్రీ సహజ ఇబ్బందులను గ్రహించలేని ప్రభుత్వం పనితీరు బాగుండాలని ప్రకటనలు జారీ చేస్తారు” అని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్త్రీలు ఎదుర్కొనే మరో సమస్య దూరాభారం. పాఠశాలకు గంటన్నర ప్రయాణంచేసే శ్రీరేఖ, “దూరం మా పాలిట శాపంగా మారింది. బస్సు దొరికితే గంటన్నర. దొరక్కపోతే ఇక తిప్పలే. సాయంత్రం అలిసిపోయి, బస్సులో సీటు దొరక్కుంటే మా అవస్థలు వర్ణించతరం కాదు. కొందరు బస్సు దిగాక నిర్మానుష్యప్రాంతంలో నడిచి వెళ్లాలి. పగలే స్త్రీకి రక్షణ కరువవుతున్న రోజులు. ఇక రాత్రిసమయాల్లో వారికేపాటి భద్రత దొరుతుంది చెప్పండి” అని ప్రశ్నిస్తున్నారు. శారద మాట్లాడుతూ, “గర్భిణీగా నేను చాలా సమస్యలు ఎదుర్కొన్నాను. పొద్దున్న వెళ్లినదగ్గర్నుంచీ సాయంత్రం వరకూ నిలువుకాళ్లమీద పాఠాలు చెప్పేదాన్ని. దానికితోడు రెస్టురూములు వుండవు. ఇక చంటిబిడ్డతో కష్టాలు చెప్పతరం కాదు. బిడ్డను వదిలి వుండలేం. వెంట తీసుకురాలేం. చంటిబిడ్డలకోసం క్రెచ్ పెట్టాలనే మా కోరిక ప్రభుత్వానికి పట్టదు” అని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉన్న బాధ్యతలకు తోడు వీరికి మధ్యాహ్న భోజనపథకం అదనపు భారంగా మారింది. “కనీసం మాకు భోజనం చేయడానికి సమయముండదు. కారణం మధ్యాహ్న భోజనపు ఏర్పాట్లు, వడ్డన, అజమాయిషీ అన్నీ మాపైనే. అన్నీ పూర్తయ్యేసరికి సమయం మించిపోతుంది. దాంతో క్షణాల్లో నోట్లో కుక్కుకోవడమే మిగిలేది. దీనికి అదనపు సిబ్బందిని ఏర్పాటుచేయవచ్చు కదా” అంటున్నారు తులసి.“మాకున్న మరో సమస్య మా తల్లిదండ్రులను మాత్రమే డిపెండెంటులుగా లెక్కగట్టడం. నిజానికి వివాహం అయిన మరుక్షణంనుంచే ప్రతీ స్త్రీ అత్తమామల బాధ్యత తీసుకుంటుంది. కానీ అత్తమామలకు సంబంధించిన కారణాలచేత మాకు సెలవు దొరకదు. ఇదెలా న్యాయం?” అంటున్నారు విమలకుమారి.

ఇవన్నీ ప్రభుత్వ టీచర్ల సమస్యలు. కానీ ప్రయివేటు పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు అంతేలేదు. ప్రయివేటు పాఠశాలల్లో 95శాతం మహిళలు. విపరీతమైన పనిఒత్తిడి, నామమాత్రపు వేతనాలు, టార్గెట్లు, యాజమాన్యపు ధోరణితో వారు సతమతమవుతున్నారు. యాజమాన్యం సంతకం చేయించుకునేది ఆరువేల పైన వుంటే, చేతికిచ్చేది పదిహేనొందలు మాత్రమే. రోజంతా నిలువు కాళ్లమీదే వుండాలి. వీలైనంత చాకిరీ చేయించుకునే యాజమాన్యం వీరికి ఖాళీ పీరియడ్ ఇవ్వడమనేది కల్ల. ఇబ్బడిముబ్బడిగా పెరిగిన ప్రయివేటు పాఠశాలలవల్ల ఉద్యోగాలైతే వస్తున్నాయి. కానీ ఇవి శ్రమదోపిడీకి మారుపేరుగా మారుతున్నాయి. విద్య వ్యాపారంగా ఎప్పుడైతే రూపుదాల్చిందో అప్పుడే విలువలు అడుగంటాయి.

“విద్య అనే వ్యాపారంలో లాభాలనార్జించే యాజమాన్యానికి వీరి గోడు పట్టదు. వీరు సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించరు. కారణం నిర్లిప్తతే. ఏదో వేణ్ణీళ్లకు చన్నీళ్లుగా సంపాదిస్తున్నాం. గట్టిగా మాట్లాడితే వున్న ఉద్యోగం ఊడిపోతుందనే భయం. అంతేగానీ, తమ చదువుకు తగ్గ విలువ, గుర్తింపు కొరవడిందనే బాధలేదు. రావాల్సినవి రాబట్టలేని, పోరాడలేని నిస్సహాయత. ఆధారం పోతుందనే భయం. ఇవన్నీ కలగలిసి వీరు అంతులేని ఒత్తిడికి లోనవుతున్నారు. అదంతా విద్యార్థులపై చూపుతున్నారు. అకారణంగా విద్యార్థులను కొట్టడం, వాతలుపెడుతున్నారనే వార్తల వెనుక ఇదే అసలు కారణం” అంటున్నారు సంయుక్త.

ఇవన్నీకాక వీరు ఎన్నికలు, జనాభాలెక్కలు, పేపర్లు దిద్దడంలాంటి ఎన్నో పనులు చేస్తారు. పనులు సులువుగా అప్పజెప్పేసే ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతుంది. రంగం ఏదైనా దోపిడీకి గురవుతున్నదీ, సమస్యల వలయంలో చిక్కుకుంటున్నదీ మహిళే. ఇలాంటి సమస్యలతో అటు కుటుంబానికీ, ఇటు వృత్తికీ న్యాయం చేకూర్చలేకపోతున్న మహిళా ఉపాధ్యాయుల నిస్సహాయత వెనుక దాగుంది ప్రభుత్వ అవగాహనా రాహిత్యమే. కనీస సదుపాయాలపై దృష్టిపెట్టక ఉత్తీర్ణతాశాతం పెరగాలనీ కోరుకోవడం ఏమంత న్యాయం? అంతర్జాతీయ మహిళాదినోత్సవం శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటోంది. కానీ మహిళల స్థితిగతులు వందేళ్ల క్రితం ఎలా వున్నాయో అలాగే వున్నాయి. చదువుల్లో, ఉద్యోగాల్లో, అనేక రంగాల్లో విజయాలను సాధిస్తూనే వున్నా... అంతకుమించి స్త్రీలపై దాడులు, వేధింపులు, అత్యాచారాలు, హింస పెరుగుతూనే వున్నాయి. వీటన్నింటినీ ఎదుర్కోవాలంటే ఒక్కటే మార్గం. “నడిచిందంటే గుమ్మంవరకే, నవ్విందంటే అధరంవరకే” అన్న మాటలను పక్కకుపెట్టి ఐక్యంగా పోరాటస్ఫూర్తిని అలవర్చుకోవడమే మహిళల తక్షణ కర్తవ్యం.

- కె. అరుణ

సరైన సదుపాయాలేవి?



- మోతుకూరి సంయుక్త,
ఎపియుటిఎఫ్ కోశాధికారి,
మహిళావిభాగం కన్వీనర్.

కొంతకాలం కిందట విశాఖలో ఒక కలెక్టరు పాఠశాల వున్నప్రాంతంలోనే ఉపాధ్యాయులు నివాసముండాలనే షరతు విధించారు. కానీ అది ఆచరణలో సాధ్యపడేదికాదు. పాఠశాలలు మారుమూల ప్రాంతంలో వుంటాయి. కానీ అవసరాలరీత్యా టీచర్ల కుటుంబాలు వేరేచోట నివాసం ఏర్పరచుకుని వుంటారు. పోనీ వచ్చినా సరైన సదుపాయాలు కల్పించే పరిస్థితులు లేవు. వారికి కనీస నివాసం దొరక్కపోగా... రాత్రుళ్లు పెంకులుతీసి దుండగులు వచ్చిన సందర్భాలు కొన్నయితే... స్నానంచేస్తుంటే సెల్‌తో ఫోటోలు, వీడియోలు తీసి బెదిరించిన సందర్భాలు మరికొన్ని! ఇక దొంగతనాలు, గ్రామస్తుల పెత్తనాలు చెప్పతరం కాదు. అటవీప్రాంతాల్లో నియమింపబడినవారు దారిదోపిడీలకు, బెదిరింపులకు లోనవుతున్నారు.

లాభాలు వారికి... రోగాలు వీరికి...

విశాఖ జిల్లాలో పెందుర్తి, గాజువాక ప్రాంతాలలో సుమారుగా 6 రొయ్యల కంపెనీలున్నాయి. చేపలన్నిటిలోకెల్లా శ్రేష్ఠమైన వాటిని పెద్ద పెద్ద కంపెనీలకు, జర్మనీ, జపాన్, అమెరికా, ఫ్రాన్సు వంటి దేశాలకు ఎగుమతి చేస్తారు. ఆక్వా పరిశ్రమ మంచి లాభాలతో ఉంది. ఇంతటి లాభాలు వచ్చిన పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళల బతుకులు మాత్రం చాలా అధ్వానంగా ఉన్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా, మహిళా దినోత్సవానికి 100 సంవత్సరాలు నిండినా స్త్రీలకు కనీస వేతనాలు, పనిభద్రత లేవు.

పెందుర్తి మండలంలో దేవి ఫిషరీస్‌లో సుమారు 80 మంది కాంట్రాక్టు మహిళలు పనిచేస్తున్నారు. వీరికి సంవత్సరం మొత్తంలో 3 నెలలు మాత్రమే పని ఉంటుంది. మిగిలిన రోజుల్లో ఏదో ఒక పనికెళ్లి కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరు ఈ కంపెనీలో సుమారుగా 15 సంవత్సరాల నుండి ఈ పని చేస్తున్నారు. ఇన్నేళ్ల నుండి పని చేస్తున్నారు కదా అని వాళ్ల ఆరోగ్యం, కటుంబ పరిస్థితి చాలా బాగుంది అనుకుంటే పొరపాటే. వాళ్లకు వచ్చే ఆదాయం చూస్తే రోజుకు 15 నుండి 20,30 రూపాయలు, ఎప్పుడో గానీ 100 రూపాయలు కూలి రాదు. ఉదయం 9 గంటల కల్లా గేటు దగ్గర ఉండాలి. 1.30 గంటల వరకు పని చేయాలి. అర్ధగంట మాత్రమే భోజన విరామం. తిరిగి 2 గంటల నుండి 7 గంటల వరకు పని చేస్తారు. రోజుకు కనీసం 7 గంటలు నిలబడే పని చేస్తారు. భోజన విరామం మాత్రమే వీళ్లకు విశ్రాంతి. 40 సంవత్సరాలు పైబడిన వారిని పనిలోకి తీసుకోరు.

వీళ్ల పని విధానం పరిశీలిస్తే...8 టేబుళ్ల దగ్గర పని ఉంటుంది. ఒక్కొక్క టేబుల్ దగ్గర నలుగురు నుండి 15 మంది దాకా ఉంటారు. వీళ్ల ముందర రొయ్యల బాక్సులు 6 కేజీల నుండి 50 కేజీల దాకా ఉంటాయి. వీటిని మగవాళ్లు తెచ్చివేస్తారు. కానీ లెక్కల దగ్గర కూడా మోసం ఉంటుంది. 6 కేజీలన్న దగ్గర 10 కేజీలు కూడా వేస్తారు. వీళ్లకు శ్రమదోపిడీ అక్కడే మొదలవుతుంది. రొయ్యల బుర్రలు (తలకాయలు) తీసివేస్తే 1 కేజీకి 2.30 నుండి 3 రూపాయల వరకు వస్తుంది. బుర్రలు తీసిన రొయ్యలకు గ్రేడింగ్ ఇస్తారు.

13 గ్రేడింగులంటే పెద్ద రొయ్యలు. 16, 17, 21 గ్రేడింగ్ రొయ్యల్లో ఇవి చిన్న, మధ్యగా ఉంటాయి. 21 సైజు రొయ్య చాలా చిన్నదిగా ఉంటుంది. పర్మినెంటు వర్కర్లు గ్రేడ్ చేసిన రొయ్యలు మళ్లీ వీళ్ల దగ్గరకు వస్తాయి. వాటికి పొట్టు లేక తోలు, తోకలు తీయాలి. పొట్టు తీసేటప్పుడు గ్లౌజులు ఇవ్వరు. గ్లౌజులు లేకపోవడం వల్ల చేతులకు ముళ్లు గుచ్చుకుని రక్తం కారుతుంది. ఐసులో ఉన్న రొయ్యలను 10 గంటల పాటు నిలబడి తిమ్మిర్లు పట్టిన చేతులతో శుభ్రం చేయడమంటే మాటలు కాదు. చాలా కష్టంతో కూడుకున్న పని. ఇంత కష్టపడినా కష్టానికి తగ్గ ఫలితం ఉందా అంటే అదీ లేదు. ఫీల్(నరాన్నితీయడం) తీయడం చాలా కష్టం. వలవడానికి ఒక కేజీకి 15 నిమిషాలు పడుతుంది. వీళ్ల పనిని చూస్తే ఎవరైనా అయ్యో పాపం అంటారు. ఏమ్మా చేతులకు గ్లౌజులు ఇవ్వాలి కదమ్మా అని అంటే "అవి వేసుకుంటే మనం రొయ్యల్ని వలవడం కష్టమవుతుంది" అని అన్నారు. అలాగే పని కూడా తొందరగా అవదని చెప్తున్నారు. అంటే యాజమాన్యం ఎంత తెలివిగా వీళ్లతో చాకిరీ చేయిస్తుందో మనకు అర్థమౌతుంది.

అలాగే వీళ్లకు సెలవులుగానీ, పిఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస సౌకర్యాలుగానీ లేవు. పనికి వెళ్తేనే జీతం లేకపోతే లేదు. ఇటువంటి పని మరి ఎందుకమ్మా చేయడం అని నర్సమ్మ అనే మహిళను అడిగితే "మా భర్తలు తెచ్చింది చాలడం లేదు. పైగా తెచ్చిన డబ్బులో సగానికి పైగా తాగుడుకు పోతుంది. మరి ఇంటిని ఎలా నడపాలి? ఏదో ఆ పని అలవాటైంది. వేరేపనికి వెళ్లలేను. కనుక ఈ పనికి వెళ్తున్నాను. ఉన్న నాడు ఉంటుంది లేని నాడు లేదు" అంటోంది.

వీళ్ల చేతులు, గోళ్లు నల్లగా కమిలిపోయి ఉంటాయి. సాయంత్రానికి కాళ్లు ఇంత లావుగా వాచిపోయి ఉంటాయి. పని ఎక్కువ ఉన్న నాడు వారానికి ఒక్క ఆయింటుమెంటు మాత్రమే ఇస్తారు. ఇక్కడ పని చేసే 80 మంది మహిళల్లో 10 మంది మాత్రమే ఈ కంపెనీలో పని లేకపోతే వేరే చోటుకెళ్లి పనులు చేసుకుంటారు. 15 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్నా ఇంతవరకు పర్మినెంటు చేయడం లేదు. వాళ్లు సంవత్సరాల పైగా అక్కడికి పనికి వెళ్తున్నారు. గట్టిగా 4 రోజులు పని చేస్తే ఇంకో 3 రోజులు పనికి పోరు. కారణం ఈ చేతుల నొప్పులు, నిలబడడం వల్ల కాళ్ల నొప్పులు, చేతుల తిమ్మిర్లు, కొంతమందికి ఆయాసం కూడా వస్తుంది. అలాగే కంపెనీ నుండి బయటికి వచ్చేసరికి ఒళ్లంతా నీచువాసన వస్తుంది. ఇంటి బయటి నుండే ఇంట్లో వాళ్లు కంపు, స్నానం చేయాలని చీదరించుకుంటారు. ఇన్ని చీదరింపులు, ఛీత్కారాల మధ్య వాళ్లు జీవనం సాగిస్తున్నారు. పీస్ రేట్ ప్రకారం పని. ఒకవైపు ఆకాశాన్నంటే ధరలు, మరోవైపు కూలి పెరగకపోవడం ఒక పూట తిని ఒక పూట తినక బతుకులు వెళ్ల దీస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కాంతం "మాకు సంవత్సరమంతా పని ఉండాలి. రేటు పెంచాలి" అని అన్నారు. గంగమ్మ మాట్లాడుతూ "మా చిన్నప్పటి నుండి మా వాళ్లు కష్టపడ్డారు. ఇప్పుడు మేం అదే కంపెనీలో పని చేస్తున్నాం. మా బతుకులు మాత్రం మారలేదు. కంపెనీ ఓనర్లు, కాంట్రాక్టర్లు బాగుపడుతున్నారు. కూలి పెంచమని అడిగితే పని మానెయ్యండని అంటున్నారు. గాజువాకలో చోహాన్ సీ ఫుడ్, వాణి సీ ఫుడ్, లిబర్టీ సీ ఫుడ్ కంపెనీలలో పని చేసే మహిళల పరిస్థితీ ఇదే.

ఏ రోజూ మహిళలకు హక్కులను ప్రభుత్వాలు, పాలకులు తమంతట తాముగా ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రతి హక్కూ మహిళలు పోరాడి సాధించుకున్నదే అని చరిత్ర రుజువు చేస్తోంది. తహక్కులను కాపాడుకోవడానికి, కొత్త సౌకర్యాలు పొందేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం మనకు స్ఫూర్తి కావాలి. మహిళలందరికీ భద్రత కలిగిన ఉపాధి చూపించడం, కనీస వేతనాలు అమలు చేయడం, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా మహిళలు తమంతట తాము నిలువగలిగే స్థితికి రావాలి. అదే నిజమైన సాధికారత అవుతుంది. ఆ స్ఫూర్తితో ఆక్వా పరిశ్రమలలో ఉన్న మహిళా కార్మికులు కనీస వేతనాల కోసం పిఎఫ్, ఇఎస్ఐ లాంటి సౌకర్యాల కోసం పని భద్రత కోసం, కంపెనీ యాజమాన్యాల అరాచకాలకు వ్యతిరేకంగా ఐక్యంగా విజయాలు సాధించే దిశగా మహిళలంతా కదలాలి.

- బి. ప్రభావతి

ఐద్వా రాష్ట్ర సహాయకార్యదర్శి

అమాయక ఆదివాసీలపై అత్యాచారాలా!

వేకువ జామే అయినా చలికాలం కావడంతో మంచు దట్టంగా కమ్మి చీకటి వీడలేదు. మాలో కొందరి బతుకుల్లో చీకటి కమ్ముకుంటోందని మాకు తెలీదు. 76 కుటుంబాలు ఉన్న మా చిన్న బల్లుగూడ పల్లెపై పోలీసు మూకలు విరుచుకుపడ్డారు. ఒక్కొక్క గడపలోకి ఐదారుగురు పోలీసులు వచ్చి తలుపులు పగుల గొట్టి ఇళ్లలోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న తట్టా బుట్టా, చెంబు కంచం, పెట్టే బేడా చేతికి దొరికింది దొరికినట్లుగా బయటికి విసిరికొట్టారు. మగవారిని, పిల్లలను ఈడ్చుకుపోయారు. బాలింతలను, చంటి బిడ్డలను సైతం వదలలేదు.

ఒకవైపు ఇళ్లలో నుండి బయటికి లాగేవాళ్లను లాగుతున్నారు. తన్నులు తింటున్న వారు తింటున్నారు. మరోవైపు పోలీసు మృగాల ఆకలి కోరలకింద నలిగిపోతున్న శరీరాలు మూగగా రోదిస్తున్నాయి. రామి, డొమిని, ముక్తా, బుట్టో బతుకులు చీకటి అయ్యాయి. ఇవి చాలవన్నట్లు బల్లుగూడ గ్రామం నుండి 9 మందిని మగపోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. వంతల రామికి మూడు నెలల పసికందుని, వంతల డొమినికి సంవత్సరం చంటి బిడ్డని తీసుకుపోయి కుముడ గ్రామంలో రోడ్డుపైన చీకటిలో వదిలారు. ఆడవాళ్లను లొంగదీసుకోవడం కోసం మగవాళ్లని ఊరు దాటించడం కోసం పసికందులను పావులుగా వాడుకున్నారు పోలీసులు. మానవత్వపు ఛాయలు లేని వీరిని పిల్లల ఆక్రందనలు కదిలించలేకపోయాయి.

జరిగిన అరాచకం నుండి పల్లె తేరుకోలేదు. దిక్కుతోచని స్థితి. మండల కేంద్రానికి 27 కిలోమీటర్ల దూరంలో ఉన్న బల్లుగూడ గాథ రెండురోజుల అనంతరం వెలుగులోకి వచ్చింది. దగాపడ్డ నా గిరిజనులను, నా గ్రామాన్ని సందర్శించేందుకు, పరామర్శించేందుకు ఒక్కొక్క సంఘం వస్తుంది.

వంతల డొమిని మాటల్లో: మాకు తెలుగైనా రాదు. వారు మాట్లాడుతున్నదేమిటో అర్థం కాదు. వీరంతా ఎందుకోసం వచ్చారో, ఎవరికోసం వచ్చారో! మాకు కోయ భాష తప్ప ఈ మనుషుల భాష తెలియడం లేదు. ఎప్పుడైనా వింటేగా అర్థం చేసుకోవడానికి.

వచ్చిన వారిలో మా జాతి వాడైన త్రినాథను చూసి బిక్కుబిక్కు మంటూ ఉన్న మేము వాడి మాటలతో కుదుట పడ్డాము. "మన కోసం గిరిజన సంఘం ఐద్వా నాయకులు వచ్చారు. మీకు ఎటువంటి భయమూ లేదు. వాళ్లు మనకు జరిగిన అన్యాయం గురించి తెలుసుకోవడానికి వచ్చారు. మీకు వచ్చిన ఇబ్బంది ఏమిటో చెప్పండి" అంటూ త్రినాథ్ తమ జాతి వారికి చెప్పాడు. (అప్పుడు ఇళ్లలో నుండి ఒక్కొక్కరుగా వచ్చి ప్రజాసంఘాల నాయకుల చుట్టూ చేరారు).

పగులగొట్టిన ఇంటి తలుపుల్ని, చెల్లాచెదురుగా విసిరేసిన సామాగ్రిని, పగిలిపోయిన పెట్టెలను వంతల డొమిని చూపించింది. తనతోపాటు అత్యాచారానికి గురైన మిగిలిన మహిళల ఇళ్లకు తీసుకెళ్లింది. వంతల రామి తనకు జరిగిన అన్యాయం, తన బిడ్డను తీసుకుపోయిన వైనం వివరించింది. మగవాళ్ళు, పిల్లలు అందరూ తమపై జరిగిన దాడి గురించి చెప్పారు. పోలీసులకు భయపడి పారిపోదాము అనుకుంటే అందుకు అవకాశం లేకుండా ఊరంతా పోలీసులు చుట్టు ముట్టారు. 'మీలో నక్సలైట్లు ఉన్నారు. ఎవరో వాళ్లు చెప్పాలి' అంటూ కొడుతూ హింసించారు. మాలో ఎవరూలేరని చెప్పినా తంతాం మాట్లాడకపోయినా తంతామంటూ ఇబ్బందులు పెట్టారు. 9 మంది మగవాళ్లను తీసుకుపోయారు. అందులో వంతరామి మరిది చిన్నయ్య ముంచింగి పుట్టులో చదువుకుంటున్నానని 9వ తరగతి అని తనకు స్కూల్ ఇచ్చిన గుర్తింపు కార్డు చూపినా వదలలేదు. తాను పండగ సెలవులకు ఊరు వచ్చానని చెప్పినా వదలలేదు. మా బిడ్డల్ని తీసుకుపోతుంటే అడ్డుకున్నాము. అడ్డుకున్న వారిని కొట్టారు. కాళ్లావేళ్లా పడ్డాం. అయినా ఫలితం లేకపోయింది. మగవాళ్లను ముంచింగి పుట్టు తీసుకుపోయారు. మా పిల్లల్ని చీకటిలో కుముడ రోడ్డులో వదిలారు. ఇక్కడ జరిగింది ఎవరికైనా చెబితే మీ మగవాళ్లను వదిలేది లేదు అంటూ బెదిరించారు. కేసు పెట్టేందుకు ఎలా వచ్చేది అక్కా! అంటూ ప్రశ్నించారు. మాకు శుద్ధి జరగలేదు. ఇళ్లలోకి మమ్మల్ని ఇంకా రానివ్వలేదు. గ్రామంలో ఏ ఇంటి నుండి మేము తీసుకోవడం గానీ, మా చేతుల మీదుగా ఏమీ ఇవ్వడం గానీ జరగకూడదు. వెలి బతుకె అయింది మాకు.

ఎందుకీ నిర్బంధం? ఎందుకీ దాడులు?

గిరిజన ప్రాంతాన్ని ప్రభుత్వం క్రమక్రమంగా నిర్బంధంలోకి తీసుకుంటోంది. దీనికి కారణం విశాఖ మన్యంలో విలువైన బాక్సైట్ నిక్షేపాలు వుండడమే. ఈ నిక్షేపాలను విదేశీ సంస్థలకు అప్పగించేందుకు, మంచి ఊడిగం చేసే ప్రభుత్వం అనిపించుకోవడానికి ఇప్పటి నుండి గిరిజనుల గొంతు నొక్కుతోంది ఈ ప్రభుత్వం. ఎన్నో వీరోచిత పోరాటాల ద్వారా గిరిజనులు సాధించుకున్న 1/70 చట్టాన్ని ప్రభుత్వం తన కాలికింద చెప్పులాగా తొక్కిపెడుతుంది. ఇందుకు సాక్ష్యం బాక్సైట్ హియరింగ్‌ని నిర్బంధంలో నిర్వహించడమే. హియరింగ్ సందర్భంగా గిరిజనుల గ్రామాలన్నింటినీ పోలీసులతో నింపింది. అడుగడుగునా సాయుధులైన పోలీసులు, గిరిజన గ్రామాలకువెళ్లి బస్సులన్నీ నిలిపివేశాయి. ప్రతి వాహనాన్ని, ప్రతి వ్యక్తినీ తనిఖీ చేశారు. మాట్లాడే గొంతులకు తుపాకులు ఎక్కుపెట్టిన వాతావరణం సృష్టించింది ప్రభుత్వం. ఇక బాక్సైట్ తవ్వకాలపై నిర్భయంగా మీ అభిప్రాయాలు చెప్పమంటే గొంతు పెగిలేనా? గుండె చప్పుడు వినిపించేనా? ప్రభుత్వమే ఇంత అరాచకం చేస్తే ఈ ప్రభుత్వ యంత్రాంగంలో

భాగమైన పోలీసుల అరాచకానికి హద్దు ఎక్కడ ఉంటుంది?

ప్రభుత్వం గిరిజనుల పట్ల దాడులను చిత్తశుద్ధితో పరిష్కరించడం లేదు. నల్లగొండ, వరంగల్, వాకపల్లిలో మహిళలపైన సిఆర్‌పిఎఫ్ పోలీసులు కానీ, గ్రేహాండ్స్ దళాలు కానీ అత్యాచారాలకు పాల్పడినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించిన దాఖలాలు చాలా తక్కువ. ఏ ఒక్క కేసులోనూ బాధితులకు న్యాయం జరగలేదు. వాకపల్లి ఘటన విచారణలో బాధిత మహిళల్ని దోషులుగా నిలబెట్టారు. జరుగుతున్న ప్రతి సంఘటనకు ప్రభుత్వం నక్సల్స్ ముద్ర వేస్తోంది. నిజాలను వెలికి తీయాల్సిన ప్రభుత్వం వాటికి మరుగుపరుస్తోంది. ప్రభుత్వానికి నక్సల్స్‌కి మధ్య అమాయక గిరిజనులు బలౌతున్నారు. ఈ చర్యలతో ప్రజాస్వామిక హక్కులపై దాడి చేయబూనుకుంటుందీ ప్రభుత్వం.

ఐక్యమైన మహిళా సంఘాలు

గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై అన్ని మహిళా సంఘాలూ ఒక వేదిక మీదకు వచ్చాయి. ఇది అన్యాయం, దోషుల్ని కస్టడీలోకి తీసుకోవాలి, జుడిషియల్ ఎంక్వయిరీ జరిపించాలి. ఈ ఘటనలో ప్రభుత్వం సుమోటాగా

వ్యవహరించి కేసు నమోదు చెయ్యాలి. ప్రజాస్వామిక హక్కులపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు చేపట్టాలని గొంతెత్తి నినదించాయి. మారుమూల గిరిపల్లెలో జరిగిన అరాచకాన్ని దాడులను రాష్ట్రం నలుమూలలా వినిపించే కృషి చేశాయి. ప్రజాస్వామిక వాదుల, అభ్యుదయవాదుల సంఘీభావాన్ని కూడగట్టాయి.

ప్రభుత్వ స్పందనలో చిత్తశుద్ధి కొరవడింది

కేసులు నమోదు చేస్తున్నట్లుగా ప్రకటించింది. జుడిషియల్ ఎంక్వయిరీ జరిపించేందుకు చర్యలు చేపడతామని హామీ వచ్చింది. కంటితుడుపు చర్యగా ఘటన జరిగిన ఆరు రోజుల తరువాత బాధిత మహిళల్ని పరీక్షలకు తీసుకువచ్చారు. టెస్టులకు వచ్చిన మహిళలతో పోలీసులు "మీరు టెస్టులు చేయించుకుంటే మీ భర్తలు మిమ్మల్ని, పిల్లల్ని వదిలేస్తారు ఇక మీకు ఇబ్బందులే" అంటూ పోలీసులు భయపెట్టారు. దాంతో కిల్లో బుట్టో టెస్టు చేయించుకోకుండా వెనుదిరిగి బల్లుగూడ వెళ్లిపోయింది. మిగిలిన వారికి తూతూ మంత్రంగా టెస్టుల ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పటి వరకు ఈ కేసు అంగుళం ముందుకు నడిస్తే ఒట్టు.

మహిళలు, పిల్లలపై జరుగుతున్న దాడులు, హింసపై ప్రజాసంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలి. ప్రభుత్వ చర్యలను చీల్చిచెండాడాలి. మేధావులు, కార్మికులు, ఉద్యోగుల సంఘీభావాలను కూడగట్టాలి. గిరిజనులు తమ హక్కులను, సంపదను కాపాడుకోవడానికి జరిపే ఉద్యమాల్లో అండగ నిలవాలి.

-నదీ (విశాఖ)

మరో వాకపల్లి

విశాఖ మన్యంలో బల్లుగూడ
మరో వాకపల్లి అయింది
నల్లగొండ, వరంగల్ జిల్లాలో
నా గిరిజన చెల్లెలు చేరచబడ్డ జాబితాలో
నేనూ చేర్చబడ్డానంటోంది
ఒకప్పటి నా గిరిజన పల్లె
చుట్టూ పచ్చని ప్రకృతి
పలకరించె కొండలు
లయబద్ధంగా ప్రవహించే సెలయేళ్లు
కలసి సహజీవనం సాగించె వన్యప్రాణులు
కాలానుగుణంగా పండుగలు
ఆహ్లాదకరంగా ఆట పాటలు
సహజ సిద్ధమైన ఆహారపు అలవాట్లు
మరి నేడో...
బాక్సైట్ తవ్వకాల నిర్ణయాలు మా బతుకుల్ని
నాశనం చేయాలని చూస్తే
టూరిజం మా జీవితాలపై విష సంస్కృతిని
వెదజల్లి పోతుంటే
కరువు ఆకలి చావుల రూపంలో
మమ్మల్ని వెన్నంటుతుంటే
ఇవేవీ చాలవన్నట్లు
వాడి బాబుగాడి సొమ్మేదో ఇక్కడ దాచినట్లు
మా కర్ర శరీరాలను సైతం
వాడి ఆకలి కోరలతో జుర్రేసి
నా గూడెం బతుకుకు నన్ను దూరం చేసి
నా చెట్టూ చేమ, పిల్లా మేకా, పెద్దా చిన్నా
క్రూర మృగమైనా సరే
అంతకంటే క్రూరమైన మానవ మృగాన్ని
నేనంటూ పోలీసు బూటు
నా గిరిజన పల్లె గుండెను తన్ని
వికటాట్టహాసం చేస్తోంది.
అందుకే
ఈ ప్రభుత్వం మాపై సృష్టిస్తున్న
అరాచకానికి వ్యతిరేకంగా
అమాయకపు మా జీవితాలపై
జరుపుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా
మా పల్లెలపై నిర్బంధానికి వ్యతిరేకంగా
ఇలా గిరిపడుచుల జీవితాలు
ఎంతకాలం ఇంకెంత కాలం అంటూ
స్వేచ్ఛా వాయువుల కోసం
నేను మమేకమైన నా ప్రకృతిని సైతం
వెంటేసుకుని పోరాడుతా
నా పల్లె మునుపటి స్థితి కోసం
ఛిద్రమైన నా బతుకు భద్రం కోసం.

-బి.ప్రభావతి



నర్సుల సేవలకు గుర్తింపేదీ...

అప్పుడే వచ్చిన అంబులెన్స్‌లోంచి ఒక వ్యక్తిని వార్డులోకి తీసుకొచ్చారు. అక్కడున్న పడకపైన పడుకోబెట్టారు. ఇది ఆస్పత్రుల్లో ప్రతిరోజూ సహజమే కదా! అన్పించవచ్చుగానీ ఈ సందర్భం వేరు. ఎందుకంటే అక్కడికి తీసుకొచ్చిన వ్యక్తి మామూలు పేషెంట్ కాదు. ఒళ్లంతా 90 శాతం కాలిపోయింది. చూసేందుకు జుగుప్సాకరంగావుంది. దుర్వాసన వస్తోంది. కొన ఊపిరితో ఉన్న ఆ వ్యక్తి నరకయాతన అనుభవిస్తున్నాడు. అతని దగ్గరకు వచ్చేందుకు, కుటుంబ సభ్యులు, బంధువులు కూడా భయపడుతున్నారు. డాక్టర్లు కూడా దూరంగా నిలబడి నర్సులకు సూచనలిస్తున్నారు. ఆ భయానక దృశ్యాన్ని చూడలేక అక్కడున్నవారంతా బయటికి వెళ్లిపోయారు. కానీ నర్సులు మాత్రం అక్కడే ఉన్నారు. మెత్తని దూదితో అతని శరీరాన్ని శుభ్రం చేస్తున్నారు. అతన్ని బతికించే ప్రయత్నంలో భాగంగా చికిత్స చేస్తున్నారు. నర్సులకు వృత్తిపరమైన సమస్యలేమిటో, వారిసేవలు ఎలా ఉంటాయో తెలుసుకునేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో కలిపి దాదాపు 28000 మంది నర్సులున్నారు. వేతన చెల్లింపుల్లో, సౌకర్యాల కల్పనలో, పదోన్నతుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల వీరు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇవేగాక సిబ్బంది కొరత, అధిక పనిభారం, అభద్రత, వేధింపులు, దాడులు లాంటి వృత్తిపరమైన సమస్యలు ఎదురౌతున్నాయి. “రోగులను మేమెప్పుడూ నిర్లక్ష్యం చేయం. దగ్గరుండి సేవలు చేస్తాం. మందులిస్తాం. ఇంజక్షన్లిస్తాం. కానీ ఎంత చేసినా కొన్నిసార్లు రోగికి ఏదైనా జరిగితే అందుకు కారణం మేం కాకపోయినా ఇబ్బందులు మాత్రం మాకే ఉంటాయి” అంటున్నారు ఉస్మానియా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ నర్సు. రోగులు కోలుకోకపోయినా, వారు చనిపోయినా అందుకు కారణం నర్సులేనని చాలా సందర్భాల్లో రోగుల బంధువులూ, రాజకీయ నాయకులూ వారి మీద నెపం మోపుతుంటారు. దాడులకు పాల్పడుతుంటారు. ఆ సమయంలో స్పందిస్తే తమకేదైనా ముప్పు ఉంటుందేమోనన్న ఉద్దేశంతో డాక్టర్లు కూడా ప్రేక్షక పాత్ర వహిస్తుంటారు. అటు డాక్టర్లకూ, పేషెంట్లకూ, ఇటు రాజకీయ నాయకులకూ, బంధువులకూ మధ్య నర్సులు బాధితులుగా మారుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో, ఏజెన్సీల్లో పనిచేసే నర్సులు ఊరూరా తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులు బాగోగులు తెల్సుకోవాలి. కొన్నిసార్లు వీరికి రాజకీయ నాయకుల నుంచీ, ప్రజల నుంచీ ఇబ్బందులు ఎదురౌతాయి. ఆస్పత్రుల్లో సిబ్బందిపైన దాడులు నిరోధించేందుకు ప్రభుత్వం సెక్యూరిటీ ఏర్పాటు చేస్తానని చెప్పినా ఆచరణలో అమలవట్లేదు. ఎలాంటి శిక్షణాలేని ఒకరిద్దరు గార్డుల్ని మాత్రం కాపలా పెడుతోంది.

రాష్ట్రంలోని ఏ ప్రభుత్వాసుపత్రిలోనూ నర్సులకు సరైన సౌకర్యాలు లేవు. ఉన్నవి ఏమాత్రమూ సరిపోవట్లేదు. చాలా ఆస్పత్రుల్లో డ్రెస్సింగ్‌రూములు, టాయ్‌లెట్‌లు, విశ్రాంతి గదులు లేవు. ఇవేగాక అవసరమైన స్టేషనరీ, రక్షణ పరికరాలు లేక నర్సులు అవస్థలు పడుతున్నారు. “కొన్నిసార్లు పేషెంట్లకు సరిపోను మందులు, గ్లూకోజ్‌లు మావద్ద లేకపోతే దానికీ మేమే కారణమనుకుని పేషంట్లు మాతో గొడవకు దిగుతారు. ప్రభుత్వం చేసే పనికి మేం బలవుతున్నాం” అంటోంది పిహెచ్‌సి పరిధిలో పనిచేసే నర్సు లావణ్య. అనారోగ్యం కారణంగా తాము రెగ్యులర్‌గా వెళ్లే గ్రామాలకు వెళ్లకపోయినా అక్కడి రాజకీయ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తారని, సస్పెండ్ చేయిస్తామని బెదిరిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పై అధికారుల నుంచీ, డాక్టర్ల నుంచీ, రాజకీయ నాయకుల నుంచీ నర్సులకు వేధింపులు తప్పట్లేదు. ఆస్పత్రుల్లో తమ రక్షణకోసం ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని నర్సులు కోరుతున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా సిబ్బందినిగానీ, ఆస్పత్రుల సామర్థ్యాన్నిగానీ పెంచట్లేదు. రాష్ట్ర రాజధానిలోని ఉస్మానియాలో పెరిగిన పేషంట్ల సంఖ్యకు అనుగుణంగా ప్రస్తుతం 1200 మంది అవసరం కానీ, అక్కడ 312 స్టాఫ్ నర్సులు, 67 మంది హెడ్ నర్సులు, ఇద్దరు గ్రేడ్-1 నర్సులు మాత్రమే ఉన్నారు. గాంధీ ఆస్పత్రిలో ప్రతిరోజూ 1500 మంది అడ్మిటైన పేషెంట్లు ఉంటారు. ఇన్‌పేషంట్లకు సేవలందించాలన్నా కనీసం 800 మంది నర్సుల అవసరం ఉంటుంది. కానీ ప్రస్తుతం అక్కడ 210 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో కాంట్రాక్టు సిబ్బంది కూడావుంది. ప్రస్తుతం గాంధీలో, ఉస్మానియాలో ఒక్కో నర్సు 65 నుంచి 70 మంది వరకూ సేవలందిస్తున్నారు. జిల్లా ఆస్పత్రుల్లో 30 నుంచి 45 మధ్య ఈ సంఖ్య ఉంటోంది. సరిపోను సిబ్బంది లేకపోవడంవల్ల ఉన్న సిబ్బందిపైనే ఈ విధమైన అదనపు భారం పడుతోంది.

రాష్ట్రంలో మూడేళ్ల నుంచి నర్సింగ్ రిక్రూట్‌మెంట్లు ఆపేశారు. ఇప్పటికిప్పుడు 2000 పోస్టులు అత్యంత అవసరమున్నవి. వాటిని భర్తీచేస్తేనైనా తమకు పనిభారం తగ్గుతుందనీ, వెంటనే ఆ పనిచేయాలనీ నర్సులు కోరుతున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి అదనపు భారం కూడా పడదు. ఎందుకంటే అవి గతంలో ఉన్నపోస్టులే. ఐఎమ్‌సి నామ్స్ ప్రకారం నర్సులకు ప్రత్యేకమైన డైరెక్టరేట్ ఉండాలి. ప్రత్యేక నిబంధనలు రూపొందించాలి. కానీ ఇవేవీ ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. దీనివల్ల అధికారుల, డాక్టర్ల అధిపత్యంలో నర్సులు పలురకాల ఇబ్బందులు పడాల్సొస్తోంది. నర్సులు సక్రమంగా విధులు నిర్వహించాలంటే అందుకు తగిన పరిస్థితులూ, ఆ విధమైన వాతావరణం కూడా కల్పించాలి. కానీ పని ఒత్తిడితో, సౌకర్యాల లేమితో, వేతనాల కోతలతో ప్రభుత్వం నర్సుల్ని మానసిక ఒత్తిడికి గురిచేస్తోంది. చివరికి అది వాళ్ల ఆరోగ్యాలపైనా ప్రభావం చూపుతోంది. దీనివల్ల కొందరు ముందుగానే ఉద్యోగానికి స్వస్తి పలకాల్సి వస్తోంది. అలాంటప్పుడు వారికి అదనపు బెనిఫిట్స్ ఏవీ రావట్లేదు.

కాంట్రాక్టు నర్సుల పరిస్థితి మరీ దారుణం. వీరికి పనిచేసిన కాలానికే వేతనం చెల్లిస్తారు. అది కూడా రెగ్యులర్‌గా ఇవ్వరు. పైగా అదనపు పనిభారంతో అవస్థలు పడుతున్నారు. అనారోగ్యంపాలై మానేస్తే ఆదుకునే నాదుడే లేడు. పనిచేస్తున్నంత కాలం చాలీ చాలని వేతనాలతో జీవిస్తున్నారు. ఆరోగ్య, ఇతర కారణాలవల్ల దీర్ఘకాలికంగా పని చేయలేకపోయినప్పుడు ఆ కాలానికి వేతనం రాక వీరు దుర్భర బతుకులు గడపాల్సి వస్తోంది.

జనసామాన్యంలో వీరికి గుర్తింపు లభిస్తున్నా అది పూర్తిస్థాయిలో లేదు. ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం ఒక కారణమైతే, సౌకర్యాలలేమితో పేషెంట్లకు నయంగాకపోతే ఆ నెపాన్ని నర్సులపైకి నెట్టే తప్పుడు ప్రచారం మరొకటి. “పదిహేనేళ్లక్రితం (మే,12) 'నర్సింగ్ డే' సందర్భంగా నర్సులకు సమావేశాలు పెట్టేవారు. గవర్నర్ చేతులమీదుగా అవార్డులూ, ప్రశంసా పత్రాలూ ఇచ్చేవారు. అధికారుల ద్వారా ప్రోత్సహం, గుర్తింపు లాంటి మాటలు ఏడాదికొక్కసారైనా వినబడేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కూడా లేదు. సేవాభావంతో పనిచేసే నర్సుల కృషిని గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహమిచ్చి, సౌకర్యాలు కల్పించినప్పుడే అంతర్జాతీయ మహిళాదినోత్సవానికి సార్థకత చేకూరుతుంది.

- జావెద్

వీరి కష్టాలు గట్టెక్కేదెన్నడో...

కోడి కూయకముందే లేచి.. చీకట్లో పరుగులాంటి నడకతో వడివడిగా పోతోంది ఎల్లమ్మ...

"భవానీ... లేయే.. నేను పనికి పోతన్నా.. అన్నం, రాత్రి తెచ్చిన కూరలు, చింత తొక్కేసి పోరగాళ్లకు పెట్టి, నువ్వూ తినే.. ఆ సుశీలమ్మగోరి వాకిలి ఊడ్చి ముగ్గేసిరా...." అంటూ కూతుర్ని లేపి, జుట్టు ముడేసుకుంటూ పరుగులు తీస్తోంది వెంకటమ్మ...

పుట్టి పెరిగిన ఊరిని, అయినవాళ్లని వదిలి పొట్టచేత పట్టుకొని, పనికోసం పట్టణాలకు వలస వచ్చారు ఎల్లమ్మ, వెంకటమ్మలాంటి ఇంటిపనివాళ్లు. గ్రామాల్లో పంటలు పండక, పనిదొరక్క పిల్లల్ని పస్తులతో ఉంచలేక బతుకుబాట పట్టారు. పాచిపనులు చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఉద్యోగినుల శ్రమను పంచుకుంటూ వారు ఉద్యోగాల్లో నిమగ్నమై పనిచేయడానికి తోడ్పడుతున్నారు. ఉండటానికి ఇల్లు లేక, స్థలానికి అద్దెకట్టుకుంటూ.. చిన్న గుడిసె వేసుకొని మురుగు, దోమలతో సహజీవనం చేస్తున్నారు. రోగం వస్తే దవాఖానాకు పోలేరు. సెలవు పెడితే జీతంలో కోతే. ఎలాంటి చట్టాలూ, రక్షణ సౌకర్యాలూ లేవు. ఇల్లిల్లూ తిరిగి పనిచేసేప్పుడు వేధింపులకు గురవుతున్నారు. ఇన్ని బాధలను దిగమింగుకుని బతుకీడ్వలేక ఐద్వా అనుబంధ సంఘమైన 'స్నేహ' ఇంటిపనివారల సంక్షేమ సంఘంలో చేరి పోరాడి కొన్ని సాధించుకున్నారు. అవి ఎంతవరకు అమలవుతున్నాయి? ప్రస్తుతం వాళ్ల ఇబ్బందులేమిటో వాళ్ల మాటల్లోనే....

కార్డులివ్వాలి.. శోభ (35), దోమలగూడ.

నాకు 15 ఏళ్లప్పటి నుండి ఇళ్లల్లో పనిచేస్తున్నాను. మా కుటుంబ బాధ్యత అంతా నేనే చూసుకుంటాను. మా అమ్మ మందులకు చానా డబ్బులు ఖర్చవుతాయి. నాన్న మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు. నాకు ఇద్దరు చెల్లెళ్లు, ఒక అన్న, ఒక తమ్ముడు. చెల్లెళ్లు చానా చిన్నోళ్లు. ఇంట్లోనే ఉంటారు. అన్న మూగోడు. వాడూ ఏమీ పనిచేయడు. తమ్ముడు మైండ్ సరిగా ఉండదు. వాడ్ని పసిపిల్లవాడ్ని సాకినట్లు సాకాలి. వీళ్లందరి అవసరాలకోసం నేను సంపాదించాలి. అందుకే పదిళ్లు ఒప్పుకున్నా. పొద్దుగాల మొదలెడితే మళ్లీ పొద్దు పోద్ది. మధ్య మధ్యలో ఒకటి రెండుసార్లు ఇంటికెళ్లి వస్తా. తినడానికి టైముండదు. నేను పనిచేసే ఇళ్లల్లో ఒకరిద్దరు అమ్మగార్లు చానా మంచోళ్లు. నా బాధను అర్థంచేసుకుంటారు. వాళ్లు వండుకున్నవి వేడివేడిగా పెట్టి తినమని కేకలేస్తారు. ఒక గంట ఆలస్యమైతే కోపం చేస్తారు కొందరు. అలాంటివాళ్లకి ముందే వెళ్లి పనిచేస్తాను. ఎవరేమైనా పెడితే బాక్సుల్లో పెట్టుకొని, ఇంటికి పట్టికెళతా. మాకు గుర్తింపుకార్డు ఇస్తే బాగుంటుంది. ఏదైనా రోగమొచ్చినా దవాఖానాకు పోవాలంటే చానా డబ్బులవుతున్నాయి. ఆ కార్డు మీదే మాకు వైద్యం కూడా ఉచితంగా చేస్తే బాగుంటుంది.

ఇల్లు ఇస్తే బాగుండు.. లక్ష్మి (41), జమిస్తాన్‌పూర్.

సుమారుగా 21 ఏళ్ల నుండి పనిచేస్తున్నా. నా బిడ్డకు మూడో నెల జొరబడుతున్నప్పుడు చనిపోయాడు నా మొగుడు. ఒక్క రూపాయి వెనకెయ్యలేదు. కూతుర్ని ఆడబిడ్డ కొడుక్కే ఇచ్చి పెళ్లి చేశా. చాలా అప్పయ్యింది. ఒక పక్కన ఇంటికి నెలకు 700ల రూపాయలు అద్దె కట్టాలి. కొడుకు ఒక్కచోట స్థిరంగా పనిచేయడు. ఇంట్లోకి రూ.2000లతో సరిపుచ్చుతున్నా. అన్నమొకటే వండుతా. పనిచేసే చోట ఇచ్చిన పచ్చళ్లతోనో, కూరలతోనో సరిపెడుతున్నా. కాళ్లు, చేతులు బాగా వాచి పుళ్లు పడ్డాయి. ఈ మధ్య నడుం నొప్పి, కాలు నొప్పి విపరీతంగా ఉంటుంది. అందుకే మూడిళ్లలో పనిమానుకుని, ఈ మధ్యనే ఒక పేపరు ఆఫీసులో చేరా. అక్కడ ఉదయం ఆరు నుండి 10 గంటల వరకూ పనిచేస్తా. అక్కడ ఒక ఫ్లోరంతా ఊడ్చి, తుడవాలి. నెలకు రూ.1800 ఇస్తున్నారు. రెండిళ్లల్లో ఐదు గంటలు పనిచేస్తా. అక్కడ రూ.800 ఇస్తున్నారు. మాబోటోళ్లకు గవర్నమెంటు ఇల్లు ఇస్తే బాగుంటుంది. ఆరోగ్యం బాగోపోతే ఏదో ఒక గోలీ వేసుకొంటాను. పనిచేసే చోట ఆ అమ్మగార్లు ఇచ్చే మందులేసుకుంటాను. దవాఖానాకు వెళితే చాలా ఖర్చవుతుంది. అందుకే పోను.

ఇఎస్ఐ, పిఎఫ్ మాకూ ఇవ్వాలి..

కాసియా (24), జవహర్‌నగర్.

నాకు చిన్నప్పుడే పెళ్లి చేశారు. మా ఆయన పళ్లు, ఉల్లిపాయల్లాంటివి అమ్ముతూ ఉంటాడు. కానీ డబ్బులు ఇంట్లో ఇవ్వడు. ఇంట్లో అవసరాలేమీ పట్టించుకోడు. 30 వేల అప్పు ఉంది. ఒకనెల్లో కొంత కట్టినా, మరో నెల్లో మళ్లీ అప్పు చేయాల్సి వస్తోంది. ఆ అప్పు తీరే దారి కనపడటం లేదు. ఇల్లు గడవడానికి నేను మూడేళ్ల నుండి ఇళ్లల్లో పనిచేసుకుంటున్నా. పిల్లలు ముగ్గురు ఇస్కూలుకు వెళుతున్నారు. వాళ్లకు ఫీజులు కట్టుడూ అన్నీ నేనే చూసుకుంటా. మా అత్తగారి ఇంటిపైన రేకుల గదిలో వుంటున్నా. అద్దె లేదుగానీ, కరెంటుకు నెలకు రూ.300 కట్టాల్సి వస్తోంది. ఎండాకాలం, వానాకాలం చానా అవస్థగా ఉంది. పెద్దగాలొస్తే ఆ రేకులు ఎగిరిపోతాయి. పిల్లల ఫీజులకు నెలకు రూ.1000 కట్టాల్సి వస్తోంది. ఫీజులకు ఇబ్బంది అవుతుందని మూడిళ్లు మానేసి పేపరు ఆఫీసులో సంవత్సరం కింద చేరాను. అక్కడ నెలకు రూ.1800 ఇస్తున్నారు. నాలుగు గంటలు పనిచేస్తున్నా. రెండిళ్లలో రెండు గంటలు పనిచేస్తా. అక్కడ రూ.900 వస్తాయి. నడుం, చేతులు బాగా నొప్పి. ఆఫీసు వాళ్లే వైద్యశిబిరం పెడితే అక్కడ చూపించుకుని కాగితం రాయించుకున్నా. ఇంక ఎప్పుడు నొప్పొచ్చినా ఆ చిట్టీనే మెడికల్ షాపుకు పట్టికెళ్లి గోలీలు తెచ్చుకొని, వేసుకుంటా. దవాఖానాకు పోవాలంటే చానా డబ్బులవుతున్నాయమ్మా. ఇఎస్ఐ, పిఎఫ్ మాకూబీ ఇస్తే బాగుంటుంది. పెద్ద పెద్ద రోగాలు వస్తే ఎట్టాగో అని భయం పట్టుకుందమ్మా. పిల్లలకు రోగాలొచ్చినా మెడికల్‌షాపులో గోలీలు అడిగి వేస్తాను. దవాఖానాకు పోనమ్మా.

వేతనాలు అమలు చేయడం లేదు : శంకరమ్మ (33), రాంనగర్.

నాకు ముగ్గురు పిల్లలు. మా ఆయన రోజుకూలికి పోతాడు. ఒకరోజు పని దొరికితే ఇంకోరోజు దొరకదు. అందుకే ఇన్నిళ్లల్లో పని తప్పక చేయాల్సొస్తుంది. నేను స్నేహ ఇంటిపనివారం సంఘంలో చేరాను. మేమంతా కలిసి పోరాడితే వేతనాలు, గుర్తింపుకార్డులు వచ్చాయి. ఆ 'గుర్తింపు కార్డులేమన్నా గవర్నమెంటు ఇచ్చినవా? నీదేమన్నా గవర్నమెంటు నౌకరీనా? ఏడ్చావులే.. నీకిష్టమైతే పనిచేయి. లేకపోతే మానుకో' అంటున్నారు యజమానులు. వేతనాలు కూడా నిర్ణయించిన ప్రకారం కాకుండా వాళ్లిష్టమొచ్చినట్లే ఇస్తున్నారు. గంట ఆలస్యమైతే 'ఆలస్యంగా వస్తే ఎలా? నాకు ఆఫీసుకు లేటవదా? ఎన్నిసార్లు చెప్పాలి?' అంటూ కసురుకుంటారు తప్ప 'వంట్లో బాగోలేదా శంకరమ్మా?' అని ఒక్కనాడూ అడగరంటూ ఆవేదనతో చెప్పింది. మాకు గుర్తింపుకార్డులు గవర్నమెంటోళ్లు ఇవ్వాలి. యజమాని పేరు, మా పేరు లేబర్ ఆఫీసులో రిజిష్టర్‌లో రాస్తే ఏమైనా ఉపయోగం ఉంటుంది. లేకపోతే తెల్లారి లెగిస్తే ఆ ఇంట్లో పనిచేస్తేనే మాకు పూట గడిసేది. అలాంటిది వాళ్లతో మాకు తగువులెందుకు? మా బాధను ఆళ్లు కూడా అర్థం చేసుకోవాలా. నీళ్ళొసుకున్నప్పుడూ పరుగు పరుగున వెళ్లేదాన్నమ్మా. అలా వెళితేనే ఎనిమిదిళ్లు పూర్తి చేసుకుని ఇంటికి మధ్యాహ్నం 2-3 మధ్య చేరేది. నాలుగిళ్లకు సాయంకాలం కూడా పనికిపోతాను.

'మీకొక సంఘముందని, అది కొన్ని డిమాండ్లు సాధించుకుందని తెల్సా' అని అడిగితే.. 'తెలియదమ్మా. ఇప్పుడు నువ్వు జేర్పిస్తే జేరతామమ్మా' అని మిగిలిన ముగ్గురూ బదులిచ్చారు.

- శాంతిశ్రీ

ఆకాశంలో సగం...

అయినా తప్పని వివక్ష

ఆకాశంలో సగం. కుటుంబమనే బండికి రెండు చక్రాల్లో ఒకరు. యుద్ధం నుంచి కరువు వరకూ ఏ సంక్షోభం వచ్చినా ముందుగా ఇబ్బందిపడేది వారే. అందరికంటే ముందు లేచేది, చివరిగా తినేది, పడుకునేది వారే. వారెవరనేది ఇప్పటికే అర్థమై ఉంటుందనుకుంటా. వారే కుటుంబంలోనూ, సమాజంలోనూ బహుముఖ పాత్ర పోషిస్తున్న మహిళలు. అది అభివృద్ధి చెందిన దేశమైనా, నిరుపేద దేశమైనా ప్రపంచవ్యాప్తంగా వారి పరిస్థితిలో పెద్దగా తేడా లేదనే వాస్తవాలను పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

ఐక్యరాజ్యసమితి 62 రెండేళ్ళ క్రితం మానవహక్కుల డిక్లరేషన్ ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకూ జరిపిన అధ్యయనంలో పలు అంశాలు వెల్లడయ్యాయి. 'మానవులందరూ స్వేచ్ఛగా జన్మించారు. వారందరూ గౌరవం, హక్కుల విషయంలో సమానులే' అని ఆ డిక్లరేషన్‌లో వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళల పట్ల వివక్షాపూరితంగా ఉన్న చట్టాల్లో చాలా నామమాత్రంగా మాత్రమే ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, లాటిన్‌అమెరికాల్లో రద్దు చేశారు. సోవియట్ యూనియన్‌లో అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా మహిళలు పురోగమించారు. చివరికి అంతరిక్షానికి కూడా వెళ్ళి వచ్చారు. అయితే అక్కడి సోషలిస్టు వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో వారు సాధించిన విజయాలన్నీ వెనక్కుమళ్ళాయి. బాలికలు, మహిళలు బిచ్చమెత్తుకోవడం లేదా వ్యభిచార కూపంలోకి నెట్టబడ్డారు. కాగా భారత్, మలేషియా వివాహం పేరిట జరిగే అత్యాచారానికి సంబంధించిన నేర చట్టాన్ని రద్దు చేశాయి. భార్య అక్రమ సంబంధాలు కలిగి ఉన్న ప్రత్యేకమైన పరిస్థితుల్లో భర్త ఆమెకు చంపవచ్చునే చట్టాన్ని హైతీ రద్దు చేసింది. కుటుంబ పెద్దగా పురుషుడు ఉండాలనే చట్టాన్ని దక్షిణకొరియా రద్దు చేయగా, కనీస వివాహ వయస్సు బాలురకు 14, బాలికలకు 12గా నిర్దేశించిన వివక్షాపూరిత చట్టాన్ని కొలంబియా తొలగించింది. అత్యాచారం జరిగినట్లు రుజువుకావాలంటే నలుగురు ముస్లిం పురుషులు సాక్ష్యం అవసరమని సూచించడాన్ని పాకిస్తాన్ రద్దు చేసింది. ఇవన్నీ సముద్రంలో నీటిబొట్టు మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా మహిళల లైంగిక వివక్షను తొలగించేందుకు ఇంకా ఎంతో కాలం పోరాడాల్సే ఉందని వాస్తవాలు సూచిస్తున్నాయని న్యూయార్క్‌కు చెందిన అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ ఈక్వాలిటీ నౌ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తైనా బీన్ అయిమే పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి కమిషన్ ఆన్ ది స్టేటస్ ఆఫ్ ఉమెన్ (సిఎస్‌డబ్ల్యు) ఇటీవల రెండు వారాల సదస్సు జరిపింది. మహిళల పట్ల స్పష్టంగా వివక్షత చూపే చట్టాలను మెక్సికో, లెసోతో, కువైట్, టర్కీ, రుమేనియా, సెర్బియా, పెరూ, ఫ్రాన్స్, స్విడ్జర్లాండ్ సహా పలు దేశాల్లో రద్దు చేయడం లేదా సవరించడం జరగలేదని ఈక్వాలిటీ నౌ ఆ సదస్సులో వెల్లడించింది. ఇలాంటి చట్టాలను తొలగించడానికి ప్రభుత్వాలకు ఏమీ ఖర్చు కావడం లేదా బడ్జెట్ అవసరం లేనప్పటికీ వాటి తొలగింపులో చాలా స్వల్ప పురోగతి మాత్రమే ఉన్నట్లు బీన్ అయిమే తెలిపారు. 'లైంగిక వివక్షను ప్రోత్సహించే చట్టాలను రద్దు చేస్తామని అనేక వాగ్దానాలు చేసినప్పటికీ అవి అమలు కాలేదు. ఆ చట్టాలు మహిళలకు న్యాయాన్ని పొందే హక్కును తిరస్కరించడం, సమాజంలో వారు పూర్తి స్థాయిలో భాగస్వాములు కావడాన్ని అడ్డుకోవడం చేస్తున్నాయి' అని ఆమె చెప్పారు.

సిఎస్‌డబ్ల్యు మహిళా సదస్సు

1995లో చైనాలో జరిగిన నాల్గవ ప్రపంచ మహిళా సదస్సులో 189 దేశాలు బీజింగ్ ప్రకటనను ఆమోదించాయి. తమ చట్టాల పుస్తకం నుంచి వివక్షాపూరిత చట్టాలను తొలగించాల్సిందిగా అది ఐరాస సభ్య దేశాలకు విజ్ఞప్తి చేసింది. 45 మంది సభ్యుల సిఎస్‌డబ్ల్యు పూర్తిగా జండర్ సమానత్వం, మహిళల పురోగతికి సంబంధించిన అంశాలపైనే చర్చించింది. ఈ సంవత్సరపు సిఎస్‌డబ్ల్యు సదస్సును బీజింగ్ డిక్లరేషన్, కార్యాచరణ వేదిక 15వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని జరుపుతున్నట్లు అటావాకు చెందిన అంతర్జాతీయ అభివృద్ధి పరిశోధనా కేంద్రం (ఐడిఆర్‌సి)లోని మహిళల హక్కులు, పౌరసత్వ కార్యక్రమం నేత డాక్టర్ రవ్వీడా బక్షా తెలిపారు. బీజింగ్‌లో జరిగిన సదస్సు ప్రపంచంలోనే అతి పెద్ద మహిళా సదస్సని, అందులో పలు దేశాలకు చెందిన 40 వేల మంది మహిళలు పాల్గొన్నట్లు ఆమె పేర్కొన్నారు. బీజింగ్ సదస్సులో మహిళలు, బాలికల పేదరికం, మానవహక్కులు, విద్య, ఆరోగ్యం, రాజకీయ విధాన నిర్ణయాల్లో వారికి సమానమైన అవకాశాలు, ముఖ్యంగా యుద్ధాలు, పోరాటాల సమయంలో వారు నిరంతరం ఎదుర్కొనే హింస వంటి వాటిపై ప్రధానంగా చర్చించారు. వాటితో పాటు ఇప్పుడు మహిళలు హెచ్‌ఐవి/ఎయిడ్స్, ఇతర అంటువ్యాధులు, వాతావరణ మార్పు, ఆహార అభద్రత, ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సంక్షోభం వంటి వాటితో సహా మహిళల హక్కులు, లైంగిక సమానత్వం వంటి వాటిని స్పష్టంగా చవిచూస్తున్నట్లు బక్షా తెలిపారు. 1995 బీజింగ్ సదస్సు సమయంలో ప్రపంచవ్యాప్తంగా మహిళా పార్లమెంటేరియన్లు 10.5 శాతంగా ఉండగా ఈ పదిహేనేళ్ళలో వారి సంఖ్య 20 శాతానికి తక్కువగానే ఉన్నట్లు ఆమె తెలిపారు. అదొక కోణమైతే ఈ కాలంలో మత మౌఢ్యం పెరగడం, సంస్కృతి ముసుగులో మహిళలకు హానికల్గించే చర్యలను ముందుకు నెట్టడం జరిగింది. గత రెండు దశాబ్దాలుగా పలు జాతీయ, అంతర్జాతీయ మహిళా ఉద్యమాలు అనూహ్యమైన పాత్ర పోషించాయి. మహిళలకు సాధికారత, వారి హక్కుల రక్షణ ద్వారా ఆర్థికాభివృద్ధి, పేదరిక నిర్మూలన, పర్యావరణ భద్రత, మానవహక్కులు, శాంతి దిశగా సాగేందుకు ఈ ఉద్యమాలు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నాయి.

క్యూబా మహిళలకు సమాన హక్కులు

క్యూబా మహిళలు పురుషులతో సమానంగా ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాలతో పాటు కుటుంబంలో కూడా సమాన రాజ్యాంగ హక్కులు కలిగి ఉన్నారు. దేశ అభివృద్ధిలో మహిళల పూర్తి స్థాయి భాగస్వామ్యం కలిగి ఉండేందుకు వీలుగా క్యూబా రాజ్యాంగంలోని 44వ అధికరణం వారికి పురుషులతో సమానంగా అవకాశాలు, హక్కులను గ్యారంటీ ఇస్తోంది. వారు పార్లమెంటులో 35 శాతం స్థానాలను కలిగి ఉన్నారు. రాజకీయ జీవితంలో మహిళల భాగస్వామ్యానికి సంబంధించి 162 దేశాల్లో క్యూబా ఆరవ స్థానంలో ఉంది. రామొన్ గ్రావ్ వంద రోజుల ప్రభుత్వ కాలంలో 1933లో క్యూబా మహిళలకు మొదటిసారిగా ఓటు హక్కు లభించింది. 1959లో క్యూబా విప్లవం విజయవంతమైన తరువాత క్యూబా మహిళా ఫెడరేషన్ ఒక ఎన్జీఓగా రూపుదిద్దుకుంది. క్యూబాలో మహిళల పురోగతికి ఒక జాతీయ యంత్రాంగంగా క్యూబా ప్రభుత్వం ఫెడరేషన్‌ను గుర్తించింది. అందులో దేశంలోని 14 ఏళ్ళ పైబడిన మహిళల్లో 85.2 శాతం మంది లేదా 30 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. అక్కడ జాతీయ స్థాయిలో మహిళల శిక్షణా కేంద్రం, పబ్లిషింగ్ హౌస్ ఉన్నాయి. ఆ ఫెడరేషన్ క్యూబా విప్లవ రక్షణకు ప్రభుత్వ లక్ష్యాలకు కట్టుబడి పని చేస్తుంది. ఉన్నత విద్యా స్థాయిలో మహిళలు గ్రాడ్యుయేట్లలో 49.5 గానూ, యూనివర్శిటీ విద్యార్థుల్లో 62 శాతం గానూ ఉన్నారు. పార్లమెంటు సభ్యుల్లో 35 శాతంగానూ, అటార్నీల్లో 61 శాతం గానూ, న్యాయమూర్తుల్లో 49 శాతంగానూ, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో 47 శాతం గానూ ఉన్నారు. వారికి పూర్తి వేతనంలో ఒక సంవత్సరం మెటర్నిటీ సెలవు ఉంది.

మొరేల్స్ విప్లవంలో అగ్రభాగాన ...

బొలీవియా అధ్యక్షుడు మొరేల్స్ విప్లవంలో మహిళలు చోదక శక్తిగా ఉన్నారు. పలు రంగాల్లో వారు ఎన్నో విజయాలు సాధించారు. 19వ శతాబ్దం ప్రారంభంలో స్పెయిన్ వలసవాదం నుంచి దేశానికి స్వాతంత్ర్యం సంపాదించేందుకు బొలీవియా మహిళలు పురుషులతో సమానంగా పోరాటం చేశారు. వారు గుర్రాలపై ఎక్కి పోరులో ముందుండి నగరాలను ఆక్రమించారు. 'మహిళలమైన మేము చాలా కాలం పాటు మినహాయింపుకు గురయ్యాం. అది వలసవాద నమూనాలోని చీకటి వారసత్వాల్లో ఒకటి' అని ఇటీవల న్యాయశాఖ మంత్రిగా నియమితులైన నిల్డా కోపా చెప్పారు. 'మా అమ్మకు చదవడం, రాయడం రాదు. మా అమ్మమ్మది కూడా అదే పరిస్థితి అని నాకు గుర్తుంది. వారు నేర్చుకోవాలనుకోనందున ఆ



పరిస్థితిలో లేరు' అని కోపా తెలిపారు. స్వదేశీ తిరుగుబాటుదారు బార్టోలినా సిసా, స్వాతంత్ర్య చిహ్నం జుయానా అజుర్దుయే వంటి బొలీవియా వీరనారీమణుల నినాదాలతో ఉన్న పోస్టర్లను నేడు పలు మంత్రిత్వశాఖల గోడలపై అంటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు మహిళలు దేశాన్ని నడపడంలో నిమగ్నమయ్యారు. దేశ కేబినెట్‌లో పది మంది పురుషులు, ముగ్గురు స్వదేశీ తెగలకు చెందిన వారితో సహా పది మంది మహిళలున్నారు. 'గతంలో జాత్యహంకారం, పురుషాధిక్యత ఉండేది. ఇప్పుడు కూడా కొంత ఉన్నప్పటికీ సోదరుడు ఇవో మొరేల్స్ విధానాల మూలంగా ఆ వ్యవస్థలో మార్పు వస్తోంది' అని కోపా తెలిపారు. 'ఉదాహరణకు నేడు మహిళా నిరక్షరాస్యులు లేరు. అంతేగాక పురుషులతో సమాన స్థాయిలో కార్యకలాపాలను అభివృద్ధి చేయగలిగినంత సామర్థ్యంలో ఉన్నారు. కానీ పోరు తీవ్రంగా, దీర్ఘకాలంగా సాగించాల్సి ఉంది' అని ఆమె అన్నారు. బొలీవియా నూతన చట్టసభలో మహిళలు 30 శాతంగా ఉన్నారు.

అణచివేతలో ఆఫ్ఘన్ మహిళలు

ఆఫ్ఘనిస్తాన్‌లో ఇప్పటికీ వివక్షాపూరిత చట్టాలు అమలులో ఉన్నాయి. అవి చాలవన్నట్లు గత సంవత్సరం ఆ దేశ అధ్యక్షుడు షియా పర్సనల్ స్టేటస్ చట్టాన్ని అక్కడి మహిళలపై రుద్దారు. అందులో భర్త కుటుంబ పెద్దగా ఉండటంతో పాటు భార్య కదలికలను నియంత్రించే హక్కు కూడా కల్పించారు. భర్త అనుమతి లేకుండా, తన కుటుంబానికే చెందిన ఒక పురుషుడు తోడు లేకుండా బయటికెళ్ళేందుకు అక్కడి వారికి అవకాశం లేకుండా ఆ చట్టం చేసింది. అంతేగాక ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, టర్కీ వంటి పలు దేశాల్లో కుటుంబ గౌరవం పేరిట జరుగుతున్న హత్యలు ఇలీవలి కాలంలో పెద్ద ఎత్తున బయటపడుతున్నాయి. ఆఫ్ఘన్‌లో ప్రతి 30 నిమిషాలకూ ప్రసవ సమయంలో ఒక మహిళ మృతి చెందుతున్నారు. 87 శాతం మంది నిరక్షరాస్యులుగా ఉన్నారు. కేవలం 30 శాతం మంది బాలికలకు మాత్రమే విద్య అందుబాటులో ఉంది. ప్రతి ముగ్గురిలో ఒకరు భౌతిక, మానసిక లేదా లైంగిక హింసకు గురవుతున్నారు. ఆఫ్ఘన్ మహిళల సగటు జీవిత కాలం 44 ఏళ్ళు. 70 నుంచి 80 శాతం మంది మహిళలు బలవంతపు పెళ్ళిళ్ళు, బాల్య వివాహాలు చేసుకోవలసి వస్తోంది.

- ఎస్.సరోజిని

భారత మహిళల స్థితిగతులు

యూనిసెఫ్ అంచనా ప్రకారం భారత్‌లో గర్భస్థ శిశుహత్యలు, బాలికల్లో మరణాల రేటు ఎక్కువగా ఉండడం వల్ల ఐదు కోట్ల మంది వరకు బాలికలు, మహిళలు అదృశ్యం అవుతున్నారు.

-వ్యవసాయేతర ఉపాధిలో మహిళలు 17శాతమే. పట్టణ శ్రామికశక్తిలో మహిళలు 13.9శాతం, గ్రామాల్లో 29.9శాతం ఉన్నారు.

-పురుషుల వేతనాల్లో 75శాతమే స్త్రీలకు ఇస్తున్నారు. కుటుంబ ఆదాయంలో మహిళల వాటా 25శాతమే. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ స్త్రీ-పురుషులకు సమానవేతనాలు లేవు.

-హైకోర్టుల న్యాయమూర్తులుగా నాలుగు శాతం, యాజమాన్య ఉద్యోగాలలో మూడుశాతం మాత్రమే మహిళలు.

-24.5 కోట్ల మంది భారత మహిళలకు చదవడం, రాయడం రాదు.

-మహిళలకు సగటున రోజుకు 2200 కాలరీల శక్తి అవసరం కానీ 1400 కాలరీలనిచ్చే ఆహారాన్ని మాత్రమే తీసుకుంటున్నారు.

92శాతం మంది మహిళలు స్త్రీ సంబంధ వ్యాధులకు గురవుతున్నారు.

-రోజుకు 300 మంది మహిళలు ప్రసూతి లేదా సంబంధిత కారణాలతో మరణిస్తున్నారు.



అతుకుల బతుకులు

మహిళా హోంగార్డుల జీవన చిత్రం

"పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా... వేతనాల్లో, సౌకర్యాల్లో మాత్రం ఆ విధమైన సమానత్వం లేదంటూ మహిళా హోంగార్డు వనజ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఏడు సంవత్సరాలుగా చేస్తున్నా తనకు నెలకు 3900 రూపాయలు వేతనం మాత్రమే ఇస్తున్నారని చెప్పింది. ఇదే సమస్యను రాష్ట్రంలోని 4968 మంది మహిళా హోంగార్డులూ ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడిగా చేస్తున్నా ప్రభుత్వం వారిని బానిసలుగా చూస్తుందే తప్ప, సేవల్ని గుర్తించడంగానీ, అందుకు తగిన పరిహారం చెల్లించడంగానీ లేదు.

"ఓ రోజు ముఖ్యమైన పనుండి, డ్యూటీకి రాలేదు. ఈ విషయం ఎస్ఐకి చెప్పాను కూడా. అయినా మూడ్రోజుల వేతనం కట్‌చేశారు" అని తన అనుభవాన్ని చెప్పింది హోంగార్డు చంద్రకళ. ఒక్కరోజు రాకపోతే రెండుమూడ్రోజులకు వేతనాలు కట్‌చేస్తుంటారని హోంగార్డులు సరోజ, కవిత అంటున్నారు. ఆ విషయమై మీరు అడగరా? అని ప్రశ్నిస్తే? అడిగినా ఫలితముండదని సమాధానమిచ్చారు. పై అధికారులు ఏది చెప్తే అది వింటూ, అణిగి మణిగి ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు (పేరు చెప్పడానికి ఇష్టపడలేదు) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హోంగార్డులుగా చేరే వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చినవారే. అందులోనూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారే ఎక్కువమంది ఉంటున్నారు. జీవన భద్రతకోసం కొందరు చేస్తుంటే... ఏదో ఒకరోజు కానిస్టేబుల్‌గా అవకాశం దక్కుతుందన్న ఆశతో మరికొందరు చేస్తున్నారు. కానీ వాళ్ల ఆశలు అడియాశలే అవుతున్నాయి. పదిపదిహేనేళ్ల నుంచి చేస్తున్న వారు కూడా నేటికీ హోంగార్డులుగానే కొనసాగుతున్నారు తప్ప కానిస్టేబుల్ కావాలన్న వాళ్ల కల కలగానే మిగిలిపోతోంది.

తమకు హోంగార్డు కోటా కింద కానిస్టేబుల్ ఉద్యోగాలివ్వాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని సుకన్య చెబుతోంది. గతంలో హోంగార్డులు ఆందోళన చేస్తే అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని నాటి హోంమంత్రి జానారెడ్డి హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదు. ఆ తర్వాత వచ్చిన హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా తమను పట్టించుకోవట్లేదని మహిళా హోంగార్డులు అంటున్నారు.

ఎనిమిది గంటల డ్యూటీ విధానమున్నా చాలామంది హోంగార్డులతో ప్రభుత్వం అదనపు గంటలు చేయించుకుంటోంది. పోనీ అందుకు తగిన వేతనమైనా చెల్లిస్తోందా అంటే అదీ లేదు. జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న వారితో డ్యూటీ టైం అయిపోయినా అక్కడుండే ఉన్నతస్థాయి అధికారులు కొందరు తమ ఇళ్లలో కూరగాయలు తరగడం, బట్టలు ఉతకడం, చిన్నపిల్లల్ని స్కూలు నుంచి తీసుకురావడం లాంటి పనులు చేయించుకుంటున్నారని మహబూబ్‌నగర్, గుంటూరు, కడప జిల్లాలకు చెందిన (పేరు చెప్పడానికి ఇష్టపడలేదు) హోంగార్డులు వాపోతున్నారు. ఈ విషయాలన్నీ ఎందుకు బయటికి చెప్పరని వాళ్లను అడిగితే "చెప్తే ఉన్న ఉద్యోగం కూడా ఊడుతుంది కదా! దయచేసి మీరు కూడా మేం చెప్పినట్లు రాయకండి" అని వేడుకున్నారు. దీన్నిబట్టి చూస్తే మహిళా హోంగార్డులు ఎంత వెట్టిలో మగ్గుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వం హోంగార్డులతో నిర్బంధ చాకిరీ చేయించడమేగాక శ్రమకు తగిన వేతనాలు చెల్లించకుండా, సౌకర్యాలు కల్పించకుండా నిరంతర దోపిడీకి గురిచేస్తోంది. ఎన్నిసార్లు వాళ్ల సమస్యలు చెప్పుకున్నా ఏమాత్రమూ పట్టించుకోవట్లేదు. "మేం చేస్తున్న డ్యూటీ రెగ్యులర్ ఉద్యోగులకు ఏమాత్రమూ తీసిపోదు. వారికి కల్పించే ఏ ఒక్క సౌకర్యమూ మాకు వర్తించట్లేదు" అంటున్నారు మహిళా హోంగార్డులు. పండగలప్పుడు సెలవు తీసుకునే అవకాశం కూడా వీరికి లేదు. తీసుకుంటే గనుక ఆ రోజు జీతం (రూ. 130)తోపాటు మరో రెండ్రోజులదీ కట్ చేస్తారు. అసలే పేద, మధ్య తరగతి కుటుంబాల వారు కావడంతో చాలామంది హోంగార్డులు సెలవులు కూడా తీసుకోకుండా పనిచేస్తున్నారు. కనీస వినోదానికి కూడా దూరంగా ఉంటున్నారు.

"ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఉద్యోగులకూ ఎంతోకొంత మేలు జరుగుతోంది. మా హోంగార్డు బతుకుల్లో మాత్రం ఏ మార్పూ లేదు. ఇట్లయితే ఎట్లా బతకాలి?" అని నిరాశ వ్యక్తం చేస్తున్నారు చాలామంది. ప్రసూతి సెలవులు కూడా ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రసూతి సెలవులు తీసుకున్నప్పుడూ, దీర్ఘకాలిక సెలవులో వెళ్లినప్పుడూ ఆ కాలానికి ఎలాగూ వేతనమివ్వరు. ఆ తర్వాతనైనా ఉద్యోగం తమకు ఉంటుందన్న నమ్మకం కూడా లేకుండాపోయిందని హోంగార్డులు చెబుతున్నారు. ఐదారు రోజులు సెలవు తీసుకొని తిరిగొస్తే తమను డ్యూటీలోకి తీసుకుంటారన్న గ్యారంటీ కూడా లేదని వాపోతున్నారు. ఎవరైనా చేయి తడిపితే ఐదు, పదివేలకు కక్కుర్తిపడే పోలీసు అధికారులు ఆ హోంగార్డు ఉద్యోగాన్ని కూడా లంచానికి అమ్ముకునే పరిస్థితులు అక్కడక్కడా ఉన్నాయి. ఇవేగాక తమకు ఉద్యోగ భద్రతగానీ, సౌకర్యాలుగానీ లేవని మహిళా హోంగార్డులు చెబుతున్నారు.

పోలీస్‌స్టేషన్లల్లో వీరికి భద్రతగానీ, సౌకర్యాలుగానీ ఉండట్లేదు. టాయ్‌లెట్లు, బాత్‌రూములు, విశ్రాంతిగదులు లాంటివి కూడా అన్నిచోట్లా లేవు. ఉన్నచోట అవి రెగ్యులర్ ఉద్యోగులవనో, అధికారులు వాడేవనో వీరిని వినియోగించుకోనివ్వట్లేదు. యూనిఫాం మార్చుకునే అవకాశం కూడా పోలీస్‌స్టేషన్లలో లేదు. ఇంటినుంచే యూనిఫాంలో రావాలి. మళ్లీ ఇంటికెళ్లే మార్చుకోవాలి. నిరంతరం చాకిరేగాక లైంగిక వేధింపులకూ గురౌతున్నారు. ఇటీవల విశాఖలో ఒక పోలీసు అధికారి హోంగార్డు ఇంటికెళ్లి లైంగికంగా వేధించిన సంఘటనే ఇందుకు నిదర్శనం. ఇప్పటికైనా ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలనీ, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలనీ కోరుతున్నారు. హోంగార్డు కోటాకింద కానిస్టేబుల్ ఉద్యోగాలివ్వాలని, హోంగార్డుల సంక్షేమంకోసం, ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నారు. మహిళలకు సముచితస్థానం కల్పిస్తాననే ప్రభుత్వ ప్రగల్భాలు వాస్తవ రూపం దాలిస్తే బావుంటుంది.

- ఆజాద్

అరకోర జీవితాలు

ఏం ఉద్యోగం చేస్తున్నావని అడిగితే సమాధానం చెప్పటానికి సాధారణంగా ఎవరూ సందేహించరు. కానీ సేల్స్ గర్ల్స్ సందేహిస్తారు. అందుకు కారణం వారిని చులకనగా చూడటమే. నేటి సమాజంలో హోదాకి, సంపదకు గౌరవం ఇచ్చేవారే అంతా! సంపాదన బట్టి హోదాని నిర్ణయిస్తారు తప్పితే, ఏ ఉద్యోగానికి వుండే విలువ ఆ ఉద్యోగానికి ఉంటుందని మాత్రం గ్రహించరు. అలాంటి చిన్న చూపుకు గురవుతున్నవారే సేల్స్ గర్ల్స్. అది వారి తప్పు కాదు. కుటుంబ పరిస్థితులు సరిగా లేక వారు చదువుకోవటం కుదరలేదు. చదువుకొని ఉంటే వారు మనకన్నా మంచి స్థానంలో ఉండేవారేమో!

మనం ఏదైనా దుకాణానికి వెళ్లినప్పుడు మనల్ని వాళ్లెంతో మర్యాదగా పలకరిస్తారు. ఏం కావాలండీ? ఏం కావాలండీ అని మన వెంటే వుంటూ కావాల్సినవి అందిస్తారు. ఎంతో ఓర్పుతో, సహనంతో సమాధానం చెప్తారు. ఎంత విసిగించినా నవ్వుతూ పలకరిస్తారు. ఆ చిరునవ్వు షాపు మూసే వరకూ వారి పెదాలమీద నుండి చెరగదు. ఉదయాన్నే లేచి ఇంటెడు చాకిరీ చేసి ఉద్యోగానికి బయలుదేరాలి. షాపులో పనిచేసి తిరిగి ఇంటికెళ్లేసరికి పిల్లలు ఆకలితో ఎదురుచూస్తారు. వారికి చకచకా వండివార్చాలి. మరల ఉదయానికి అన్నీ సమకూర్చుకోవాలి. పడుకునేసరికి అర్ధరాత్రవుతుంది. ఇంతా కష్టపడినా చాలిచాలని జీతం, అవమానాలు. ఎందుకు ఆడవారికి మాత్రమే ఇన్ని అవమానాలు?

సుజాత అనే సేల్స్ గర్ల్స్ మాట్లాడుతూ, "ఉదయం పది గంటలకు వెళ్లి మరలా రాత్రి పది గంటలకు ఇంటికి చేరుకుంటాం. విశ్రాంతనేదే వుండదు, ఉదయం నుండి సాయంత్రం వరకు నుంచొని వుండాలి. ఇంట్లో పనంతా చేసుకొని వచ్చి ఇక్కడ పని చేసి మరలా ఇంటికి వెళ్లి పని చేయాలంటే ఎంతో అలసటగా వుంటుంది. సమయానికి బస్సులు అందీ అందక ఒక్కోసారి ఇంటికి ఆలస్యంగా వెళ్తాము. ఇలా 365 రోజులు పనిచేయాల్సి వస్తుంది. ముందుగా చెప్పి మరీ సెలవు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో సెలవు పెడితే తిట్లు తప్పవు. జీతంలో కోత తప్పదు. అంతెందుకు ఒక్క పది నిమిషాలు ఆలస్యంగా వచ్చినా చివాట్లు పెడతారు. కస్టమర్లు ఎన్ని రకాలుగా విసిగించినా సర్దుకుపోవటం తప్ప ఏమీ చేయలేం. మాకు వీలైనంత వరకు ఓపికగా సమాధానం చెప్తాము. లేకుంటే మా ఉద్యోగాలు పోయినట్లే. భోజనానికి మధ్యలో ఎవరైనా కస్టమర్ వస్తే సగంలో లేచి రావాలి. దీర్ఘకాల సెలవు కావాలంటే ఉద్యోగం మానేయమంటారు. ఇంతా కష్టపడితే నెలకు మూడువేలు జీతం" అని వాపోయింది.

సుజాత తన సాధక బాధకాలు చెపుతున్న సమయంలో తోటి ఉద్యోగస్తుడు పైఅధికారులను పిలుచుకొచ్చి ఆమెను తిట్టించాడు. మాటల్లో పడి కస్టమర్లను పట్టించుకోవటం లేదని ఆమెపై రంకెలు వేశారు. నిజం చెప్పాలంటే ఆ విభాగానికి కస్టమర్లెవరూ రాలేదు. అయినా ఆమె మరొకరితో మాట్లాడటం తోటి ఉద్యోగస్తుడే సహించలేకపోయాడు. తోటివారికే మహిళా ఉద్యోగి పట్ల చులకన భావముంటే ఇక ఇతరుల సంగతి చెప్పాలా?!

మరో సేల్స్ గర్ల్ మమత మాట్లాడుతూ "కస్టమర్లు ఎక్కువగా విసిగిస్తారు. కావల్సింది సరిగా అడగకుండా ఇది కావాలి అది కావాలి అని అడుగుతారు. అది లేదా ఆ మోడల్ లేదా అని ప్రశ్నిస్తారు. వుంటే వారికి చూపించకుండా దాచుకోంకదా! వారు మమ్మల్ని కొంచెం అర్థం చేసుకుంటే బాగుంటుంది. అందరి మహిళా ఉద్యోగుల వలే ఉదయాన్నే లేచి అన్ని సమకూర్చుకొని, మరలా రాత్రికి ఇంటికి వచ్చి పనంతా చేసుకుంటాం. కానీ జీతాలు మాత్రం నామమాత్రమే. కష్టానికి తగ్గ ప్రతిఫలం దొరకదు సరికదా సరైన గౌరవానికీ నోచుకోం. చదువుకోలేక పోవడం వల్ల సర్దుకుపోవటం తప్ప చేసేదేమీలేదు" అంటూ ఆవేదన వెళ్లగక్కింది.

సరళ అనే సేల్స్ గర్ల్ అసలు మాట్లాడటానికే భయపడుతుంది. ఏమడిగినా మా యజమానిని అడగండనే సమాధానం. ఏం చెపితే ఏమొస్తుందోననే భయం ఆమె నోరు నొక్కేస్తుంది. ఎంత కాలమిలా మహిళలు తప్పుచేయకున్నా యజమానులకు భయపడాలి.

ఈ మాట మీదే మాలతి అనే మరో సేల్స్ గర్ల్ మాట్లాడుతూ "తప్పదు. అది మా ఉద్యోగ ధర్మం. వారంటారు మేం పడాలి. ఒక్కోసారి కస్టమర్లు అడిగిందల్లా చూపించినా కొనకుండా వెళ్లి పోతారు. అప్పుడు మనస్సు చివుక్కుమంటుంది. కానీ అలవాటయ్యే కొద్ది అవన్నీ సహజంగా అనిపిస్తాయి. తక్కువ మందిమి ఉన్నా వచ్చిన ప్రతి వారినీ ఎటెండవ్వాలి. లేకుంటే కసురుకుంటారు. ఒక్క ఐదు నిమిషాలు ఓపిక పట్టలేని వారు గంటల కొద్దీ మేము నుంచొనే ఉద్యోగం చేస్తున్నామని అర్థం చేసుకోరు. నేను పని చేసేది ఓ చిన్న కొట్టులో. కానీ పని ఎక్కువే ఉంటుంది. తప్పదు కదా! చదువుకొనుంటే మేమిన్ని కష్టాలు అనుభవించాల్సి వచ్చేది కాదు. కుటుంబ పరిస్థితులు అనుకూలించక మా బతుకులిలా తగలడ్డాయి" అంటున్న ఆమె గొంతులో జీవితం పట్ల నిర్వేదం.

ఇలా ఒక్కొక్కళ్లు వారి బాధను వ్యక్తపరుస్తూ... వారి కష్టాలను వివరించారు. చివరికి అందరిదీ ఒకటే మాట. "ఆడదానిగా పుట్టినందుకు ఈ కష్టాలు అనుభవించక తప్పదు. అందరకూ అన్ని దొరకవు. దొరికిన వాటితోనే తృప్తి పడాలి. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు సరిగా లేక వేడి నీళ్లకు చన్నీళ్ల తోడుగా భర్తకు సాయపడటం తప్ప మరిక ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి ఆడదానిది" అని ఆక్రోశాన్ని వ్యక్తం చేస్తున్న వారి గొంతులు చాలు... సభ్య సమాజం సిగ్గుతో తల వంచుకోవడానికి. వారి కష్టాన్నీ, రాత్రింబవళ్లూ పడుతున్న శ్రమను గుర్తించడం పోయి వారికి కనీసం గౌరవ మన్ననలు లభించడం లేదు.

చేస్తున్న ఉద్యోగం, హోదాను బట్టికాక శ్రమను బట్టి గౌరవమిచ్చే రోజులు ఎప్పుడొస్తాయో?

- ఎం.శిరీష

వలస పక్షులు

ఉన్న ఊళ్లో పనిలేదు. పిల్లలను పస్తులు పెట్టలేక పొట్ట చేత పట్టుకుని పట్నమొచ్చినా అదే సీను. ఉండడానికి ఇల్లుండదు. స్నానానికి మరుగుండదు. పిల్లలకు చదువుండదు. భద్రతా కరవే. వీటికి తోడు లైంగిక వేధింపులు. ఈ వలసపక్షుల మనోగతం...

'ఉన్న ఊళ్లో పని లేకపాయే, పట్నమొస్తేనేమో పస్తులుండుడాయే' ఎలా బతకాలో తెలవడం లేదని పాలమూరుకు చెందిన లక్ష్మి తన గోడును వినిపించింది. బిల్డింగ్ పనికిపోయినా, అక్కడ కూడా ఇప్పుడు సరిగా పని దొరకడంలేదు. పది సంవత్సరాలుగా ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ ఎదుర్కోలేదని కూలీలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు గడవక వడ్డీ వ్యాపారస్థుల వద్ద నూటికి పది రూపాయల చొప్పున అప్పులు తెచ్చుకుంటున్నామని అన్నారు. అప్పులు తీర్చలేక పరేషాన్ అవుతున్నామని మెదక్ జిల్లాకు చెందిన లక్ష్మమ్మ తెలిపారు.

వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన వారు ఎక్కువ శాతం భవన నిర్మాణ రంగంలోనే కొనసాగుతున్నారు. అసలే ఆర్థికసంక్షోభంతో నిర్మాణ రంగం కుదేలైంది. దీంతో అరకొర పనులు దొరుకుతున్నాయి. ఈనేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న వేర్పాటువాద ఉద్యమాలు కూడా దీనికి తొడైనాయి. దీంతో నిర్మాణరంగంలో పనులు లభించక గంటల తరబడి కూలీ అడ్డాలపైనే పడిగాపులు కాస్తున్నారు. వారానికి ఒకటి, రెండు రోజుల పని దొరకడంతో వలస కూలీల బతుకులు ఛిద్రమవుతున్నాయి. సాఫ్ట్‌వేర్ పరిస్థితి బాగుండే కాలంలో బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని ఇళ్ల కట్టడాలు జరిగేవి, సంక్షోభం ప్రభావం వల్ల ఉద్యోగాలు పోవడంతో రియల్ఎస్టేట్ రంగం బాగా దెబ్బతిన్నది. దీంతో అపార్ట్‌మెంట్లను నిర్మించే బిల్డర్లకు బ్యాంకుల నుండి రుణ సహాయం అందడం లేదు. బిల్డర్లు పెద్ద అపార్ట్‌మెంట్లను కట్టడం నిలిపేశారు. కట్టడాల నిర్మాణం కూడా నాలుగో వంతుకు పడిపోయిందని నిపుణుల అంచనా. దీంతో భవన నిర్మాణ కార్మికులు అందునా మహిళలు రోడ్డున పడ్డారు. ప్రస్తుతం కూలీ రేట్లను సగానికి తగ్గించారు. ఇదంతా నాణానికి ఒకవైపైతే ఒంటరి మహిళల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది.

నిర్మాణరంగంలో పనులు డీలా పడడంతో మహిళలు బస్తీల్లో చెత్త ఏరేపని, పాచిపనుల్లోకి మారారు. భార్యాభర్తలైతే చెత్తను రిక్షాలకు ఎత్తి లాగుతూ మున్సిపాలిటి వాహనాలకు చేరవేస్తున్నారు. ఇంటికి పది రూపాయల చొప్పున వసూలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పాచి పని చేసేవారు నాలుగైదు ఇళ్లల్లో పనిచేస్తేగానీ నెలకు రూ.1500 నుంచి 2000 వరకు సంపాదన వస్తుందని మెదక్ జిల్లాకు చెందిన అంజమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. చాలీచాలని సంపాదనతో హైదరాబాద్ నగరంలో బతుకీడ్చలేక పోతున్నామని అంటున్నారు. పిల్లలను కూడా స్కూలు మానిపించి, హోటల్, కిరాణా దుకాణంలో పనికి పెడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో భార్యాభర్తలు, పిల్లలు పనిచేసినా కూడా కుటుంబం గడవడం లేదని వరంగల్‌కు చెందిన రాజమణి వాపోయింది. కొంతకాలంగా మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్, నల్గొండ, శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం జిల్లాలకు చెందిన కూలీలు మాత్రమే హైదరాబాద్‌కు వలస వస్తున్నారు. వీరిలో ఎక్కువశాతం మంది ఇంటి అద్దె కట్టలేక నిర్మాణంలో ఉన్న భవనాల దగ్గరే తాత్కాలికంగా గుడిసెలు వేసుకుంటున్నారు. ఈమధ్యకాలంగా ఒకే ప్రాంతానికి చెందిన కొన్ని కుటుంబాలు డాబాపై ఖాళీ భాగాన్ని అద్దెకు తీసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన సూమారు వెయ్యి కుటుంబాలు ఈవిధంగా డాబా పైభాగాన్ని అద్దెకుతీసుకొని దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. చెర్లపల్లిలోనూ ఇదే జిల్లాకు చెందిన 5వేల మంది తాత్కాలిక నివాసాలను ఏర్పరుచుకున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో మహిళా కూలీలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వీరు రాత్రి వేళల్లోనే మల విసర్జన, స్నానంలాంటి కార్యక్రమాలను చేసుకుంటున్నారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పనిచేసే ప్రాంతాల్లో మహిళా కార్మికులకు ఎలాంటి భద్రతా, రక్షణా లేదు. పొట్ట కూటి కోసం వచ్చిన మహిళలను మానసికంగా, శారీరకంగా వేధించే సంఘటనలు కోకొల్లలు. ఎదిరిస్తే పనుల్లోంచి తీసేస్తారేమోనని భయంతో మౌనంగా బతుకీడుస్తున్నారు. పని జరిగే ప్రాంతాల్లో మహిళలకు మరుగుదొడ్లను కూడా బిల్డర్లు ఏర్పాటు చేయడంలేదు. దీంతో చాలా మంది మహిళలకు మూత్రాశయ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వలసలను నివారించామని ప్రభుత్వం గారడీ లెక్కలు చెబుతుంది. పట్టణాలకు వలస వచ్చి పనుల్లేక పస్తులతో బాధపడుతున్న కూలీలను చూస్తే పరిస్థితి అర్థమవుతుంది. హైదరాబాద్ నగరంలోని 160 అడ్డాల్లో సుమారు 3 లక్షల మంది వలస కూలీలు భవన నిర్మాణరంగంలోనే పనిచేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధిహామీ పథకాన్ని విస్తరిస్తేనైనా సమస్య పరిష్కారం అవుతుందేమో!

-శ్రీనివాస్

ప్రధాన మహిళలు

మహిళలు ఇంటినే కాదు తమ అపారమైన తెలివితేటలతో దేశాన్ని కూడా నడిపించగలరని నిరూపించారు. ప్రపంచంలోని అనేక మంది మహిళలు తమ తమ దేశాలకు ప్రధాన మంత్రిగా, రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, హోం... ఇలా ఒకటేమిటి అన్ని ప్రధానశాఖల్లోనూ అత్యుత్తమమైన బాధ్యతలను నిర్వహించి శాంతిభద్రతలను నెలకొల్పారు. మనదేశంలో చూస్తే మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రిగా ఇందిరాగాంధీకి ఓ ప్రత్యేక స్థానం ఉంది. మన పొరుగుదేశాలైన శ్రీలంకలో సిరిమావో బండారు నాయకే, చంద్రికా బండారునాయకే కుమారతుంగ, పాకిస్తాన్‌లో బెనజీర్ భుట్టో, బంగ్లాదేశ్‌లో బేగం ఖలేదా జియా, షేక్ హాజీనా వాజెద్ ప్రధాన మంత్రి పదవిని చాకచక్యంగా నిర్వర్తించారు. ఇలా ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలలో మహిళలు ప్రధానమంత్రి పదవికి వన్నె తెచ్చారు.





ప్రతిభామూర్తులు

నేడు మహిళలు విజయం సాధించని రంగం లేదంటే ఆశ్చర్యపడాల్సిన పని లేదు. సమాజంలో అడుగడుగునా ఆటంకాలెదురౌతున్నా, మహిళల పట్ల వివక్ష పెరిగిపోతున్నా లెక్కచేయకుండా తమ ప్రతిభాపాటవాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాతా అపారమైన విజ్ఞానాన్ని పెంపొందించుకుని తీవ్రమైన కృషి సల్పుతున్నారు. రక్షణ, శాస్త్రసాంకేతిక రంగాలు, సామాజిక రాజకీయ రంగాలు, విద్యా వైద్య రంగాలు, ఆర్థిక రంగం, న్యాయ విభాగం, కళలు, క్రీడా రంగం... ఇలా ప్రతి రంగంలోనూ మహిళలు పురుషులకు తాము ఏమాత్రమూ తీసిపోమని ఇంకా చెప్పాలంటే తామే పైచేయని నిరూపించుకుంటున్నారు. కొర్నెలియా సరోబ్జి, విజయలక్ష్మి పండిట్, రాజకుమారి అమృత కౌర్, సరోజినీ నాయుడు, సౌధామిని దేశ్‌ముఖ్, కిరణ్‌బేడి, ఇందిరాగాంధీ, మహారాణి గాయత్రీ దేవి, సుచేతా కృపలాని, సమర్‌జిత్ సంధు, కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్... ఇలా చెప్పకుంటూ పోతే ఇంకా ఎన్నో పేర్లు మిగిలే ఉంటాయేమో!